

'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 309

సోమవారం 30-1-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



లోయలో పడిన బస్సు.. 42 మంది సజీవ దహనం



పాకిస్తాన్‌లో బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 42 మంది సజీవదహనమయ్యారు. వేగంగా వెళ్తున్న బస్సు మలుపులో పిల్లర్‌ను ఢీకొట్టి, లోయలో పడిపోయింది.

- వివరాలు 6లో▶

వారి జీవితాలు స్ఫూర్తిదాయకం



ఈ ఏడాది పద్మ అవార్డులకు ఎంపికైన వారి జీవితాలు, వారు సాధించిన ఘనత గురించి ప్రజలందరూ తెలుసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. .

- వివరాలు 6లో▶

గవర్నర్ల సొంత ఎజెండా!

వీరి తీరుపై నిలదీద్దాం.. బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ భేటీలో కేసీఆర్ సూచన



బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ భేటీలో ఎంపీలతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

- తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఆందోళనకరంగా గవర్నర్ల తీరు
- గవర్నర్ల వ్యవస్థను కేంద్రం దుర్వినియోగం చేస్తోంది
- కేబినెట్ నిర్ణయాలను గవర్నర్లు ఉద్దేశ పూర్వకంగా పెండింగులో పెడుతున్నారు
- వారి అప్రజాస్వామిక విధానాలను, కేంద్రం వైఖరిని ఎంపీలు ఎండగట్టాలి
- ఇతర విపక్ష పార్టీల ఎంపీలను కూడా కలుపుకొని పోరాటం చేయాలి
- గవర్నర్ల జోక్యాన్ని నిరోధించడంపై కార్యాచరణ రూపొందించాలన్న సీఎం
- ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి చేసే ప్రసంగం బహిష్కరించాలని నిర్ణయం!
- బీఆర్‌ఎస్ ఎంపీలకు కేసీఆర్ దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్: దేశంలోని పలు రాష్ట్రాల్లో గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరును వివరిస్తూ పార్లమెంటు వేదికగా కేంద్రాన్ని నిలదీయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పార్టీ ఎంపీలకు సూచించారు. ఆయా రాష్ట్రాల్లో వారి వ్యవహారం ఆందోళనకరంగా ఉందన్నారు. తెలంగాణతో పాటు కేరళ, తమిళనాడు, కేరళ, ఢిల్లీ మొదలైన చోట్ల గవర్నర్లు సొంత ఎజెండాతో పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ప్రగతిభవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అధ్యక్షతన బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. దాదాపు నాలుగు గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో అనేక అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారాల్లో గవర్నర్ల జోక్యాన్ని నిరోధించడంపై దేశంలోని విపక్ష పార్టీల నేతలతో కలిసి కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, దుర్మార్గమైన తీరును దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో

మిగతా 3వ పేజీలో ▶

బడ్జెట్‌కు లభించని గవర్నర్ సిఫారసులు

- ప్రభుత్వ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉంచిన తమిళిసై
- నేడు హైకోర్టులో సర్కారు పిటిషన్?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్ 2023–24 ప్రతిపాదనలను రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సిఫారసులతో రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టాల్సి ఉండగా, ఈ మేరకు ఆమె నుంచి గ్రీన్‌సిగ్నల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తోంది. ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్ర

మిగతా 3వ పేజీలో ▶

మన అమ్మాయిలదే 'ప్రపంచం'

- తొలి అండర్–19 మహిళల టి20 వరల్డ్‌కప్ విజేత భారత్
- ఫైనల్లో ఏడు వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఘనవిజయం
- ఏ స్థాయిలోనైనా భారత మహిళల క్రికెట్ జట్టుకు ఇదే తొలి ప్రపంచకప్

12 లో

దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన అండర్–19 మహిళల తొలి టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు జయభేరి మోగించింది. ఇంగ్లండ్ జట్టుతో ఆదివారం జరిగిన ఫైనల్లో షఫాలీ వర్మ నాయకత్వంలోని టీమిండియా ఏడు వికెట్ల తేడాతో గెలిచి విశ్వవిజేతగా నిలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 17.1 ఓవర్లలో 68 పరుగులకు ఆలౌట్‌కాగా... భారత్ 14 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 69 పరుగులు సాధించి గెలుపొందింది. విజేతగా నిలిచిన భారత జట్టులో తెలంగాణ అమ్మాయిలు గొంగడి త్రిష, యశశ్రీ, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు. ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు బీసీసీఐ రూ. 5 కోట్లు నజరానాగా ప్రకటించింది.

'గ్రేట్' జొకోవిచ్..



ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ 10వసారి విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో జొకోవిచ్ 6-3, 7-6 (7/4), 7-6 (7/5)తో సిట్సిపాస్ (గ్రీస్)పై గెలిచాడు. ఈ గెలుపుతో జొకోవిచ్ మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ అయ్యాడు. విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు 29,75,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 17 కోట్ల 22 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

12 లో

ఆపసోపాలు పడి..



న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 1–1తో సమం చేసింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 100 పరుగుల లక్ష్యాన్ని భారత్ చివరి ఓవర్‌లో ఒక బంతి మిగిలి ఉండగా ఛేదించింది.

- వివరాలు 12లో▶

న్యూస్‌రీల్

ప్రజలు ఏసీడీ చార్జీలు చెల్లించొద్దు



రాష్ట్ర ప్రజలు విద్యుత్ ఏసీడీ చార్జీలు చెల్లించవద్దని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. దీనిపై ప్రజలంతా కేసీఆర్ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ 4వ స్థానంలో ఉందని, అయితే రైతుల ఆత్మహత్యలే లేవని కేసీఆర్ చెప్పడం సిగ్గు చేటన్నారు.

- వివరాలు 3లో▶

అంతర్జాతీయ సమావేశాలకు కేటీఆర్



ప్రపంచ పర్యావరణ– జలవనరుల సమావేశాల్లో కీలకోపన్యాసం చేయడానికి రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు అమెరికన్ సంస్థ నుంచి ఆహ్వానం అందింది. అమెరికా హెండర్సన్‌లో మే 21 –25 తేదీల మధ్య ఈ సమావేశాలు జరుగనున్నాయి.

- వివరాలు 14లో▶

ఆకాంక్షలు నెరవేరేనా!



వచ్చే సార్వత్రిక ఎన్నికల ముందు వస్తున్న చివరి పూర్తి స్థాయి కేంద్ర బడ్జెట్ ఇదే. ఎంత కాదన్నా బడ్జెట్ నిర్ణయాలు, కేటాయింపుల ప్రభావం కొన్ని వర్గాలపై కచ్చితంగా ఉంటుంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ధరల భారాన్ని ఎదుర్కొంటున్నారు. పన్నుల భారాన్ని తగ్గించాలన్న మధ్యతరగతి వినతులు, వివిధ రంగాల ఆకాంక్షలకు ఈ బడ్జెట్ ఏ మేరకు న్యాయం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

- వివరాలు 13లో▶

అర్హులకు మరోమారు దేహదారుఢ్య పరీక్షలు

కొత్తగా మార్కులు కలపడం వల్ల అర్హులయ్యే వారికి నిర్వహణ

- అర్హుల జాబితా నేడు వెబ్‌సైట్‌లో ఉంచనున్న టీఎస్‌ఎల్పీఆర్బీ
- ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు 15నుంచి ఫిజికల్ ఈవెంట్స్
- హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలు



సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీకి సంబంధించి తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్‌ఎల్పీఆర్బీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్షల్లో బహుళ సమాధాన ప్రశ్నల (మల్టిపుల్ ఆన్సర్ క్వశ్చన్స్)కు సమాధానాలు రాసిన అభ్యర్థులకు మార్కులు కలపాలని, ఈ మేరకు అర్హులైన వారికి మరోమారు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ విషయంలో హైకోర్టు ఆదేశాలను అమలుచేస్తూ వచ్చే నెల 15 నుంచి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇలా అర్హత సాధించిన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లను సోమవారం www.tslprb.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు పేర్కొన్నారు.

దరఖాస్తులు నింపండి..

ఇప్పుడు మార్కులు కలపడంతో అర్హత సాధించే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పార్ట్–2 దరఖాస్తును నింపాలని టీఎస్‌ఎల్పీఆర్బీ వెల్లడించింది. వీటిని నింపేందుకు ఫిబ్రవరి 1 ఉదయం 8 గంటల నుంచి ఫిబ్రవరి 5వ తేదీ రాత్రి 10 గంటల వరకు సమయం ఇవ్వనున్నట్టు తెలిపింది. ఇప్పటికే దేహదారుఢ్య పరీక్షల్లో (ఎస్సై లేదా కానిస్టేబుల్) అర్హత సాధించి, బోర్డు తాజా నిర్ణయంతో రాతపరీక్షలో అర్హత సాధించే

మిగతా 2వ పేజీలో ▶

టీచర్ల బదిలీల గడువు పొడిగించే చాన్స్!

- ఉపాధ్యాయ సంఘాల నుంచి ఒత్తిడి.. పరిశీలిస్తున్న అధికారులు
- ఆన్‌లైన్ విధానంలో తికమకలు... అక్కడక్కడా సాంకేతిక లోపాలు
- అప్‌గ్రేడ్ కాని ఆప్షన్లు.. ఎస్జీటీ స్పౌజ్‌లపై ఇంకా రాని స్పష్టత



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ పద్ధతిలో లోపాలు.. అప్‌గ్రేడ్ కాని ఆప్షన్లు.. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు.. ఇలా ఉపాధ్యాయుల బదిలీల్లో తలెత్తిన ఇబ్బందుల దృష్ట్యా దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలని రాష్ట్ర విద్యాశాఖ యోచిస్తోంది. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల నుంచి కూడా ఒత్తిడి తీవ్రస్థాయిలో ఉంది. గడువు పొడిగింపు విషయాన్ని సోమవారం అధికారికంగా వెల్లడించే అవకాశముందని తెలుస్తోంది. టీచర్ల బదిలీలు, పదోన్నతికి సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 28 నుంచి టీచర్లు బదిలీలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సోమవారం ముగుస్తుంది.

ఇప్పటికి 27 వేలమంది..

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం వరకూ 27,668 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నట్టు పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన వెల్లడించారు. ఒకే స్కూల్‌లో 8 ఏళ్లుగా పనిచేస్తున్న వాళ్లను తప్పనిసరిగా బదిలీ చేస్తారు. 5 ఏళ్లు ఒకేచోట పనిచేస్తున్న వాళ్లు బదిలీ సీనియారిటీలో ఉంటారు. ఇలా మొత్తం 70 వేలమంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అయితే, గడువు సమీపిస్తున్నప్పటికీ సగంమంది కూడా దరఖాస్తు చేసుకోలేకపోవడం గమనార్హం. గతంలో ఉపయోగించిన సాఫ్ట్‌వేర్‌నే ఇప్పుడూ వాడుతున్నారని, దీనిని అప్‌గ్రేడ్ చేయలేదని ఉపాధ్యాయ సంఘాలు

మిగతా 2వ పేజీలో ▶

గ్రూప్–4 దరఖాస్తులకు నేడే ఆఖరు



- ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు 7,41,159
- గడువు పొడిగింపునకు వినతుల వెల్లువ.. ఇంకా నిర్ణయం తీసుకోని టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్–4 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ నేటి (సోమవారం)తో ముగియనుంది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) గత డిసెంబర్ 1న గ్రూప్–4 నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి నోటిఫికేషన్‌ను డిసెంబర్ 30న వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టిన టీఎస్‌పీఎస్సీ... అదే రోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. జనవరి 30 వరకు దరఖాస్తులకు గడువు విధించగా... ఇప్పటివరకు 7,41,159 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది.

పోస్టులు తగ్గుతూ... పెరుగుతూ...

గ్రూప్–4 ఉద్యోగాల భర్తీలో పోస్టుల సంఖ్య నిలకడగా లేదు. గత డిసెంబర్ 1న ప్రకటించిన వెబ్‌నోట్ ప్రకారం 9,168 పోస్టులు భర్తీ

మిగతా 2వ పేజీలో ▶

ఇలాంటివేనా?



సార్‌కు చాయ్ ఇస్తే చేయి తగులుతుందేమోనని భయంగా ఉంది.. మీరిచ్చి వస్తారా.. సార్!

రోగులను నిర్లక్ష్యం చేస్తే డిస్మిస్

వైద్యులు, సిబ్బందికి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ హెచ్చరిక

- మలక్‌పేట ఆసుపత్రిలో బాలింతల మృతిని తీవ్రంగా పరిగణించాం
- ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవు
- కొన్ని ఘటనలు మినహా గతేడాది వైద్య శాఖ పనితీరు భేష్ అని కితాబు...
- వైద్య, ఆరోగ్యశాఖ వార్షిక నివేదిక–2022 విడుదల



సాక్షి, హైదరాబాద్: రోగులపట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే డిస్మిస్ చేయడానికి కూడా వెనుకాడబోమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. మలక్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు బాలింతల మృతి ఘటనను తీవ్రంగా పరిగణించామని.. అటువంటి ఘటనలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో కలసి ఆయన వైద్య, ఆరోగ్యశాఖ వార్షిక నివేదిక–2022ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఒకట్రెండు ఘటనలు మినహా గతేడాది వైద్య, ఆరోగ్యశాఖ పనితీరు దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. 'హెల్త్ ఫర్ ఎవ్రీ ఏజ్.. హెల్త్ ఎట్ ఎవ్రీ స్టేజ్.. టువార్డ్స్ ఆరోగ్య తెలంగాణ' అనే నినాదాన్ని తాము ఎంచుకున్నామని వివరించారు. అన్ని వయసుల వారికీ వైద్యం అందించాలని

మిగతా 5వ పేజీలో ▶

4.83 కోట్ల ఔట్ పేషెంట్లు

- గతేడాది ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన వారి సంఖ్య.. ఇన్ పేషెంట్లు 16.97 లక్షలు
- వైద్య ఆరోగ్యశాఖ ప్రగతి నివేదిక వెల్లడి

- వివరాలు 5లో▶



శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న రాహుల్ గాంధీ

నేటితో ముగియనున్న జోడో యాత్ర

- లాల్‌చౌక్‌లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన రాహుల్ గాంధీ
- నేడు శ్రీనగర్‌లో ముగింపు సభ

6 లో

ముగింపు సభకు రాష్ట్ర నేతలు

- వివరాలు 3లో

మంత్రిని కాల్చేసిన ఏఎస్సై

ఒడిశా మంత్రి నవ కిశోర్‌దాస్ విషాదాంతం..

దర్యాప్తునకు ఆదేశించిన సీఎం పట్నాయక్



ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు విశ్వాసపాత్రుడిగా పేరున్న మంత్రి నవ కిశోర్ దాస్ (60).. పోలీసు అధికారి ఒకరు జరిపిన కాల్పుల్లో చనిపోయారు. ఝార్సుగూడ జిల్లా బజరంగ్‌నగర్‌లో జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లినపుడు ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గాంధీచౌక్ వద్ద కారు దిగుతున్న మంత్రిపై అక్కడే ఉన్న అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై) గోపాల్ దాస్ తన వద్ద ఉన్న తుపాకీతో 2 రౌండ్ల కాల్పులు జరిపాడు. ఛాతీలో తీవ్ర రక్తస్రావంతో స్పృహతప్పి పడిపోయిన మంత్రిని ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందారు.

- వివరాలు 6లో



కాల్పుల్లో గాయపడిన మంత్రిని ఆస్పత్రికి తరలిస్తున్నప్పటి దృశ్యం, (ఇన్‌సెట్‌లో) నవకిశోర్ దాస్

క్లుప్తంగా...



విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలి

● హైకోర్టు జడ్జి జస్టిస్ విజయసేన్‌రెడ్డి

రాయదుర్గం (హైదరాబాద్): విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని, అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గంలోని ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ 59వ వార్షికోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు గురువులతోపాటు తమ తల్లిదండ్రులను కూడా గౌరవించాలని ఆయన సూచించారు. ఒయాసిస్ స్కూల్‌లో మంచి విద్యను అందిస్తున్నారని, ఇకముందు కూడా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఇక్రిశాట్ కమ్యూనికేషన్ డైరెక్టర్ రామన్‌పిచాయ్ మాట్లాడుతూ..విద్యార్థులు కష్టపడి చదవాలని, చదువుతోపాటు క్రీడలు, ఇతర రంగాలకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి. కార్యక్రమంలో ఒయాసిస్ స్కూల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ పి.సుబ్బారెడ్డి, కోశాధికారి జి. ఏకాంబరరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ శ్రీవిద్యారెడ్డి, ప్రిన్సిపాల్ ఉష కారుమంచి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

15 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

సాక్షి, హైదరాబాద్: ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షల సిలబస్‌పై ఇంటర్ బోర్డు స్పష్టతనిచ్చింది. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో ఫస్టియర్‌సిలబస్ 70 శాతం, సెకండియర్ సిలబస్ 100 శాతం ఉంటుందని బోర్డు సెక్రెటరీ నవీన్ మిట్టల్ తెలిపారు. ఇదే విధానం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ వరకు కొనసాగుతుందని ఒక ప్రకటనలో వెల్లడించారు. అయితే మార్చి 15 నుంచి జరిగే థియరీ పబ్లిక్ పరీక్షల్లో మాత్రం ఫస్టియర్, సెకండియర్‌రెండింటిలోనూ 100 శాతం సిలబస్‌తో ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమతి లేని ప్రాజెక్టుల వివరాలు ఇవ్వండి

● రాష్ట్రాలను కోరిన కేంద్ర జల సంఘం
● జాబితాను అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేకుండా నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల వివరాలను అందజేయాలని రాష్ట్రాలను కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) కోరింది. సంబంధిత ప్రాజెక్టుల ఇండెక్స్ మ్యాపులతో పాటు ముఖ్యమైన వివరాలను నిర్దేశిత నమూనాలో పంపించాలని సూచించింది. ప్రధానంగా అనుమతిలేని భారీ, మధ్యతరహా, బహుళార్థసాధక ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు/వినియోగం, ఆయకట్టు వివరాలు కోరింది. ఇప్పటికే సీడబ్ల్యూసీ వివిధ మార్గాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా రాష్ట్రాల వారీగా అనుమతి లేని ప్రాజెక్టుల జాబితాను తయారు చేసింది. ఈ జాబితాను సైతం ఆయా రాష్ట్రాలకు పంపించింది. ఈ జాబితాను పరిశీలించి అవసరమైన అదనపు సమాచారాన్ని జోడించాలని కోరింది. ఈ మేరకు సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టులకు అనుమతులిచ్చే విభాగం చీఫ్ ఇంజనీర్ ఇటీవల రాష్ట్రాలకు లేఖ రాశారు. కేంద్ర జలశక్తి శాఖ, నీతి ఆయోగ్, ప్లానింగ్ కమిషన్ ద్వారా అనుమతిచ్చిన ప్రాజెక్టుల వివరాలు తమ వద్ద ఉన్నాయని, అనుమతి లేని ప్రాజెక్టుల వివరాలను సైతం సేకరిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రాజెక్టుల నిర్మాణానికి సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని అందించడానికి ఈ సమాచారాన్ని సేకరిస్తున్నట్టు వివరించారు. ఇదిలా ఉండగా, కృష్ణా/గోదావరి బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ 2021 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గజిట్ నోటిఫికేషన్లలో పొందుపరిచిన అనుమతి లేని ప్రాజెక్టుల వివరాలను కేంద్రానికి పంపించినట్టు నీటిపారుదల శాఖ వర్గాలు వెల్లడించాయి.

నేటి భవితలో..

- ఎల్ఐసీ జాబ్స్: ఏడీఓ పోస్ట్ అందుకుంటారా! దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ.. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ).. భారీ సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఎనిమిది జోన్ల పరిధిలో మొత్తం 9,394 అప్రెంటీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఏడీఓ) పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో విజయం సాధించి ఏడీఓ కొలువు సొంతం చేసుకుంటే.. బీమా రంగంలో సుస్థిర కెరీర్ ఖాయం అవుతుంది. కొద్దిగా కష్టపడితే బ్యాచిలర్ డిగ్రీ అర్హతతోనే ఈ ఉద్యోగం దక్కించుకోవచ్చు. ఎల్ఐసీ.. ఏడీఓకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..
- గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం,రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

సైబర్ ఉచ్చు..
సరికొత్త చిక్కు!



రోజురోజుకూ పెరిగిపోతున్న ఆన్‌లైన్ మోసాలు

- కొంగొత్త పద్ధతుల్లో కొల్లగొడుతున్న నేరగాళ్లు
- అత్యాశ, బలహీనతల ఆధారంగా బురిడీ
- సెక్స్‌టార్షన్‌కు చిక్కి కొందరు విలవిల..
- టూర్ ప్యాకేజీలు, ఆఫర్ల వలలో మరికొందరు
- అవగాహన, అప్రమత్తతే ముఖ్యమంటున్న నిపుణులు

తక్షణమే ఫిర్యాదు చేయాలి — సైబర్ నేరగాళ్ల చేతిలో ఏ విధంగా మోసపోయినా, వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, టోల్‌ఫ్రీ నంబర్ 155260 లేదా 1930లో, www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి.

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ తర్వాత ఇంటర్నెట్ వాడకం, అన్ని రకాల సేవలు ఆన్‌లైన్‌లోనే పొందడం పెరిగినట్టుగానే, వాటిని ఆధారంగా చేసుకుని జరిగే సైబర్ నేరాలూ గణనీయంగా పెరిగాయి. ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్నారు. ఈ ఏడాదిలో మరికొన్ని కొత్త సైబర్ నేరాలు తెరపైకి రావచ్చని సైబర్ సెక్యూరిటీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే సైబర్ నేరాలు కేవలం ఆర్థిక నష్టాన్ని కలిగించడమే కాకుండా సామాజిక జీవితంపై కూడా ప్రభావం చూపుతున్నాయి. దేశ ఆర్థిక, సామాజిక భద్రతకూ ముప్పుగా పరిణమిస్తున్నాయి. గతంలో ఐటీ, బ్యాంకింగ్, ఎయిర్‌లైన్స్, పవర్‌గ్రిడ్ వంటి వ్యవస్థల్లో గమనించగా..ఇప్పుడు అన్ని రంగాలనూ ప్రభావితం చేసే స్థాయికి వెళ్లాయి. నిత్యజీవితంలో ప్రతి అంశానికి ఇప్పుడు సైబర్ దాడుల ముప్పు ఉందని నిపుణులు చెబుతున్నారు. కాస్త అవగాహన, అప్రమత్తతతో వ్యవహరిస్తే వీటికి కళ్లెం వేయొచ్చునని అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీల్లో ముఖ్యంగా మూడు రకాలైన మోసాలు జరుగుతున్నాయి. అవేంటో ఓసారి చూద్దాం..

సెక్స్‌టార్షన్

నేర విధానం:
యువతులు వీడియోకాల్స్ చేస్తారు. మాటల్లోకి దించి రెచ్చగొడతారు. వీడియో సంభాషణలన్నీ రికార్డ్ చేస్తారు. మనం వారి వలల్లో చిక్కుకున్నామని భావించిన తర్వాత వాటిని సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరింపులకు దిగి, ఆన్‌లైన్‌లో డబ్బులు కొల్లగొడతారు. చాలామంది ఈ విధమైన మోసాల్లో చిక్కుకుంటున్నారు.

ఏం చేయాలి:
- అపరిచిత నంబర్ల నుంచి వచ్చే వీడియోకాల్స్‌ను లిఫ్ట్ చేయకూడదు.
- సోషల్ మీడియా ఖాతాల్లో ప్రొఫైల్, ఫొటోలను లాక్ (కన్పించకుండా) చేయాలి. మ్యూచువల్ ఫ్రెండ్స్ పేర్లు కూడా కన్పించకుండా చేయాలి.
- ఏదైనా పరిస్థితుల్లో సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నా, బాధితులుగా మారినా భయపడొద్దు. వెంటనే మీ సోషల్ మీడియా ఖాతాను తాత్కాలికంగా డీ యాక్టివేట్ చేయాలి.

పర్యాటకం పేరిట..

నేర విధానం: జంగిల్ సఫారీ, పుణ్యక్షేత్రాల సందర్శనకు హెలికాప్టర్ ప్రయాణాల పేరిట మోసస్తారు. కోవిడ్ తగ్గిన తర్వాత పుణ్యక్షేత్రాల సందర్శన, విహారయాత్రలు పెరిగాయి. దీన్ని అవకాశంగా తీసుకుని పర్యాటకుల్ని సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు. వివిధ ఆకర్షణీయమైన టూర్ ప్యాకేజీలు, ఆఫర్ల పేరిట ఆకర్షిస్తున్నారు. ఆన్‌లైన్‌లో డబ్బులు కాజేసిన తర్వాత కానీ అలాంటి సంస్థలేవీ లేవని తెలియడం లేదు.

ఏం చేయాలి:
- బ్యాంకు లావాదేవీలైనా సరే ఆన్‌లైన్‌లో చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి.
- అనుమానాస్పద వెబ్‌సైట్ల జోలికి అస్సలు వెళ్లకూడదు. ఊరూపేరూ లేని వెబ్‌సైట్లలో యాత్రలు బుక్ చేసుకోకూడదు. అన్నీ కచ్చితంగా నిర్ధారించుకున్నాకే ముందుకెళ్లాలి.
- రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక టూరిజం వెబ్‌సైట్లలో బుక్ చేసుకోవడం ఉత్తమం. 'https://.........gov.in' అని ఉన్నవి మాత్రమే అధికారిక వెబ్‌సైట్లని గుర్తుంచుకోవాలి.
- ఒకవేళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తిస్తే.. 24గంటల లోపే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అలాచేస్తే నేరగాళ్లు కొట్టేసిన సొమ్మును బ్యాంకులు ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది.

క్లిక్ చేయొద్దు..డౌన్‌లోడ్ వద్దు

మనకు వచ్చే ఎస్ఎంఎస్‌లు, ఈ మెయిల్స్‌లో అనుమానాస్పద యూఆర్ఎల్, వెబ్ యూఆర్ఎల్ ఉంటే వాటిపై క్లిక్ చేయవద్దు. అలాగే మనకు తెలియని ఈమెయిల్ ఐడీల నుంచి వచ్చే లింక్‌లు, అటాచ్‌మెంట్లు డౌన్‌లోడ్ చేయవద్దు. సోషల్ మీడియాలో వచ్చే యాడ్స్‌ను నమ్మకండి.
– ప్రసాద్ పాటిబండ్ల, సైబర్ ఇంటెలిజెన్స్ నిపుణులు, న్యూఢిల్లీ



2022లో నమోదైన కొన్ని నేరాలు పరిశీలిస్తే..

- కొన్ని ఈ మెయిల్స్‌పై క్లిక్ చేయగానే అవి ఫిషింగ్ వెబ్‌సైట్ల (సైబర్ నేరగాళ్లవి)లోకి వెళ్లేలా చేస్తాయి.
- వెబ్‌సైట్లలో ఫేక్ కస్టమర్ కేర్ నంబర్లు పెడతారు. ఏదైనా సాయం కోసం వాటికి కాల్ చేసిన వారిని ఎనీడెస్క్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకునేలా చేసి డేటాను చోరీ చేస్తారు.
- పలు ప్రముఖ ఫాస్ట్ ఫుడ్ ఫ్రాంచైజీల పేరిట ఫేక్ వెబ్‌సైట్లను పెట్టి, వాటిలో భారీ డిస్కౌంట్లపై ఫుడ్ అందజేసే పేరిట మోసగిస్తారు.
- ఆదాయ పన్ను ఫైల్ చేయాలంటూ నకిలీ ఇన్‌కమ్ ట్యాక్స్ వెబ్‌సైట్ లింకులను పంపుతారు. వాటి నుంచి కస్టమర్ల డేటాను, అవతలి వాళ్లు అమాయకులైతే డబ్బులు కొల్లగొడతారు.
- ఉచితంగా కోవిడ్ పరీక్షల పేరిట ముందుగా కొంత మొత్తం చెల్లించాలని చెప్పి, తర్వాత రిమోట్ యాక్సెస్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటే మీ డబ్బు మీకు వాపస్ అంటూ మోసగిస్తారు.
- ఓఎల్ఎక్స్ వంటి వెబ్‌సైట్లలో మిలిటరీ, ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లా నకిలీ ఐడీ కార్డులు అప్‌లోడ్ చేసి వస్తువుల కొనుగోలు, అమ్మకాల పేరిట బురిడీ కొట్టిస్తున్నారు.
- ఎక్కువ విదేశీ ఖాతాలకు పెద్ద మొత్తాలు పంపే వ్యాపార కంపెనీలు, వ్యాపారవేత్తలను టార్గెట్‌గా చేసుకుని మోసాలు (బిజినెస్ ఈ-మెయిల్ కాంప్రమైజ్ (బీఈసీ) చేస్తున్నారు. సోషల్ ఇంజనీరింగ్ టెక్నిక్‌లు లేదా కంప్యూటర్ ఇన్‌స్ట్రక్షన్ టెక్నిక్‌లు వాడి బిజినెస్ ఈ మెయిల్స్‌ను హ్యాక్ చేస్తున్నారు..

కోవిడ్ వ్యాక్సిన్, సర్వేలు, రివార్డులు

నేర విధానం: ఇటీవలి కాలంలో నేరగాళ్లు కోవిడ్ వ్యాక్సిన్ సర్వే, ఎన్నికల సర్వేలో పాల్గొని రివార్డులు గెలుచుకోండి అంటూ కొన్ని లింక్‌లను పంపుతున్నారు. రివార్డుల నగానే చాలామంది ఆకర్షితులవుతున్నారు. వాటిపై క్లిక్ చేస్తే మన సమాచారం అంతా వారికి చేరిపోయేలా, లేదంటే మన మొబైల్ ఫోన్లలో రిమోట్ యాక్సెస్ యాప్‌లు ఇన్‌స్టాల్ అయ్యేలా చేస్తున్నారు.

అవగాహన:
- అనుమానాస్పద ఎస్ఎంఎస్ లింక్‌లను (దీనిని స్మిషింగ్ అంటాం) క్లిక్ చేయకూడదు.
- వాయిస్ కాల్స్ (విషింగ్) అటెండ్ చేయవద్దు. అనుమానాస్పద నంబర్లను వెంటనే బ్లాక్ చేయాలి.

2,37,658 ఫిర్యాదులు

కేంద్ర హోంశాఖ అధికారిక మ్యాగజైన్ 'సైబర్ ప్రవాహ'ప్రకారం సైబర్ నేరాలకు సంబంధించి కొన్ని ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి.

నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) సమాచారం ప్రకారం 2022 ఏడాది రెండో త్రైమాసికం వరకు సైబర్ నేరాలపై 2,37,658 ఫిర్యాదులు అందాయి

- ఎన్‌సీఆర్‌పీలో ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు 7.08 లక్షల మంది సైబర్ నేరగాళ్ల వివరాలను సేకరించి డేటాబేస్ రూపొందించారు.
- సైబర్ నేరగాళ్లు కొట్టేసిన రూ.95 కోట్లను వారి ఖాతాల్లోకి చేరకుండా సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్స్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్) కింద బ్యాంకులు ఆ డబ్బును నిలిపివేసాయి.
- సైబర్ దోస్త్ ట్విట్టర్ ఖాతా ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా ఇప్పటివరకు 1,263 ట్వీట్లను అధికారులు షేర్ చేశారు. ఈ ట్విట్టర్ ఖాతాను 3.97 లక్షల మంది ఫాలో అవుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..



- డబ్బులపై ఆశ, బలహీనతల కారణంగానే ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా యువత అందునా విద్యార్థులు మోసపోతున్నారు. మనం లాటరీలో పాల్గొనకుండా, ఎలాంటి బహుమతీ రాదని గుర్తించాలి.
- ఈమెయిల్స్, సోషల్ మీడియా ఖాతాలకు 'టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్'(పాస్‌వర్డ్‌తో పాటు ఓటీపీ వచ్చేలా) పెట్టుకోవాలి.
- వెబ్‌సైట్లలో మీ యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌లు సేవ్ చేసుకోవద్దు.
- మీ పిల్లల సోషల్ మీడియా ఖాతాల్లో మీరు కూడా ఫ్రెండ్‌గా ఉండడం ఉత్తమం. ఆన్‌లైన్‌లో పిల్లలు ఎవరితో స్నేహాలు చేస్తున్నారో గమనిస్తుండాలి.

1 నుంచి మన ఊరు-మనబడి స్కూళ్ల ప్రారంభోత్సవాలు

● పండుగ వాతావరణం ఉండాలి.. కలెక్టర్లకు మంత్రి సబిత ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఫిబ్రవరి 1 నుంచి మన ఊరు-మనబడి పథకం కింద పూర్తయిన పాఠశాలలను ప్రారంభించనున్నట్లు విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి వెల్లడించారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వీటిని 12 రకాల మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దినట్లు ఆమె తెలిపారు. మొదటి విడత ఎంపిక చేసిన స్కూళ్లలో ఇప్పటి వరకూ 1,200 స్కూల్స్‌లో పనులు పూర్తయినట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మన ఊరు – మన బడిలో పాఠశాలలను ప్రారంభిస్తున్న గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొనాలని, ఇందుకు సంబంధించి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా పరిషత్ చైర్మన్లతో సమన్వయం చేసుకుని ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని 26,055 స్కూళ్లను మూడేళ్లలో 3 దశల్లో రూపురేఖలు మార్చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి తెలిపారు. మొదటి విడతలో 9,123 పాఠశాలలను రూ. 3,497.62 కోట్లతో ఆధునికీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీని, విద్యార్థుల తల్లిదండ్రులను, గ్రామ పెద్దలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

ఢిల్లీలో తెలంగాణ జన సమితి మౌనదీక్ష నేడు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో జలవనరుల దోపిడీపై జంతర్ మంతర్‌లో సోమవారం మౌన దీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా రెండురోజులపాటు కార్యక్రమాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కోదండరాం ఆదివారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ విభజన హామీలు, కృష్ణా నదీజలాల సమస్యపై జంతర్‌మంతర్‌లో చేపట్టనున్న మౌనదీక్షకు ఢిల్లీలోని తెలంగాణవాసులు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ పాలనపై జనవరి 31న కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సెమినార్ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. విభజన చట్టంలోని అంశాల సాధన, తెలంగాణ సమస్యలపై దృష్టి పెట్టడానికి బీఆర్ఎస్ సిద్ధంగా లేదని కోదండరాం విమర్శించారు.

గ్రూప్-4 దరఖాస్తులకు నేడే ఆఖరు

▶ మొదటి పేజీ తరువాయి

చేయనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఆ తర్వాత డిసెంబర్ 30న విడుదల చేసిన పూర్తిస్థాయి నోటిఫికేషన్‌లో 8,039 ఖాళీలను మాత్రమే ప్రకటించింది. తాజాగా ఈనెల 28న విడుదల చేసిన గ్రూప్-4 అనుబంధ ప్రకటనలో మరో 141 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను జత చేస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ వివరించింది. దీంతో పోస్టుల సంఖ్య 8,180కి చేరింది. మరోవైపు ఓటీఆర్ అప్‌డేషన్, విద్యార్హతల ధ్రువపత్రాలు తదితరాలను సంబంధిత అధికారుల నుంచి తీసుకుని దరఖాస్తు చేసుకోవాడానికి మరింత సమయం కావాలంటూ అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీని కోరుతున్నారు. అయినా గడువు పెంపుపై ఇంతవరకు టీఎస్‌పీఎస్సీ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. నేటి సాయంత్రంతో దరఖాస్తు గడువు ముగియనుండటంతో చివరి నిమిషం వరకు టీఎస్‌పీఎస్సీ ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంది.

టీచర్ల బదిలీల గడువు పొడిగించే చాన్స్!

▶ మొదటి పేజీ తరువాయి

అంటున్నాయి. దీనివల్ల కొన్ని ఆప్షన్లు కన్పించడం లేదని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఆర్ఏ కేటగిరీలు గతంలో నాలుగు ఉండగా, ఇప్పుడు మూడింటికి కుదించారు. కానీ, సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయలేదు. స్పౌజ్ 8 ఏళ్లుగా బదిలీ అవకాశాన్ని వాడుకున్నారా? అనే ఆప్షన్‌లో వాడుకోలేదనే ఆప్షన్‌కు టిక్ పెడితే దరఖాస్తును తీసుకోవడం లేదని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. మారుమూల గ్రామాల్లో తొలిరోజు ఆన్‌లైన్ విధానం పనిచేయలేదనే ఫిర్యాదులొచ్చాయి. దరఖాస్తు గుడువు ఒకరోజు మాత్రమే ఉండటంతో మిగిలిన 40 వేలమంది ఒకేసారి దరఖాస్తు చేస్తే సర్వర్ స్తంభించే అవకాశముందని విద్యాశాఖలోని సాంకేతిక వర్గాలు అంటున్నాయి.

ఎస్జీటీల సంగతేంటి?
స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 615 మంది స్పౌజ్‌లు వారి ప్రాంతాలకు వెళ్లేందుకు అనుమతించినా సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) విషయంలో ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. ఖాళీలున్నా తమకు ఎందుకు న్యాయం చేయడంలేదని వారు జిల్లాల్లో ఆందోళనలు చేస్తున్నారు. వాస్తవానికి అన్ని జిల్లాల్లోనూ పోస్టులున్నాయి. సంగారెడ్డి జిల్లాల్లో కేవలం ముగ్గురు స్పౌజ్‌లే బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. అక్కడ 242 పోస్టులున్నా అనుమతించలేదు. ఖమ్మంలో 341 పోస్టులుంటే 41 మంది స్పౌజ్‌లే దరఖాస్తు చేశారు. అన్ని జిల్లాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. ఖాళీలున్నా ఎందుకు బదిలీచేయడం లేదని స్పౌజ్ ఫోరం నేతలు ప్రశ్నిస్తున్నారు.

గడువు పెంచాల్సిందే...
సాఫ్ట్‌వేర్ సమస్యల కారణంగా అనేకమంది టీచర్లు ఇబ్బంది పడుతున్నారు. ఫిబ్రవరి 1 వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలి. టీచర్ల దరఖాస్తులు డీఈవోలకు సమర్పించేందుకు మూడు రోజుల గడువిచ్చారు. కాకపోతే ఈ సమయాన్ని తగ్గించి, టీచర్లు ఆన్‌లైన్ దరఖాస్తులు పెట్టుకునే గడువు పెంచాలి.
– చావా రవి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

..దేహదారుఢ్య పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యర్థులు కూడా మళ్లీ పార్ట్-2 దరఖాస్తు నింపాల్సి ఉంటుంది. అయితే, ఇప్పటికే దేహదారుఢ్య పరీక్షలకు హాజరై అర్హత సాధించలేకపోయిన అభ్యర్థులు.. ఇప్పుడు కొత్తగా మార్కులు కలపడం వల్ల రాతపరీక్షలో ఉత్తీర్ణులైనప్పటికీ వారికి మరో అవకాశం ఇచ్చేది లేదని పోలీస్ బోర్డు స్పష్టం చేసింది.

గతంలో దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొనని, ఇప్పుడు మార్కులు కలిపితే కొత్తగా అర్హత సాధించే అభ్యర్థులకు మాత్రమే ఫిబ్రవరి 15 నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్టు బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు వెల్లడించారు. హైదరాబాద్, సైబరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఆదిలాబాద్‌ల్లో నిర్వహించనున్న ఈ ఫిజికల్ ఈవెంట్స్‌ను పదిరోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. వీటి అడ్మిట్ కార్డులను ఫిబ్రవరి 8 ఉదయం 8 గంటల నుంచి ఫిబ్రవరి 10వ తేదీ రాత్రి 12 గంటల వరకు టీఎస్ఎల్పీఆర్బీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. డౌన్‌లోడ్‌లో ఏవైనా సమస్యలుంటే 9393711110, 9391005006 నంబర్లలో సంప్రదించవచ్చని చెప్పారు.

ఎస్జీటీ, పండిట్‌లకూ అవకాశం ఇవ్వండి

స్పౌజ్ బదిలీలపై ముఖ్యమంత్రికి బాధిత టీచర్ల వినతి

పంజగుట్ట (హైదరాబాద్): స్పౌజ్ బదిలీల్లో ఎస్జీటీ, పండిట్, పీఈటీ టీచర్లకు కూడా అవకాశం కల్పించాలని బాధిత టీచర్లు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. మొత్తం 2100 మంది స్పౌజ్ బదిలీలకోసం దరఖాస్తు చేసుకోగా కేవలం 615 మంది స్కూల్ అసిస్టెంట్‌ల బదిలీలకే అనుమతించారని, ఎస్జీటీ, పండిట్, పీఈటీ టీచర్లకు అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో బాధిత టీచర్లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, స్పౌజ్ బదిలీల్లో కేవలం 30 శాతం మందికే అవకాశం ఇచ్చారని, మిగిలిన 70 శాతం మందికి అనుమతించలేదని తెలిపారు. ఇందులో అధికశాతం మహిళలే ఉన్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో స్పౌజ్ బదిలీలు చేపట్టకుండా నిలిపేసిన 13 జిల్లాల్లో ఎన్నో ఖాళీలు ఉన్నాయని, ప్రస్తుతం పదోన్నతులు కూడా ఇస్తున్న నేపథ్యంలో మరిన్ని ఖాళీలు ఏర్పడతాయని వారు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలో 172 ఖాళీలు ఉన్నాయని ఇప్పుడు పదోన్నతులు ఇస్తే మరిన్ని ఖాళీలు పెరుగుతాయని తెలిపారు. ఈ జిల్లాలో స్పౌజ్ బదిలీకి దరఖాస్తు చేసుకున్న వారు 82 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. అలాగే సంగారెడ్డిలో 300 ఖాళీలు ఉంటే స్పౌజ్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారు కేవలం ముగ్గురు మాత్రమే అన్నారు. ఇలా ప్రతీ జిల్లాలో చేసే అవకాశం ఉన్నప్పటికీ బదిలీలు చేయకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, స్పౌజ్ బదిలీలు చేపట్టినందుకు తెలంగాణ స్పౌజ్ ఫోరం ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపింది.



విలేకరుల భేటీలో మాట్లాడుతున్న బాధితులు

హైదరాబాద్‌లోనే 'లీకు'వీరులు!

- ఐడీఏ బొల్లారంలోని ప్రింటింగ్ ప్రెస్ నుంచి గుజరాత్ పంచాయత్‌రాజ్ పరీక్షపత్రం లీక్
- ఇద్దరు నిందితులను అరెస్టు చేసి తీసుకువెళ్లిన గుజరాత్ ఏటీఎస్
- పరీక్షను రద్దు చేసిన జీపీఎస్ఎస్‌బీ

సాక్షి, హైదరాబాద్: గుజరాత్ పంచాయత్ సర్వీస్ సెలక్షన్ బోర్డ్(జీపీఎస్ఎస్‌బీ) నిర్వహించతలపెట్టిన పంచాయత్ జూనియర్ క్లర్క్ పరీక్షపత్రం లీక్ లింకులు హైదరాబాద్‌లో బయటపడ్డాయి. నగర శివార్లలో ఉన్న కేఎల్ హైటెక్ ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రితమైన ఈ పరీక్షపత్రం అక్కడ నుంచే బయటకు వచ్చినట్లు తేలింది. దీంతో ఆదివారం మధ్యాహ్నం మెరుపుదాడి చేసిన ఆ రాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అధికారులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి తీసుకువెళ్లారు. ఇప్పటివరకు ఈ లీకేజ్ స్కామ్‌లో మొత్తం 15 మంది అరెస్టు అయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన పరీక్షను జీపీఎస్ఎస్‌బీ రద్దు చేసింది. వాస్తవానికి గుజరాజ్ పంచాయత్ శాఖలో 1,181 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 9.53 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆ రాష్ట్రంలోని 2,995 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. అయితే శనివారంరాత్రి ఈ పేపర్ లీక్ జరిగినట్లు ఏటీఎస్‌కు ఉప్పందడంతో వడోదరలోని అట్లాదర ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌పై అధికారులు దాడి చేశారు. ఈ సెంటర్ నిర్వాహకుడు భాస్కర్ చౌదరితోపాటు ఏడుగురిని అరెస్టు చేసిన ఏటీఎస్ అక్కడ ఉన్న పరీక్షపత్రం ప్రతులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడుగురిలో ఇద్దరు 2019 నాటి బిట్స్ పిలానీ ఆన్‌లైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ గోల్‌మాల్ వ్యవహారంలో ఉన్నారని, అప్పట్లో సీబీఐ ఈ ద్వయాన్ని అరెస్టు చేసిందని ఏటీఎస్ ప్రకటించింది.

ఒడిశా నుంచి..: భాస్కర్‌చౌదరి గుజరాత్‌లోని వివిధ నగరాలతోపాటు బిహార్, ఒడిశాల్లోనూ పోటీ పరీక్షల కోసం కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నాడు. ఒడిశాలో మరో కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు ప్రదీప్ నాయక్ ద్వారా తనకు పరీక్షపత్రం అందిందని, దాని కోసం భారీ మొత్తం ఖర్చు చేశానని విచారణలో అతడు బయటపెట్టాడు. ఈ క్రమంలో హైదరాబాద్ లింకులు వెలుగుచూశాయి. వివిధ సెట్స్ పరీక్షపత్రాలు ముద్రించే బాధ్యతల్ని జీపీఎస్ఎస్‌బీ ఐడీఏ బొల్లారంలోని కేఎల్ హైటెక్ ప్రింటింగ్ ప్రెస్‌తోపాటు ఏపీలో ఉన్న మరో ప్రెస్‌కు అప్పగించింది. ఈ ప్రెస్‌లో ఒడిశాకు చెందిన జీతి నాయక్, సర్థోకర్ రోహా పనిచేస్తున్నారు. జీతినాయక్‌కు ప్రదీప్‌నాయక్‌తో కొన్నేళ్లుగా పరిచయం ఉంది. జీతి ఈ పేపర్‌ను అతడికి విక్రయించి సొమ్ము చేసుకోవాలని పథకం వేశాడు. సర్థోకర్ రోహా సహకారంతో పరీక్షపత్రాన్ని ప్రింటింగ్ ప్రెస్ నుంచి తస్కరించాడు. దీన్ని వాట్సాప్ ద్వారా ప్రదీప్‌కు పంపగా, అతడి నుంచి భాస్కర్‌కు చేరింది. ఈ వ్యవహారంలో మరికొందరు మధ్యవర్తులుగా వ్యవహరించారని ఏటీఎస్ గుర్తించింది. వీరితోపాటు ఆయా కోచింగ్ సెంటర్ల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకున్న అభ్యర్థుల కోసం గాలిస్తోంది.

'317' సవరించకపోతే అసెంబ్లీ ముట్టడి

ఇందిరాపార్కు వద్ద మహాధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల హెచ్చరిక

కవాడిగూడ(హైదరాబాద్): జీవో 317ను సవరించి బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాకు వివిధ జిల్లాల నుంచి బాధిత ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు, ఎస్టీయూ అధ్యక్షుడు సదానందం, ఎస్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు, 317 జీవో బాధిత సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి తిరుపతిరావు, సంఘం నేతలు మల్లేశ్, వినోద్, జెస్సికా రాణి, సూర్య తదితరులు మాట్లాడారు. స్థానికత ఆధారంగానే ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లతోపాటు కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. స్థానికత పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో స్థానికులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా 317 జీవోను సవరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. లేనియెడల ఫిబ్రవరి 3 నంచి జరిగే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. బాధిత ఉపాధ్యాయులంతా ఐక్యంగా ముందుకు వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బాధిత ఉపాధ్యాయులు

క్లుప్తంగా...

కేసీఆర్ అభివృద్ధి ఎలక్షన్ టూ ఎలక్షన్: ఈటల



జనగామ: తెలంగాణలో అభివృద్ధి..కొత్త కొత్త జీఓలు ఎలక్షన్ టు ఎలక్షన్‌గా మారాయని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జనగామ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఈటల మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినప్పుడే ప్రభుత్వం పని చేస్తుందని, ప్రతీ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు వస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రజలు ఉన్నారన్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇంకా పూర్తి చేయకుండానే, దొంగ జీఓలను విడుదల చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 127 చోట్ల మున్సిపల్, కార్పొరేషన్‌లో అసమ్మతి సెగలను కంట్రోల్ చేయని దుస్థితిలో సీఎం ఉన్నారన్నారు. తెలంగాణలో 24 గంటలపాటు కరెంటు సరఫరా ఇవ్వలేని కేసీఆర్ దేశం మొత్తం ఉచితంగా ఇస్తామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

ఎన్‌ఎంఓపీ జాతీయ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ



సాక్షి, హైదరాబాద్: వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి చెందిన కంపెనీలకు ఇచ్చిన అప్పులతో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగుల జీతాల నుంచి జమ చేసుకుంటున్న నిధులకు ముప్పు ఏర్పడుతుందని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ (ఎన్‌ఎంఓపీ) జాతీయ సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ ఆవేదన వ్యక్తం చేశారు. హిండెన్‌బర్గ్ వెల్లడించిన నివేదిక ప్రకారం అదానీ కంపెనీలకు ఎల్ఐసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన రుణాలలో సీపీఎస్ ఉద్యోగులకు చెందిన 67 శాతం పింఛన్ నిధులున్నాయని వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎన్ఎంఓపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, అదానీ గ్రూప్ కంపెనీల్లో ఎల్ఐసీ రూ.77వేల కోట్లు, ఎస్‌బీఐ రూ.80 వేల కోట్లు పెట్టుబడులు పెట్టాయని, ఇప్పుడు కంపెనీల షేర్లు పతనం కావడంతో దేశంలోని 84 లక్షల మంది ఉద్యోగుల సొమ్ము ఆవిరైపోతోందని చెప్పారు.


అతికినట్టు చెప్పినా.. అబద్ధాలు నిజాలయిపోవు

ప్రభుత్వ హెల్త్ రిపోర్ట్‌పై షర్మిల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: అబద్ధాలు అతికినట్లు చెప్పినా.. అవి నిజాలు అయిపోవని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల అన్నారు. మెటర్నిటీ మరణాలను ఆపలేని ప్రభుత్వానికి.. మెరుగైన వైద్యంలో తెలంగాణ నంబర్ 1 అని చెప్పుకోవడం సిగ్గనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు విడుదల చేసిన హెల్త్ రిపోర్ట్ 'ఆపరేషన్ సక్సెస్.. పేషంట్ డైడ్' అన్నట్లుందని వ్యాఖ్యానించారు. 300 మంది సిబ్బంది ఉండాల్సిన జిల్లా ఆసుపత్రిలో 30 మందితో వైద్యం అందించడం అభివృద్ధి అంటారా అని ప్రశ్నించారు. ఎక్స్‌రే, సిటీ స్కాన్, టిఫా స్కాన్ లాంటి యంత్రాలకు టెక్నీషియన్లు లేక ఎన్నో ఆసుపత్రుల్లో మూలకు పడ్డాయన్నారు. మహానేత హయాంలో అద్భుతంగా అమలైన ఆరోగ్యశ్రీ పథకాన్ని డెత్ బెడ్ ఎక్కించారని మండిపడ్డారు.

'అదానీ ఆర్థిక వ్యవహారాలపై విచారణ జరిపించాలి'



ఖమ్మం మయూరి సెంటర్: దేశంలో అనతికాలంలోనే ఆర్థికంగా ఎదిగి అరాచకం సృష్టిస్తున్న అదానీ వెనుక ప్రధాని నరేంద్ర మోదీ హస్తం ఉందని, అదానీ వ్యవహారాలపై విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ధనాన్ని అదానీ సంస్థల్లో పెట్టుబడి పెట్టేలా మోదీ ప్రోత్సహించారని, అదానీని అరెస్టు చేసి విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఖమ్మంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్క రోజే 4 లక్షల కోట్ల రూపాయల మేర వివిధ సంస్థలు నష్టపోయాయని, ఎల్ఐసీకి రూ.1,800 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. మతాధిపతులు దేశ రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మాన్ని చొప్పించాలని చూస్తున్నారని అన్నారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన: గట్టు

కైలాస్‌నగర్ (హైదరాబాద్): రాష్ట్రంలో నియంతృత్వ, నికృష్ట పాలన సాగుతోందని వైఎస్ఆర్ టీపీ రాష్ట్ర కార్యాచరణ కమిటీ సభ్యుడు గట్టు రామచంద్రరావు ఆరోపించారు. ఆదిలాబాద్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ ఉమ్మడి జిల్లా ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే పోడు భూముల సమస్య లేకుండా చేస్తానన్న కేసీఆర్.. దాన్ని విస్మరించారని ఎద్దేవా చేశారు. 2006లో కోనేరు రంగారావు కమిటీని ఏర్పాటు చేసిన దివంగత సీఎం వైఎస్సార్ నాడు రాష్ట్రంలో 6లక్షల ఎకరాల పోడు భూమి ఉన్నట్లు తేల్చారని వివరించారు. అందులో 3లక్షల ఎకరాలకు ఆర్‌వోఎఫ్ఆర్ కింద పట్టాలిచ్చారన్నారు.

ఫీజులు దులపండి



రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం

- 2020–21, 2021–22కు సంబంధించి పెండింగ్‌లో రూ.**2,117.66** కోట్లు
- వీటిలో బీసీ సంక్షేమ శాఖకు చెందినవి రూ.**1,376.36** కోట్లు
- ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల బకాయిలు కూడా భారీగానే..
- రేపటితో ముగియనున్న 2022–23 దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ
- ఈ ఏడాది డిమాండ్ రూ.**2,350** కోట్లుగా ఉండే అవకాశం
- తాజా దరఖాస్తులు పరిశీలనకే పరిమితం.. బకాయిల చెల్లింపుకే ప్రాధాన్యత!

ఖాజీపేటకు చెందిన రాఘవేంద్ర కుమార్ కూకట్‌పల్లి సమీపంలోని ఓ కాలేజీలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సెమిస్టర్ పరీక్ష ఫీజు సమయంలో మొదటి సంవత్సరానికి సంబంధించిన ట్యూషన్ ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం మెలిక పెట్టింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అర్హులు సైతం ట్యూషన్ ఫీజులు చెల్లించాలని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాక వారికి తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేసింది. ట్యూషన్ ఫీజు రశీదు ఇచ్చిన విద్యార్థుల నుంచే సెమిస్టర్ పరీక్ష ఫీజు స్వీకరిస్తుండడంతో విధిలేని పరిస్థితుల్లో రాఘవేంద్రకుమార్ డబ్బులు వడ్డీకి తెచ్చి ట్యూషన్ ఫీజు, సెమిస్టర్ ఫీజు చెల్లించాడు.

నిధుల బకాయిల వివరాలు రూ.కోట్లలో

కేటగిరీ	2020-21	2021-22
ఎస్సీ	1.25	118.48
ఎస్టీ	1.10	86.50
బీసీ	322.25	1,054.11
ఈబీసీ	81.11	225.50
మైనారిటీ	25.25	202.11

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థుల కోసం అమలవుతున్న ఉపకారవేతన, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు నిధుల విడుదలలో తీవ్ర జాప్యం కనిస్తోంది. ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో క్రమంగా బకాయిలు పెరిగిపోతున్నాయి. 2020–21, 2021–22 విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజు నిధుల విడుదలకు ప్రభుత్వం తాత్సారం చేయడంతో బకాయిలు ఏకంగా రూ.2,117.66 **కోట్లకు పేరుకు**పోయాయి. తాజాగా 2022–23 విద్యా **సంవత్సరానికి** సంబంధించి దరఖాస్తు ప్రక్రియ కొనసా**గుతోంది.** మంగళవారం వరకు గడువుండగా, ఆ **తర్వాత** దరఖాస్తుల పరిశీలన మొదలుపెట్టి అర్హ**తను** నిర్ధారిస్తారు. అనంతరం తాజా విద్యా **సం**వత్సర చెల్లింపులు ప్రారంభించాల్సి ఉం**టుంది.** అయితే ఇప్పటికే రెండేళ్లుగా బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన చెల్లింపులు కూడా ఆలస్యం అయ్యే సూచనలు కన్పిస్తున్నాయి.

'బీసీ' నిధులు భారీగా పెండింగ్..

గత విద్యా సంవత్సరం వరకు **ఉన్న** రూ.2117.6 కోట్ల బకాయిల్లో బీసీ **సంక్షేమ** శాఖకు చెందినవే ఎక్కువగా ఉన్నాయి. **ఈ శాఖకు** సంబంధించి రూ.1,376.36 కోట్లు **పెండింగ్‌లో** ఉన్నాయి. ఇందులో 2020–21కు సంబంధించి రూ.322.25 కోట్లు, 2021–22కు చెందిన రూ.1,054.11 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి ఉండడం, ఆ మేరకు అందుబాటులో ఉన్న నిధులను సర్దుబాటు చేస్తుండడంతో ఆయా శాఖలకు సంబంధించిన బకాయిలు తక్కువగా ఉన్నాయి. మరోవైపు ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు సం**బంధించిన బకాయి**లు కూడాపెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉన్నట్లు **ఆయా శాఖలు** చెబుతున్నాయి.

ఈ ఏడాది పరిశీలనతోనే సరి!

2022–23కు సంబంధించి ఇప్పటివరకు దాదాపు 11 లక్షల దరఖాస్తులు వచ్చాయి. చివరి తేదీ జనవరి 31 నాటికి 12.5 లక్షల దరఖాస్తులు వస్తాయని సంక్షేమ శాఖల అధికారులు అంచనా వేస్తున్నారు. స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ పరిశీలన పూర్తి చేసేందుకు దాదాపు రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. కాగా ప్రస్తుతం వచ్చిన దరఖాస్తుల సంఖ్యను బట్టి చూస్తే 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిమాండ్ రూ.2,350 కోట్లు ఉండే అవకాశం ఉందని అధికారుల అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సంవత్సరంలో కేవలం దరఖాస్తుల పరిశీలనతోనే సరిపెట్టి, పాత బకాయిలు క్లియర్ చేసేందుకు ప్రభుత్వ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిసింది.

ఖజానా శాఖకు అనుమతులు లేక...

ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కో**సం** వచ్చిన దరకాస్తులను పరిశీలించి వాటిని ఆమోదిస్తున్న సంక్షేమ అధికారులు.. జిల్లా స్థాయిలో వాటికి బిల్లులు రూపొందించి నిధుల విడుదల కోసం ఖజానా విభాగానికి పంపిస్తున్నారు. అలా పంపిన బిల్లులు సంక్షేమ శాఖల్లో పరిష్కరించినట్లు రికార్డు చూపిస్తున్నప్పటికీ.. ఖజానాల్లో నిలిచిపోతున్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతి **వ**చ్చిన బిల్లులను మాత్రమే ఖజానా అధికా**రులు** క్లియర్ చేస్తున్నారు. ప్రతి నెల ఉద్యోగుల **వేతనా**లు, పెన్షన్ నిధులు మాత్రమే సకాలంలో **పరిష్కరి**స్తుండగా... మిగతా ఎలాంటి బిల్లులకు **ఆమోదం ల**భించడం లేదని అధికారులు చెబుతున్నారు.

గవర్నర్ల సొంత ఎజెండా!

▶ మొదటి పేజీ తరువాయి

ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసే ప్రసంగాన్ని బహిష్కరించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకోసం వివిధ రాష్ట్రాల విపక్ష పార్టీలను కూడా కలుపుకొని పోవాలని నిర్ణయించినట్లు సమాచారం. కాగా ఈ మేరకు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధాన విపక్ష నేతలతో మాట్లాడుతున్నట్లుగా కేసీఆర్ తెలిపారని పార్టీవర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ, తమిళనాడు, కేరళ ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, స్టాలిన్, విజయన్‌లతో పాటు విపక్ష నేతలు అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్‌లతో మాట్లాడినట్లు తెలిపాయి. విపక్ష పార్టీల సహకారంతో రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించడం ద్వారా కేంద్రం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టాలని సూచించినట్లు వివరించాయి. కేంద్రం అనుసరిస్తున్న నిర్లక్ష్యపూరిత, ప్రమాదకర విధానాల వల్ల దేశ భవిష్యత్తుకు జరుగుతున్న నష్టాన్ని ఎంపీలకు కేసీఆర్ వివరించారు. పార్లమెంటు జరిగినన్ని రోజులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, రాష్ట్రంతో పాటు దేశంలోని ప్రజా సమస్యలపై గళం వినిపిస్తూ, కేంద్రం చేస్తున్న తప్పులను దేశం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అభివృద్ధికి ఆటంకాలుగా కేంద్రం విధానాలు

'కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశ సమగ్రతకు, అభివృద్ధికి ఆటంకాలుగా మారాయి. దేశ ప్రజలు కష్టార్జితంతో కూడబెట్టుకుంటున్న సంపదనంతా అప్పనంగా తమ కార్పొరేట్ స్నేహితులకు కట్టబెడుతున్నారు. తమకు అనుకూల కార్పొరేట్ శక్తులపై ప్రేమ కురిపిస్తూ లక్షల కోట్ల రూపాయల రుణాలను కేంద్రం రద్దు చేస్తోంది. ఎల్ఐసీ వంటి ప్రభుత్వరంగ సంస్థల్లో అదానీ వంటి బడా వ్యాపారవేత్తలకు వాటాలను అప్పనంగా కట్టబెట్టడంతో వారి కంపెనీల డొల్లతనం బయటపడుతూ షేర్ల విలువ హఠాత్తుగా పడిపోయింది. ఒక్క రోజులోనే రూ.లక్షల కోట్లు నష్టపోతున్న వాస్తవాన్ని దేశం గమనిస్తోంది. వారి లాభాలు, సంపద అంతా నీటి బుడగేనని స్పష్టమవుతోంది. ఇలాంటి ఆర్థిక అవకతవకలకు దోహదం చేసే విధంగా దేశ సంపదనంతా ప్రైవేట్ పరం చేస్తూ, కేంద్రం తీరని నష్టం చేస్తోంది. లాభాలను ప్రైవేట్ పరం చేస్తూ నష్టాలను దేశ ప్రజల మీద రుద్దుతోంది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రమాదకర ఆర్థిక విధానాలపై పార్లమెంటు ఉభయ సభల్లో గొంతెత్తాలి. దేశ ప్రజల ప్రయోజనాలకు తూట్లు పొడుస్తున్న తీరును బీఆర్ఎస్ ఎంపీలు తీవ్రంగా ఖండించాలి. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ తదితర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సామాన్యుడి బతుకు రోజురోజుకూ భారమైపోతున్నా కేంద్రానికి ఏమాత్రం పట్టింపులేదు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు అనుభవిస్తున్న కష్టాలను పార్లమెంటు వేదికగా దేశ ప్రజల దృష్టికి తీసుకుపోవాలి. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరిస్తున్న తీరుపై నిరసన వ్యక్తం చేయాలి. రాష్ట్ర విభజన హామీలపై కూడా నిలదీయాలి. కేంద్ర ప్రభుత్వం మీద పోరాటానికి కలిసివచ్చే దేశంలోని ప్రతి పార్టీ ఎంపీని కలుపుకొని పోవాలి. ఆయా అంశాలపై ఉభయ సభల్లో నిలదీయాలి' అని సీఎం ఆదేశించారు. సమావేశంలో పార్లమెంటరీ పార్టీ నేతలు కె.కేశవరావు (రాజ్యసభ), నామా నాగేశ్వర్‌రావు (లోక్‌సభ), ఎంపీలు జోగినపల్లి సంతోష్‌కుమార్, కేఆర్ సురేష్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ల వ్యవస్థ దుర్వినియోగం

'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ రాష్ట్రాలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రగతిలో దూసుకుపోతున్న తెలంగాణకు ఆర్థికంగా ఆటంకాలు సృష్టిస్తోంది. గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తోంది. రాష్ట్రాలను నిర్వీర్యపరిచే దిశగా గవర్నర్లను కేంద్రం తమ చెప్పుచేతుల్లో పెట్టుకోవడం అప్రజాస్వామికం. రాజ్యాంగబద్ధమైన విధులను నిర్వర్తిస్తూ కేంద్రం, రాష్ట్రాల నడుమ సంధానకర్తలుగా ఉండాల్సిన గవర్నర్ల వ్యవస్థను తమ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్న దుర్మార్గ విధానాలను బీఆర్ఎస్ ఎంపీలు ఉభయ సభల్లో తీవ్రంగా వ్యతిరేకించాలి. రాష్ట్ర కేబినెట్ సహా, అత్యున్నత సభలైన శాసనసభ, శాసనమండలి తీసుకున్న నిర్ణయాలను సైతం బేఖాతరు చేస్తూ గవర్నర్లు ఉద్దేశపూర్వకంగా పెండింగులో పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును ప్రభావితం చేయాలని, అభివృద్ధిని, పాలనను అడ్డుకోవాలని చూస్తున్న గవర్నర్ల అప్రజాస్వామిక విధానాలను, కేంద్రం వైఖరిని ఎండగట్టాలి..' అని కేసీఆర్ ఆదేశించారు.

బడ్జెట్‌కు లభించని గవర్నర్ సిఫారసులు

▶ మొదటి పేజీ తరువాయి

శాసనసభ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. కాగా ఈ మేరకు వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసిన ప్రభుత్వం.. గవర్నర్ సిఫారసుల కోసం రాజ్‌భవన్‌కు పంపించింది. అయితే గవర్నర్ పుదుచ్చేరిలో ఉండడంతో ఈ ప్రతిపాదనలు ఇప్పటివరకు రాజ్‌భవన్‌లోనే ఉండిపోయాయి. తమిళిసై సోమవారం హైదరాబాద్‌కు రానున్నారని, ప్రతిపాదనలను ఆమోదించి ప్రభుత్వానికి తిరిగి పంపించే విషయంపై నిర్ణయం తీసుకుంటారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

విభేదాల నేపథ్యంలో..

రాష్ట్ర గవర్నర్ ప్రసంగంతో శాసనసభ బడ్జెట్ సమావేశాలను ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుండగా, ఇందుకు విరుద్ధంగా గతేడాది బడ్జెట్ సమావేశాలను గవర్నర్ ప్రసంగం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. అసెంబ్లీని ప్రొరోగ్ చేయకపోవడంతో గవర్నర్ ప్రసంగం లేకుండానే శాసనసభ సమావేశాలు నిర్వహించడానికి సాంకేతికంగా వెసులుబాటు ఉంది. దీనిని ఉపయోగించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఈ ఏడాది కూడా గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాలను ప్రారంభించడానికి సిద్ధమైంది. తనను అవమానించడానికే రాష్ట్ర ప్రభుత్వం తన ప్రసంగాన్ని రద్దు చేసుకుందని, రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ప్రతిపాదనలను అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి సిఫారసు చేశానని గతేడాది గవర్నర్ పేర్కొన్నారు. తాను తలుచుకుంటే సిఫారసు చేయకుండా పెండింగ్‌లో ఉంచగలనని కూడా అప్పట్లో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాలు మరింత తీవ్రమైన నేపథ్యంలో.. ఈసారి బడ్జెట్ ప్రతిపాదనలను తక్షణమే సిఫారసు చేయకుండా గవర్నర్ పెండింగ్‌లో ఉంచినట్టు తెలుస్తోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాష్ట్ర హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయనున్నట్టు సమాచారం.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- డిప్యూటీ మేయర్, మహిళా కార్పొరేటర్ల భర్తలు అరెస్టు!
- పలువురు బిల్డర్లు కూడా..

మేడిపల్లి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లిలో ఓ పేకాట శిబిరంపై దాడి చేసిన మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు.. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మహిళా కార్పొరేటర్ల భర్తలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని సాయిప్రియ కాలనీలో కో ఆప్షన్ సభ్యుడు చిలుముల జగదీశ్వర్‌రెడ్డి కార్యాలయం ఉంది. ఆదివారం సాయంత్రం దీనిపై దాడి చేసిన పోలీసులు.. జగదీశ్వర్‌రెడ్డితో పాటు డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్ కొల్తూరు మహేష్, మహిళా కార్పొరేటర్ల భర్తలు బొడిగె కృష్ణగౌడ్, యాసారం మహేష్, లేతాకుల రఘుపతిరెడ్డి, తూముకుంట శ్రీధర్‌రెడ్డి, పప్పుల అంజిరెడ్డిలతో పాటు కొందరు బిల్డర్లను అదుపులోకి తీసుకున్నారు. మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకునేసరికి ఆఫీసు బయట గేట్‌కు తాళం వేశారు. అయితే అంతకుముందే పోలీసులు లోనికి వెళ్లినట్లు సమాచారం.



శ్రీనగర్‌కు చేరుకున్న భారత్ జోడో యాత్రలో సీతక్క, రేవంత్ తదితరులు

చలో 'భారత్ జోడో' సభ

- రాహుల్ యాత్ర ముగింపు కార్యక్రమానికి రాష్ట్రకాంగ్రెస్ నేతలు
- శ్రీనగర్ చేరుకున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్, సీఎల్పీ నేత భట్టి

సాక్షి, హైదరాబాద్: గతేడాది సెప్టెంబర్ 7న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు జమ్మూ, కశ్మీర్‌లోని శ్రీనగర్‌కు తరలివెళ్లారు. సోమవారం జరిగే ముగింపు కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానం అందడంతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఇప్పటికే శ్రీనగర్‌కు చేరుకున్నారు. ఆదివారమే రేవంత్‌రెడ్డి శ్రీనగర్‌లో రాహుల్‌గాంధీని కలిశారు. వీరితోపాటు నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, సీతక్క, టీపీసీసీ నేతలు హర్కర వేణుగోపాల్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు శ్రీనగర్‌కు వెళ్లారు. భారత్ జోడోయాత్ర ముగింపు కార్యక్రమానికి హాజరుకావాలని టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీసభ్యులు, ఏఐసీసీ కార్యదర్శులకు కూడా ఆహ్వానం అందింది. దీంతో ఈ నాయకులందరూ శ్రీనగర్ బాట పట్టారు.

నేడు సంఘీభావంగా సర్వమత ప్రార్థనలు

మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సర్వమత ప్రార్థనలకు టీపీసీసీ పిలుపునిచ్చింది. భారత్ జోడోయాత్ర ముగింపు, గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థనామందిరాల్లో ప్రత్యేక పూజలు చేయాలని ఇటీవల జరిగిన టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో నిర్ణయించారు. జనవరి 26న హాథ్ సే హాథ్ జోడో యాత్రలను లాంఛనంగా ప్రారంభించగా, 30న అన్ని మతాల ప్రార్థనలు చేసి, ఫిబ్రవరి 6 నుంచి అట్టహాసంగా హాథ్ సే హాథ్ జోడో యాత్రలను ప్రారంభించి రెండు నెలలపాటు కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సర్వమత ప్రార్థనలు నిర్వహించనున్నట్లు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలు ఏసీడీ చార్జీలు చెల్లించొద్దు

- కేసీఆర్ ప్రభుత్వాన్ని నిలదీయండి
- రైతు ఆత్మహత్యల్లో నాలుగవ స్థానంలో రాష్ట్రం
- వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఉట్టిమాటే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



మీడియాతో మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: రాష్ట్ర ప్రజలు విద్యుత్ ఏసీడీ చార్జీలు చెల్లించవద్దని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఏసీడీ చార్జీలు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రజలంతా కేసీఆర్ ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో 'మన్ కీ బాత్'కార్యక్రమంలో పాల్గొన్న బండి సంజయ్, అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ 4వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. అయితే రైతుల ఆత్మహత్యలే లేవని కేసీఆర్ చెప్పడం సిగ్గు చేటన్నారు. రైతులను ఎమ్మెల్యేలుగా చేస్తానంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. దళితుడిని సీఎంగా చేయడం ఎంత నిజమో, రైతులను ఎమ్మెల్యేలను చేస్తాననడం కూడా అంతే నిజం అని ఎద్దేవా చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లేవాళ్లంతా ప్రీ పెయిడ్.. పోస్ట్ పెయిడ్ నాయకులేనని అన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. నిరూపించకపోతే కేసీఆర్ రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని ప్రశ్నించారు. కృష్ణా, గోదావరిలో తెలంగాణ వాటా నీటినే వాడుకోవడం చేతగాని కేసీఆర్, దేశం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. కేసీఆర్ రూ.5 లక్షల కోట్ల అప్పు చేసి ఒక్కో కుటుంబంపై సగటున రూ.6 లక్షల అప్పు భారం మోపారని ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యేల ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఇటీవల హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీలో కోవర్టులు ఉన్నారని చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు బండి సంజయ్‌ని ప్రశ్నించగా.. 'బీజేపీలో కోవర్టులెవరూ లేరు.. ఈటల అలా అన్నారనే విషయమే నాకు తెలియదు. ఆయన ఆ మాట అనలేదనే అనుకుంటున్నా. ఇతర విషయాలు మాట్లాడిన సందర్భంగా మీడియా వక్రీకరించి ఉండొచ్చు'అని సమాధానం ఇచ్చారు. మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ మరణం బాధాకరమని అన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ రవీందర్‌నాయక్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, నాయకులు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోరాడితేనే తప్ప స్పందించని నియంత ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షల్లో మల్టిపుల్ జవాబులున్న ప్రశ్నలకు మార్కులు కలపాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల బండి సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది బీజేవైఎం కార్యకర్తలు, ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల పోరాట విజయమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల అమలు కోసం పోరాడితే తప్ప స్పందించని నియంత ప్రభుత్వం రాష్ట్రంలో కొనసాగడం దురదృష్టకరమని మండిపడ్డారు. 317 జీవోను సవరించి స్థానికత ఆధారంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోస్టింగులివ్వాలని సంజయ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లున్న స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే స్పౌజ్ బదిలీలను వర్తింపజేయడం అన్యాయమన్నారు. స్కూల్ అసిస్టెంట్లతోపాటు ఎస్జీటీ టీచర్లకు స్పౌజ్ బదిలీల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.



ప్రతి అబద్ధం విషం. హాని చేయని అబద్ధాలే లేవు. సత్యం మాత్రమే సురక్షితం. సత్యం మాత్రమే ఓదార్పును ఇస్తుంది. అది విరగని వజ్రం.

– లియో టాల్‌స్టాయ్

సాక్షి

సోమవారం, జనవరి, 30

సంఘర్షణ పర్వం

'మానవ జీవితమే ఒక మహాభారతం/ అది మంచి చెడుల రెంటి నడుమ నిత్య ఘర్షణం/ నరులుండే ఇల సకలం కురుక్షేత్రమే/ ఇక జరుగుతుంది అనుక్షణం ధర్మయుద్ధమే'– 'కురుక్షేత్రం' చిత్రం కోసం శ్రీశ్రీ రాసిన పాట ఇది. మానవ జీవితాన్నే మహాభారతంగా, మంచి చెడుల నడుమ నిత్యం జరిగే ఘర్షణగా ఆయన అభివర్ణించాడు. కాలాలు మారినా, తరాలు మారినా మంచి చెడుల మధ్య జరిగే ఘర్షణ సమసిపోయే పరిస్థితులు లేవు. భవిష్యత్తులోనూ అలాంటి పరిస్థితులు ఉండవేమో! 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం/ నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అని కూడా అన్నాడు శ్రీశ్రీ.

ప్రపంచంలో దుర్బలులను పీడించే బలవంతుల జాతి ఉన్నంత వరకు ఘర్షణలు తప్పవు. ఘర్షణలు ముదిరినప్పుడు యుద్ధాలూ తప్పవు. అందుకే తన 'నా దేశం నా ప్రజలు' అనే 'ఆధునిక మహాభారతం'లో శేషేంద్ర ఇలా అంటారు: 'పోట్లాట నేను బతకడానికి పీల్చే ఊపిరి/ నా అవయవాలకు నీచంగా వంగే భంగిమలు తెలియవు/ నేను సత్యాగ్రాహిని/ నా గుండెల్లో బద్దలవుతున్న అగ్నిపర్వతం/ నా గొంతులో గర్జిస్తున్న జలపాతం'. ఎగుడు దిగుడు సమాజం ఉన్నంత వరకు మనుషులకు సంఘర్షణ తప్పదు. సంఘర్షణే ఊపిరిగా బతకక తప్పదు. అనాది నుంచి ఈ సంఘర్షణే సాహిత్యానికి ముడి సరుకు.

మన భారతీయ సాహిత్యంలో తొలినాటి కావ్యాలు రామాయణ, మహాభారతాలు. వాల్మీకి విరచిత రామాయణం ఆదర్శ జీవితానికి అద్దం పడుతుంది. వ్యాసుడు రచించిన మహాభారతం వాస్తవ ప్రపంచాన్ని కళ్లకు కడుతుంది. ఆధునిక సాహిత్యంలోనూ అనేక రచనలకు ప్రేరణగా నిలిచిన కావ్యాలు రామాయణ, మహాభారతాలు. రామాయణ, మహాభారత గాథల నేపథ్యంలో దాదాపు అన్ని భారతీయ భాష ల్లోనూ అనేక కథలు, నాటకాలు, నవలలు వెలువడ్డాయి. కొన్ని సినిమాలుగా తెరకెక్కాయి. మన తెలుగు సాహిత్యం మహాభారత అనువాదంతోనే మొదలైంది. నన్నయ మొదలుపెట్టిన మహా భారత అనువాదాన్ని తిక్కన, ఎర్రనలు వేర్వేరు కాలాల్లో పూర్తి చేశారు. తెలుగులో మాత్రమే కాదు, మన దేశంలోని అన్ని భాషల్లోనూ తొలినాటి కవులు రామాయణ, మహాభారతాలను కావ్యాలుగా రాశారు. మన పొరుగు భాష కన్నడంలో పంపన 'విక్రమార్జున విజయం' రాశాడు. ఇది 'పంప భారతం'గా ప్రసిద్ధి పొందింది.

మహాభారతంలోనే కాదు, అమృతోత్సవ భారతంలోనూ అనేకానేక ఘర్షణలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. సంక్లిష్టమైన మానవ జీవితంలోని నిత్య ఘర్షణలను ప్రతిఫలించి, సమాజంలోని చెడును చెండాడి, మంచివైపు మొగ్గుచూపేదే ఉత్తమ సాహిత్యంగా కాలపరీక్షను తట్టుకుని తరతరాల వరకు మనుగడలో ఉంటుంది. కాలక్షేపం కోసం రాసే ఆషామాషీ రచనలు కాలప్రవాహంలో ఆనవాలే లేకుండా కొట్టుకుపోతాయి. 'రచయిత తాను వ్రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకు ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హాని, చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను' అన్నారు రావి శాస్త్రి. భాషా ప్రాంతాలకు అతీతంగా రచయితలకు ఈ ఎరుక ఉండి తీరాలి. అలాంటి ఎరుక కలిగిన రచయితలు మనకు చాలామందే ఉన్నారు. అయితే, వారిలో గుర్తింపు కొందరికే దక్కుతోంది. ఒక ఎరుక కలిగిన రచయితకు గుర్తింపు దక్కినప్పుడు సాహితీ లోకం సంబరపడుతుంది. సుప్రసిద్ధ కన్నడ రచయిత ఎస్.ఎల్.భైరప్పకు 'పద్మభూషణ్' దక్కడం అలాంటి సందర్భమే!

ఆధునిక కన్నడ రచయితల్లో భైరప్పకు ప్రత్యేక స్థానం ఉంది. మహాభారత గాథ మర్మాలను విశదీకరిస్తూ, ఆనాటి ఆచారాలను, అంధ విశ్వాసాలను తుత్తునియలు చేస్తూ ఆయన రాసిన 'పర్వ' నవల ఆయనకు ఎనలేని ఖ్యాతిని తెచ్చిపెట్టింది. 'పర్వ'లో కోపోద్రిక్తురాలైన ద్రౌపది 'ఆర్య ధర్మమంటే వేట, తాగడం, జూదం, ఆడవాళ్ల సహవాసం, స్వయంవరం పేరుతో రాచకన్యలను అపహరించి పెళ్లాడటం, కనీసం పదిమంది దాసీలనైనా పెళ్లి కానుకలుగా తెచ్చుకుని వాళ్లతో సుఖించడం' అని నిరసిస్తుంది. 'పర్వ' నవలలో ఇదొక మచ్చుతునక మాత్రమే! ఇంత బట్టబయలుగా రాసేస్తే ఛాందసులు ఊరుకుంటారా? అందుకే, భైరప్పను కీర్తిప్రతిష్ఠలు వరించడంతో పాటు వివాదాలూ చుట్టుముట్టాయి. ఆయన రాసిన 'వంశవృక్ష', 'తబ్బలియు నీనాదె మగనె/ గోధూళి' వంటి రచనలపైనా వివాదాలు రేగాయి. 'వంశవృక్ష' తెలుగులో 'వంశవృక్షం' పేరుతో బాపు దర్శకత్వంలో సినిమాగా వచ్చింది. భైరప్ప 1996లో తన ఆత్మకథను 'భిత్తి' పేరుతో వెలుగులోకి తెచ్చారు. ఇది పదకొండు పునర్ముద్రణలను పొందింది. ఆయన నవలల్లో 'దాటు', 'పర్వ' వంటివి తెలుగులోనూ అనువాదం పొందాయి.

సంఘర్షణలమయమైన మహాభారతాన్ని 'పర్వ'గా అందించిన భైరప్ప జీవితంలోనూ అనేక ఘర్షణలు ఉన్నాయి. బాల్యంలోనే తల్లి, సోదరులు ప్లేగు వ్యాధికి బలైపోయారు. చిన్నా చితకా పనులు చేసుకుంటూనే ఉన్నత చదువులు చదివి, అధ్యాపక వృత్తిలో స్థిరపడ్డారు. స్వయంగా అనుభవించిన సంఘర్షణల వల్ల జీవితంపై తనదైన దృక్పథాన్ని ఏర్పరచుకుని, రచనా వ్యాసంగం మొదలుపెట్టి, సాహితీరంగంలో ఉన్నత శిఖరాలను అందుకున్నారు. సంఘర్షణలు రాటుదేల్చిన రచయిత చేసే రచనల్లో జీవన సంఘర్షణలు ప్రతిఫలిస్తాయి. అవి ఆ రచయిత రచనలను అజరామరం చేస్తాయి.

డాక్యుమెంటరీపై మాటల సెల్ఫ్ గోల్

కామెంట్



కరణ్ థాపర్

గుజరాత్‌లో 2002లో జరిగిన హింసపై 'బీబీసీ' నిర్మించిన తాజా డాక్యుమెంటరీని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి ఖండించారు. తాను దాన్ని చూడలేదని పేర్కొంటూనే, దేశ ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా, తప్పుడు వాదనతో, ప్రచార యావతో తీసిన డాక్యుమెంటరీగా దాన్ని ప్రకటించారు. భారత విదేశీ వ్యవహారాల శాఖ, హోమ్ శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి పలు మంత్రిత్వ శాఖలు, సంస్థలకు చెందిన సీనియర్ అధికారులు... బీబీసీ తాజా డాక్యుమెంటరీపై కనీసపాటి ఆలోచన కూడా లేకుండా తీవ్ర ధోరణిలో మాట్లాడారు. భారతదేశ సార్వభౌమత్వాన్నీ, సమగ్రతనూ ఆ డాక్యుమెంటరీతో కించపర్చారంటూ వారు ఆరోపించారు. భారతదేశంలో అసలు ప్రసారమే చేయని ఒక డాక్యుమెంటరీ చిత్రం మన దేశాన్ని ఆ స్థాయిలో ముక్కలు ముక్కలు చేస్తుందా? వారు వ్యక్తం చేసిన ఆందోళన బీబీసీ పైనా, దాని డాక్యుమెంటరీ పైనా కాదు. మన దేశ మనుగడ పైనే వారు కలవరం వ్యక్తపరిచినట్టుగా తయారైంది. తప్పుగా మాట్లాడటం ద్వారా వారు తమ సెల్ఫ్ గోల్ చేసుకున్నారు.

ఈ విషయం గురించి నేను ఎక్కువగా ఆలోచించేకొద్దీ, నిజానికి సమస్య మనలోనే ఉందని చెబుతాను. సాధారణంగా రాజకీయ నాయకుల వద్ద ప్రతి సమస్యకూ పరిష్కారం ఉండాలనీ, ప్రతి సమస్యపై వారు వ్యాఖ్యానించాలనీ, ప్రతి వ్యక్తికి సంబంధించి అర్థవంతమైన, కచ్చితమైన అభిప్రాయాన్ని కూడా కలిగి ఉండాలనీ, అన్ని పరిస్థితులనూ వారు అర్థం చేసుకోవాలనీ మనం భావిస్తుంటాం. కాని వారు అలా చేయలేరు. అది వారికి సాధ్యం కూడా కాదు. అలాగని తాము దేన్నయినా సరే... చేయగలమని వారు నటించినట్లయితే దానిని మనం వారిని అగౌరవించాల్సిన పని లేదు. సూటిగా చెప్పాలంటే, రాజకీయ నాయకులు వారి పట్ల మనకు ఉందనుకుంటున్న గౌరవాన్ని కోల్పోవలసిన అవసరం లేదు. అయితే వారు గుర్తించనిది ఏమిటంటే, మన అంచనాలు వారికి ఒక ఉచ్చు లాంటివి. ఆ సంగతి వారు స్పష్టంగా గ్రహిస్తూనే, గర్విస్తూనే మనం ఏర్పరచిన ఉచ్చులో చిక్కుకుంటూ ఉంటారు.

ఇవాళ ఆలోచనాత్మకమైన, మేధాసహితమైన స్పందనల కంటే ఆకట్టుకునేలా అభిప్రాయాలు వెల్లడించడమే ఎక్కువ అవసరమని రాజకీయ నాయకులు భావించే దశకు మనం చేరుకున్నాం. ఎందుకంటే, వీటిలో ఆకర్షణీయమైన స్పందనే పతాక శీర్షికలకు ఎక్కుతుంది. అది వారికి ప్రచారాన్ని కల్పిస్తుంది. మరోవైపున ఆలోచనతో కూడిన స్పందన మరింత అర్థవంతంగానూ, సహాయకారిగానూ ఉండవచ్చు కానీ దీన్ని అర్థం చేసుకోవడానికి కాస్త ఏకాగ్రత అవసరమవుతుంది. కాబట్టి పునః పరిశీలనకు అది పిలుపునిస్తుంది. పైగా ఆకర్షణీయమైన స్పందనకు సరిసమానమైన ప్రభావాన్ని మేధాసహితమైన స్పందన కలిగించనే కలిగించదు.

'షారుఖ్ ఖాన్ ఎవరు? అతడి గురించి నాకేమీ తెలీదు' అని అస్సామ్ ముఖ్యమంత్రి హిమంతా బిశ్వ శర్మ ఇటీవల చేసిన ప్రకటన దీనికి అత్యుత్తమమైన ఉదాహరణ అని నేను చెబుతాను. గౌహతిలో విలేఖరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, ఆయన చేసిన ఈ వ్యాఖ్య అత్యంత వివాదాస్పదమైంది. అంతేకాదు. ఆయన మాటల్లో అసలు నిజం లేదు. ఒకవేళ ఆయన వ్యాఖ్య గనక నిజమే అయితే... మన దేశంలోని ప్రజల గురించి ఏ మాత్రం తెలియని స్థితిలో సదరు అస్సామ్ ముఖ్యమంత్రి ఉన్నారని చెప్పక తప్పదు. నిజానికి ఆయన చేసిన ఆ ప్రకటన అమితాబ్ బచ్చన్ స్వయంగా 'నరేంద్ర మోదీ ఎవరు? ఆయన గురించి నాకేమీ తెలీదు' అని చెప్పినట్టు ఉంది.

ప్రముఖ హిందీ సినీ కథానాయకుడు షారుఖ్ ఖాన్ ఎవరో తెలియని భారతీయులు ఎవరైనా ఉంటారా అని నాకు సందేహం. అలాగే, భారతీయ జనతా పార్టీ నేత – ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురించి కూడా తెలియనివారు ఉన్నారంటే కూడా సందేహించాల్సి ఉంటుంది. అందుకనే అస్సామ్ ముఖ్యమంత్రి వ్యాఖ్యను జనం దృష్టిని ఆకర్షించడానికి, జనం తమను ఏదో ఒకలా గుర్తుంచుకునేలా చేసే తప్పుడు ప్రయత్నంగానే చూడాల్సి ఉంటుంది. ఈ ఉదంతంలో అన్నీ తప్పుడు అంశాలే ఉన్నాయని చెప్పాల్సి ఉంటుంది.



విషాదం ఏమిటంటే, కనీసపాటి ఆలోచన కూడా లేకుండా షారుఖ్ ఖాన్ గురించి అలా మాట్లాడటం వల్ల అస్సామ్ ముఖ్యమంత్రి హిమంతా బిశ్వ శర్మ దేశవ్యాప్తంగా మూర్ఖుడిగా మారిపోయారు. 2002 నాటి గుజరాత్ హింసపై బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) రూపొందించిన డాక్యుమెంటరీని విమర్శించి, ఖండించాలన్న ఉద్దేశంతో భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి కూడా దాదాపు ఇలాంటి పనే చేశారు. ఆ డాక్యుమెంటరీని తాను చూడలేదని ఒప్పుకుంటూనే, నిర్దిష్టంగా ఒక తప్పుడు వాదనను జనంలోకి తీసుకుపోవడానికి, ప్రచారమే పరమావధిగా తీసిన డాక్యుమెంటరీగా దాన్ని ప్రకటించారు. పైగా అది పక్షపాతంతో కూడుకున్నదనీ, దాంట్లో నిష్పాక్షికత లోపించిందనీ నిందించారు.

అయితే బీబీసీ తాజా డాక్యుమెంటరీని చూడనప్పుడు దాంట్లోని విషయాలను ఆయన ఎలా ప్రస్తావించారు? అది కూడా తానొక అధికారిక ప్రతినిధి అయ్యుండి, తాను చూడని విషయంపై ఎలా వ్యాఖ్యానించారు అనే ప్రశ్న వస్తుంది. అయితే తాను దేని గురించి మాట్లాడుతున్నదీ తనకు స్పష్టంగా తెలుసన్నట్టుగా ఆయన చేసిన వ్యాఖ్యలు, వర్ణనలు ఉన్నాయి. అధికారిక ప్రతినిధి చేసే ప్రకటన సాధికారికంగా ఉంటుందనీ, విశ్వసించదగినదనీ ఎవరైనా భావిస్తారు. వాళ్ళూ వీళ్ళూ చెబుతుంటే విని చెబుతున్నట్టుగా, వేరెవరి అభిప్రాయాలో మళ్లీ ప్రస్తావించినట్టుగా ఉంటాయనీ, ఉండాలనీ ఎవరూ అనుకోరు. కానీ ఆయన తాజా వ్యాఖ్యలన్నీ అచ్చంగా అలాగే ఉన్నాయని గ్రహించాలి.

భారత విదేశీ వ్యవహారాల శాఖ, హోమ్ శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి పలు మంత్రిత్వ శాఖలకూ, సంస్థలకూ చెందిన పేరు చెప్పడానికి ఇష్టపడని సీనియర్ అధికారులు దాదాపుగా దేశంలోని అన్ని పత్రికలతో మాట్లాడారు. బీబీసీ తాజా డాక్యుమెంటరీపై తమ వాదనను బలంగా వినిపించడం కోసం కనీసపాటి ఆలోచన అయినా కూడా లేకుండా వారు తీవ్ర ధోరణితో మాట్లాడారు. ఆ తొందరలో చివరకు భారతదేశం గురించి ఇబ్బందికరమైన ప్రశ్నలు పొడసూపేలా చేశారు. ఆ డాక్యుమెంటరీలో భారత సార్వభౌమత్వాన్నీ, సమగ్రతనూ కించపర్చారంటూ వారు ఆరోపించారు. నిజమా? నిజంగానే అలా జరిగిందా?

ఇంతకూ వారు గుర్తించని విషయం ఒకటి ఉంది. అది ఏమిటంటే – తాము ఏం మాట్లాడుతున్నాం అనే విషయం గురించి వారు కనీసం ఒక్కసారి కూడా ఆగి, నింపాదిగా ఆలోచించలేపోయారు. భారతదేశంలో అసలు ప్రసారమే చేయని ఒక డాక్యుమెంటరీ చిత్రం మన దేశాన్ని ఆ స్థాయిలో ముక్కలు ముక్కలు చేస్తుందా? పైగా యూట్యూబ్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా ప్రచార, ప్రసార వేదికలను వాడేవారు మన జనాభాలో అతి తక్కువమంది అని తప్పక గుర్తుంచుకోవాలి. ఒకవేళ ఆ కొద్దిమంది ఆ డాక్యుమెంటరీ చూసినంత మాత్రాన మన జాతీయ చక్రమే కదిలిపోతుందా? విచ్ఛిన్నమవుతుందా?

చివరకు వచ్చేసరికి వారు వ్యక్తం చేసిన ఆందోళన అంతా బీబీసీ పైనా, దాని డాక్యుమెంటరీ పైనా కాదు. మన దేశంలోని పరిస్థితి పైనా, దేశ మనుగడకు సంబంధించిన అంశం పైనే వారు కలవరం వ్యక్తపరిచినట్టు అయింది. అలా వారు దాన్ని గురించి తప్పుగా మాట్లాడటం ద్వారా సెల్ఫ్ గోల్ చేసుకున్నట్టు అయింది.

ఇప్పుడు మన ప్రియమైన ముఖ్యమంత్రి, మన అధికార ప్రతినిధి, అలాగే నిగూఢమైన మన ప్రభుత్వ సీనియర్ అధికారులు ఈ విషయంపై భయకంపిత స్వరంతో మాట్లాడి ఉన్నట్లయితే నేను దానికి ఏమాత్రం భయపడను. బదులుగా ముసిముసిగా నవ్వుకునేవాడిని.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

స్ఫూర్తి ప్రదాత



దేశ నిర్మాణం ఒక నైతికమైన ప్రక్రియ. ద్వంద్వ నీతిని పాటిస్తూ మనం ఈ పనిలో విజయవంతంగా పాల్గొనలేం. గొప్ప స్వాతంత్య్ర సమర యోధుడు, మా స్ఫూర్తి, పంజాబ్ కేసరి లాలా లజపతి రాయ్‌కి ఆత్మశుద్ధితో నివాళులు అర్పించాం.

– మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

మూకుమ్మడి దాడి



మోదీకి వ్యతిరేకంగా 2024 ఎన్నికలకు పడిన తొలి అడుగు ఈ బీబీసీ డాక్యుమెంటరీ. సరిగ్గా ఎన్నికలకు ముందు పడే రెండో అడుగు... రామ మందిర నిర్మాణంపై అంతిమ దాడి. ఏమాత్రం ఆశ్చర్యం కలిగించబోనిది కూడా ఉంది. మోదీ పదేళ్ల పాలనా వైఫల్యాల కథనాలు త్వరలోనే పత్రికల్లో ప్రత్యక్షం అవుతాయి.

– తుషార్ గుప్తా, సంపాదకుడు

కడుపు కాలుతున్నా...



పాకిస్తాన్‌లో ఈరోజు 10 కిలోల నాణ్యమైన గోధుమ పిండి ధర 2,500 రూపాయలు. అయినప్పటికీ వారి విదేశీ వ్యవహారాల మంత్రి బి.బి. భుట్టో జర్దారీ కశ్మీర్ గురించి మాట్లాడుతూ, మోదీని గుజరాత్ కసాయిగా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంలో కశ్మీర్ సందర్శనకు జర్దారీకి స్వాగతం.

– లక్కీ, సివిల్స్ అభ్యర్థి

బూస్టర్ వేస్ట్



ఫైజర్ కంపెనీ కోవిడ్ వ్యాక్సిన్‌ల కోసం ఇజ్రాయిల్‌ను ప్రయోగశాలగా ఉపయోగించుకుంది. ఇప్పుడు ఇజ్రాయిల్‌లో ఎవరూ కూడా సురక్షితం కాని ఆ పనికిమాలిన బూస్టర్ డోస్‌లను వేయించుకోవాలని కోరుకోవడం లేదు. చరిత్రలోనే అత్యంత ఘోరమైన ఔషధ వైఫల్యం ఇది.

– డాక్టర్ ఎలి డేవిడ్, పరిశోధకుడు

విజయీభవ



కొన్నిసార్లు అన్నీ తెలుసుకుని అన్నిటి గురించీ అభద్రతలోకి జారుకోవడం కన్నా, అసలేమీ తెలుసుకోకుండా ఆనందంగా ఉండటం మంచిది. శివ్ థాకరే బిగ్‌బాస్–16 విజేత అవ్వాలని కోరుకుంటున్నా.

– జివేస్, కర్మవాది

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మహాత్మా! చూస్తున్నావా!!

ఓ మహాత్మా!
చెడు అనకు, వినకు, చూడకు
అన్న పలుకులు నీవైతే
నేటి సమాజానికవే ప్రీతిపాత్రం.
అహింసాయోధుడవు నీవు,
హింసా వీరులు నేటి నాయకగణం.
సర్వమత ఐక్యత నీ పథం
అనైక్యతే నేటి జనుల మార్గం.

మద్యం వద్దని నీవు,
అదే ముద్దని నేటి ప్రభుత.
మహిళా సాధికారత నీ కల, మరి నేడో
కలకంఠి కంట కన్నీరు చూడందే
నిద్రపోని పాపండులెందరో!
గ్రామ స్వరాజ్యం నీ ఊహాసుందరి,
దాని అభావానికై
నేటి పాలకుల శక్తివంచన లేని కృషి.
నీవు చూపిన నాటి విరి బాట
నేటి రాజకీయులకు ముళ్లబాట.

సమానతే నీ ధ్యేయం,
అసమానతే నేటి తరం లక్ష్యం.
నిరాడంబరతే నీ భావనైతే
ఆడంబరయుత బోకడలు
నేటి యువత చిరునామా!
నాటి నీ పాదయాత్ర ఏకతా రాగమైతే
నేటి పాదయాత్రలు
హింసాయుత మార్గాలు,
శాంతి భద్రతల భగ్నానికి
దగ్గర దారులు.
బాపూ! నీ మార్గంలో
నేటితరం పయనించేలా దీవించవా!



– వేమూరి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం
(నేడు మహాత్మా గాంధీ వర్ధంతి)

బడ్జెట్‌లో సంక్షేమ మార్గం పడతారా?

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

కేంద్రం ప్రతియేటా ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్ కారణంగా ప్రభావితం అయ్యే వర్గాల ప్రజలలో బడ్జెట్ ముందు సహజంగానే కొంత ఉత్కంఠ నెలకొంటుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్‌లో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు ఉండొచ్చునన్న అంచనాలు ఉన్నాయి. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ గత 8 ఏళ్లుగా వల్లె వేస్తున్నారు. అంటే – దేశంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం కలగజేయడం, వారి జీవన ప్రమాణాలు పెంచడం తమ లక్ష్యం అని చెప్పుకొంటూ వస్తున్నారు. పేదలకు గృహనిర్మాణం, పారిశుద్ధ్యం మెరుగుదల, పేద కుటుంబాలన్నింటికీ గ్యాస్ సిలిండర్ల సరఫరా, నగదు బదిలీ పథకాలు, రైతాంగానికి పెట్టుబడి సాయం (పీఎం కిసాన్), వృద్ధాప్య పెన్షన్లు, ఆయుష్మాన్ భారత్, పేదలకు ఉచిత రేషన్ తదితర పథకాలన్నీ తమ సంక్షేమ విధానానికి చిహ్నంగా బీజేపీ అభివర్ణించుకొంటున్నది. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాల్ని అందిస్తున్నప్పుడు 'సబ్ కా వికాస్' ఆచరణలోకి రావాలి కదా!

దేశ జనాభాలో 1 శాతం మంది ధనికుల చేతుల్లో 40 శాతం దేశ సంపద చిక్కుకుని ఉందనీ; 50 శాతం జనాభా అంటే... 65 నుంచి 70 కోట్ల మంది ప్రజల చేతుల్లో కేవలం 3 శాతం సంపద మాత్రమే ఉన్నదనీ తాజా గణాంకాలు వెల్లడించాయి. మరోపక్క ఈ 8 ఏళ్లల్లో బ్యాంకుల 14.38 లక్షల కోట్ల రూపాయల మొండి బకాయిలను రద్దు చేశారు. అయినప్పటికీ ఇంకా బ్యాంకుల నిరర్థక ఆస్తుల గ్రాస్ రేటు 6.5 శాతంగా ఉంది. పెట్రో ధరల పెరుగుదల చరిత్రలో లేనంతగా ఈ 8 ఏళ్లల్లో పెరిగింది. డీజిల్‌పై 512 శాతం, పెట్రోల్‌పై 194 శాతం, గ్యాస్ సిలిండర్లపై 185 శాతం భారం మోపారు. అన్ని వస్తువులపై గరిష్ఠంగా వేస్తున్న జీఎస్టీ, గృహనిర్మాణ వస్తువుల ధరల పెరుగుదల... తదితర భారాలతో పోల్చితే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం ఎందుకూ కొరగాకుండా ఉంది.

ఉద్యోగాల సృష్టి చేయలేని ఆర్థికాభివృద్ధి వల్ల ఎటువంటి లాభం లేదని గత కొన్నేళ్ల అనుభవాలు తెలియజేస్తున్నాయి. ఉపాధి, ఉద్యోగాలు లేకుండా ఉన్న యువత సంఖ్య 21.8 కోట్లుగా ఉన్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. దేశంలో ఇంకా అనేక ప్రాంతాలకు రైలు రవాణా విస్తరించాల్సి ఉండగా, దేశంలోని ఎగువ మధ్యతరగతి వారి కోసం 'వందే భారత్' రైళ్లను ప్రవేశపెట్టారు. రైల్వే ట్రాక్‌ల సామర్థ్యం అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ, వాటిని పూర్తి స్థాయిలో పటిష్ఠపర్చకుండా గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వందే భారత్ రైళ్లను ఒక్కొక్కటి రూ. 120 కోట్ల వ్యయంతో దశల వారీగా మొత్తం 475 ప్రారంభించాలని సంకల్పించడం ఆశ్చర్యం కలిగించకమానదు.

2014లో అధికారంలోనికి వచ్చిన బీజేపీ ఈ 8 ఏళ్లలో సంక్షేమబాట నుంచి క్రమంగా వైదొలుగుతూ వస్తోంది. 2016లో నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొన్న రెండు ప్రధాన నిర్ణయాలు దేశ ఆర్థికరంగాన్ని అతలా కుతలం చేశాయి. మొదటిది పెద్దనోట్ల రద్దు; రెండోది జీఎస్టీ అమలు. వ్యవసాయ రంగ ముఖచిత్రాన్ని మార్చి వేస్తామని చెప్పి కార్యాచరణ చేపట్టకపోవడంతో రైతులు రెట్టింపు నష్టాల్లో కూరుకుపోయారు. ప్రస్తుతం దేశంలో అనేక రాష్ట్రాలలో రైతులు క్రాప్ హాలిడే ప్రకటి స్తున్నారు. దానివల్ల ఆహార ధాన్యాల నిల్వలు పడిపోతు న్నాయి. గోదాముల్లో ఇప్పుడు కేవలం 4.92 కోట్ల మెట్రిక్ టన్నుల గోధుమలు, బియ్యం మాత్రమే నిల్వ ఉన్నట్లు భారత ఆహార సంస్థ తెలియజేసింది.

కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యరంగంపై కొంతమేర అనివార్యంగా వ్యయాన్ని పెంచింది. టీకాల కొనుగోలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఆక్సిజన్ సిలిండర్ల సరఫరా పెంపుదల వంటి మౌలిక సదుపాయాలపై గణనీయంగా ఖర్చు చేసింది. అయినప్పటికీ, ఆ మొత్తం.. దేశ స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో 2 శాతానికి మించలేదు.

ఇక, విద్యారంగాన్ని పరిశీలిస్తే, 2012–13లో యూపీఏ ప్రభుత్వం జీడీపీలో 3.36 శాతం నిధుల్ని కేటాయించగా, ఎన్డీఏ వచ్చిన ఈ 8 ఏళ్లల్లో విద్యారంగంపై చేస్తున్న వ్యయంలో నామమాత్రపు పెరుగుదల మాత్రమే ఉంది. నూతన విద్యా విధానాన్ని ఘనంగా ప్రకటించినప్పటికీ అందుకు అనుగుణంగా కేటాయింపులు పెంచలేదు. మధ్యాహ్న భోజన పథకానికి (ప్రధాన మంత్రి పోషణ్) వెచ్చిస్తున్న నిధుల్లో గత 7 ఏళ్లుగా ఎలాంటి పెరుగుదలా



లేదు. కీలకమైన విద్యారంగంలో కేటాయింపులు పెంచకుండా దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లగలరు? ఎంతో కీలకమైన పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగంలో ఇతర దేశాలు 3 శాతం మేర కేటాయింపులు చేస్తుంటే భారత్ కేటాయింపులు గత దశాబ్ద కాలంగా 1 శాతం మించడం లేదు.

2008, 2009 సంవత్సరాలలో భారత్ అత్యధిక స్థాయిలో ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల్ని, 2.5 శాతం జీడీపీ మేర ఆకర్షించింది. కానీ, ఆ మొత్తం క్రమంగా తగ్గిపోతూ 2021 నాటికి 1.4 శాతానికి చేరింది. నిరుద్యోగిత పెరుగుదల వల్ల ప్రజల పొదుపు గణనీయంగా పడిపోయింది. క్యాపిటల్ ఫార్మేషన్‌లో కీలకమైన పొదుపు మొత్తాలు సన్నగిల్లడంతో... కేంద్ర ప్రభుత్వం అధిక వడ్డీ రేట్లకు వివిధ మార్గాల ద్వారా అప్పులు తెచ్చుకొంటోంది. ఈ 8 ఏళ్లల్లో కేంద్రం కొత్తగా చేసిన అప్పులు రూ. 91 లక్షల కోట్లు దాటాయి.

అయితే, బ్రిటన్‌ను పక్కకు తోసి భారత్ ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఇదెలా సాధ్యపడింది? ఇందులో కేంద్ర ప్రభుత్వం చొరవను సమీక్షించినట్లయితే, గత 20 సంవత్సరాలలో, ఇతర దేశాలకంటే భారత్ ఐటీ రంగంలో వడివడిగా ముందుకుసాగింది. ఐటీ ఆధారిత సేవలు, ఉత్పత్తుల రంగంలో భారత్ అగ్రగామిగా ఉంది. ఈ రంగం అభివృద్ధికి కేంద్రం చేసింది నామమాత్రమే. సేవల రంగంలో కూడా మిగతా అభివృద్ధి చెందిన దేశాల కంటే భారత్ అగ్రస్థానంలో ఉంది.

క్లుప్తంగా చెప్పాలంటే, దేశ ఆర్థికాభివృద్ధికి ఐటీ, సేవల రంగాలు మాత్రమే గణనీయంగా దోహదం చేస్తున్నాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టు బడులు ఎక్కువగా ఐటీ, సేవల రంగాల్లోనే వస్తున్నాయి. ఇతర కీలక రంగాలలో ఎఫ్‌డీఐలను ఆకర్షించాల్సిన అవ సరం ఉంది. ఉత్పత్తిరంగంలో వృద్ధి ఆశాజనకంగా లేదు. దేశానికి వెన్నెముక అయిన వ్యవసాయ రంగం పట్ల ఇంతకు ముందు మాదిరిగానే చిన్నచూపు చూస్తున్నారు. 'మేకిన్ ఇండియా' ఎందుకు చతికిల పడిందో ఆత్మావలోకనం చేసు కోవాలి. దేశంలో 15 కోట్ల మందికి ఉపాధి కల్పించే సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఇ) ఊతం కల్పించాలి. విద్య, ఆరోగ్య రంగాలపై ప్రభుత్వ వ్యయం ఇంకా పెరగాలి. ఆహార ఉత్పత్తుల దిగుమతులపై ఆంక్షలు విధించి దేశీయ రైతాంగాన్ని మరింత ప్రోత్సహించాలి. నూతన వార్షిక బడ్జెట్‌లోనైనా ప్రధాని దేశంలో 60 కోట్లు పైబడి ఉన్న పేద, మధ్య తరగతి వర్గాలపై కనికరం చూపిస్తారా?

వ్యాసకర్త శాసన మండలి సభ్యులు, ఆంధ్రప్రదేశ్

గ్రహం అనుగ్రహం శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.నవమి ప.2.04 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: కృత్తిక రా.1.41 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: ప.1.16 నుండి 2.55 వరకు, దుర్ముహూర్తం: ప.12.35 నుండి 1.22 వరకు, తదుపరి ప.2.51 నుండి 3.34 వరకు, అమృతఘడియలు: రా.11.05 నుండి 12.46 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.50.

క్లుప్తంగా...

వీరశైవ లింగాయత్, లింగ బలిజలను ఓబీసీ జాబితాలో చేర్చాలి



సదస్సులో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్, లింగ బలిజలను ఓబీసీ జాబితాలో చేర్చాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వీరశైవ లింగాయత్, లింగబలిజ రాష్ట్రస్థాయి సభలో ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్, లింగబలిజ 2023 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వీరశైవ లింగాయత్, లింగ బలిజలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి, జాతీయ బీసీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ విషయంపై మరోసారి దేశ రాజధాని ఢిల్లీ నగరంలో మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం అధ్యక్షుడు ఈశ్వరప్ప, గౌరవ అధ్యక్షుడు సంగమేశ్వర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల కోట్లు కేటాయించాలి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో వెనుకబడిన తరగతుల కోసం రూ.2లక్షల కోట్లు కేటాయించాలని ఆర్.కృష్ణయ్య కోరారు. 2023–24 వార్షిక బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు ప్రధానమంత్రి మోదీకి ఆయన ప్రత్యేకంగా లేఖ రాసినట్లు తెలిపారు.

అనాథ పిల్లల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే



సాక్షి, హైదరాబాద్: అనాథ పిల్లల సంరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, ఇందుకు ప్రత్యేక విధానాన్ని ప్రకటించాలని ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ డిమాండ్ చేశారు. పలు వేదికలపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు ప్రత్యేక విధానంపై పలు వాగ్దానాలు చేసినా కార్యాచరణ లేదని ఆయన మండిపడ్డారు. అనాథ పిల్లల సంరక్షణ చర్యలపై ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించి ప్రత్యేక గుర్తింపు కార్డులు, కేజీ టు పీజీ ఉచిత విద్య తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ ఈనెల 30న ఇందిరా పార్క్ వద్ద దీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

3న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు



ముషీరాబాద్ (హైదరాబాద్): ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎంతో ప్రతిష్టాత్మకంగా దళిత సంక్షేమానికి తీసుకొచ్చిన దళితబంధు పథకం విధివిధానాలు ప్రకటించాలని అందుకోసం ఫిబ్రవరి 3న రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...సీఎం కేసీఆర్ దళిత సంక్షేమానికి కృషి చేస్తూ దళితబంధు పథకం తీసుకొచ్చారని, ఈ పథకం లక్ష్యం నెరవేరకుండా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. నిరుపేదలకి ఈ పథకం చేరే విధంగా విధివిధానాలను ప్రకటించాలన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కమిటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చందు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేశ్, శ్రీకాంత్, ఓయూ అధ్యక్షుడు ఎల్.నాగరాజు పాల్గొన్నారు.

మృత్యువులోనూ.. తోడుంటానంటూ...



కేసముద్రం: వృద్ధ దంపతుల బంధం మృత్యువులోనూ వీడలేదు. గంటల వ్యవధిలోనే ఒకరివెంట మరొకరు మృతిచెందిన విషాదకర సంఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కందుల కొమురమ్మ (74), కొమ్మాల్‌రెడ్డి(82) భార్యభర్తలు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కొమురమ్మ, కొమ్మాల్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో కొమురమ్మ ఆరోగ్య పరిస్థితి విషమించి ఉదయం 8 గంటల సమయంలో మృతిచెందింది. దీంతో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. అయితే అప్పటికే భార్య మృతిచెందిన విషయం తెలియడంతో తీవ్ర మనోవేదనకు గురైన కొమ్మాల్‌రెడ్డి సాయంత్రం 3 గంటలకు మృతి చెందాడు. తల్లి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగానే ఇంతలోనే తండ్రి కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం భార్యాభర్తల అంత్యక్రియలు ఒకేచోట నిర్వహించారు.

మనకు తిండి.. రైతుకు తిప్పలు

దేశంలో ఆరేళ్లుగా ధాన్యాల దిగుబడి పెరుగుతున్నా రైతులు అప్పుల పాలే

49.6 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు విదేశాలకు..

- అయినా రైతులకు ప్రయోజనం అంతంతే..
- లాభపడుతున్నది దళారులు, వ్యాపారులే..
- ఎగుమతులు, దిగుమతులపై కేంద్రానికి సరైన విధానం లేకపోవడమే కారణం
- ప్రభుత్వాలు తగిన ప్రణాళికలు రూపొందించాలంటున్న నిపుణులు

ఆరుగాలం కష్టపడే రైతులు.. మనకు అన్నం పెడుతున్నారు.. ఆహార ధాన్యాల ఎగుమతులతో ఇతర దేశాలకూ తిండి పెడుతున్నారు.. లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులతో దేశ ఆర్థికవ్యవస్థకు ఊతంగా నిలుస్తున్నారు.. కానీ వారు మాత్రం అప్పుల్లో కూరుకుపోతున్నారు. అవి తీర్చలేక, కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

12,000 2021-22 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 12 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి.

(సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్)

దేశం వ్యవసాయపరంగా అభివృద్ధి సాధిస్తోంది. గత ఆరేళ్లలో దేశం నుంచి ఆహార ధాన్యాల ఎగుమతులు బాగా పెరిగాయి. ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. ఇలా వృద్ధి సాధించడం ఏ దేశానికైనా శుభసూచకమే. ఈ ఎగుమతులతో రైతులు బాగుపడితే, వారి ఆర్థిక పరిస్థితి మెరుగైతే అది శుభం. కానీ దేశంలోని రైతాంగం పరిస్థితి ఏమాత్రం మారడం లేదు. వేల కోట్ల రూపాయల ఎగుమతులు జరుగుతున్నా.. ఆ ప్రయోజనం అన్నదాతలకు అందడం లేదు. పైగా అప్పుల పాలవుతున్నారు. ఎందుకంటే చాలా వరకు ప్రైవేట్ సంస్థలే ఎగుమతులు చేస్తున్నాయి. ఆ లాభాన్ని వ్యాపారులే పొందుతున్నారు. ఇలా ఎగుమతులు పెరిగిన కొద్దీ ఆహార ధాన్యాల ధరలు మండుతున్నాయి. ఈ లాభమూ దళారులకే వెళ్తుంటే... వినియోగదారులపై భారం పడుతోంది.

మార్కెట్ మాయాజాలంతో..


ఐదారేళ్లుగా దేశమంతటా వర్షాలు విస్తారంగా కురవడంతో పంటల దిగుబడులు విపరీతంగా పెరిగాయి. ఇదే సమయంలో ఆహార ధాన్యాల ఎగుమతులు పెరుగుతూ వస్తున్నాయి. వరి, గోధుమ, పప్పు దినుసులు, నూనె గింజలు. కాఫీ. జనపనార (జ్యూట్), చెరుకు, తేయాకు, పొగాకు, వేరుశనగ, డెయిరీ పదార్థాలు, పళ్ల ఎగుమతి అవుతున్నాయి. అయితే దేశంలో ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి సరైన విధానం లేని కారణంగా రైతులకు నష్టం జరుగుతోంది. మార్కెట్‌లోకి ఆహార ధాన్యాలు రావడానికి ముందు దిగుమతులను పెంచడం, రైతుల నుంచి ఆహార ధాన్యాలు వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాక దిగుమతులు నిలిపేసి, ఎగుమతులకు అవకాశం ఇవ్వడం వల్ల వ్యాపారులకే లబ్ధి జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. మధ్యలో దళారీ వ్యవస్థ రెండు చేతులా సంపాదిస్తోంది.



గణనీయంగా ఎగుమతులు..

ప్రస్తుతం దేశం నుంచి బియ్యం ఎగుమతులు ఎక్కువగా ఉన్నాయి. 2021–22 సంవత్సరంలో జరిగిన ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో బియ్యం వాటా 19 శాతం. తర్వాత చక్కెర (9 శాతం), స్పైసెస్ (8శాతం), మాంసం (7శాతం) ఉన్నట్టు భారత పరిశ్రమలు, వాణిజ్య శాఖ లెక్కలు చెప్తున్నాయి. ఇక గోధుమల ఎగుమతులు కూడా పెరుగుతున్నాయి. 2020–21లో వీటి ఎగుమతుల విలువ 568 మిలియన్ డాలర్లు కాగా.. 2021–22లో ఏకంగా 2.1 బిలియన్ డాలర్లకు పెరగడం గమనార్హం. ఇదే సమయంలో తొలిసారిగా కాఫీ పొడి ఎగుమతులు బిలియన్ డాలర్లు దాటాయి. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కాఫీ తోటల వారికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. చేపల ఎగుమతులు కూడా భారీగా పెరిగాయి. సముద్ర తీరం అధికంగా ఉన్న పశ్చిమబెంగాల్, ఏపీ, ఒడిశా, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్‌ల నుంచి ఏకంగా 7.7 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు జరుగుతున్నాయి.

ఏయే దేశాలకు ఎగుమతులు?



భారత్ నుంచి ఆహార ధాన్యాలు ఎక్కువగా తీసుకుంటున్న దేశాల్లో అమెరికా, బంగ్లాదేశ్, చైనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, వియత్నాం, ఇండోనేసియా, సౌదీ అరేబియా, ఇరాన్, నేపాల్, మలేసియా దేశాలు ప్రధానంగా ఉన్నాయి. వీటితోపాటు కొరియా, జపాన్, ఇటలీ, యునైటెడ్ కింగ్‌డమ్ తదితర దేశాలూ మన నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. మొత్తంగా చూస్తే మన దేశం నుంచి అత్యధికంగా ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకుంటున్న దేశం అమెరికా. మన ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో ఏకంగా 11.5 శాతం ఒక్క అమెరికాకే వెళ్తున్నాయి. వాటి విలువ 5.7 బిలియన్ డాలర్లు.

ఆహార ఉత్పత్తుల్లో ఏదేశానికి ఎంత శాతం


అమెరికా	బంగ్లాదేశ్	చైనా	యూఏఈ	సౌదీ	వియత్నాం	ఇండోనేసియా
11.5	11.5	7.7	5.2	4.4	4.2	3.1

ఇతర దేశాలన్నీ కలిపి 52.7 శాతం

విదేశాల్లోని భారత ఎంబసీల్లో అగ్రిసెల్స్‌తో..

భారత వ్యవసాయ, దాని అనుబంధ రంగాల ఉత్పత్తుల ఎగుమతులను పెంచడానికి వీలుగా.. కేంద్రం వియత్నాం, అమెరికా, బంగ్లాదేశ్, నేపాల్, యూఏఈ, ఇరాన్, సౌదీ అరేబియా, మలేషియా, ఇండోనేసియా, సింగపూర్, చైనా, అర్జెంటీనాల్లోని భారత ఎంబసీల్లో అగ్రిసెల్స్‌ను ఏర్పాటు చేసింది. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు కృషి చేయడంతో పాటు వ్యాపార, పర్యాటక, సాంకేతిక, పెట్టుబడుల ప్రోత్సాహానికి ఈ విభాగాలు పనిచేస్తున్నాయి.

ఆహార ఉత్పత్తుల ఎగుమతుల విలువ (బిలియన్ డాలర్లలో)



రైతుల పరిస్థితి మారడం లేదు



రైతులు బంగారం తాకట్టు పెట్టి, అప్పులు చేసి వ్యవసాయ వృద్ధికి దోహదం చేస్తున్నారు. 2021–22లో బ్యాంకులు రూ.16 లక్షల కోట్లు రుణాలు ఇస్తాయని ఆర్థిక మంత్రి చెప్పారు. కానీ రూ.8 లక్షల కోట్లు మాత్రమే ఇచ్చారు. సేవలు, పారిశ్రామిక రంగాల్లో వేల పరిశ్రమలు మూతపడినా.. వ్యవసాయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచింది. దేశంలో 2022–23కు సంబంధించి వానాకాలంలో 11 కోట్ల ఎకరాల్లో వరి వేయాల్సి ఉంటే.. 10 కోట్ల ఎకరాల్లోనే వేశారు. ఆశించిన దిగుబడి రావట్లేదు అదే జరిగితే ఇబ్బందే. దేశవ్యాప్తంగా 2021–22లో 12,600 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా.. ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదు.

– సారంపల్లి మల్లారెడ్డి, అఖిల భారత కిసాన్ సభ జాతీయ నాయకుడు

ఎగుమతులున్నా.. గిట్టుబాటు ధర ఏది?



దేశం నుంచి ఆహార ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతున్నాయి. కానీ రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. రైతులు ధాన్యం అమ్మేశాక ఎగుమతుల నిర్ణయాలు తీసుకుంటున్నారు. తద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఎగుమతుల విధానం సరిగా లేదు. భారీ వర్షాల కారణంగా ఈసారి పంటల దిగుబడి తగ్గుతుంది. పత్తికి సంబంధించి కాటన్ అడ్వయిజరీ బోర్డు సమావేశంలో పత్తి ఉత్పత్తి, నిల్వ, ఎగుమతులను సమీక్షించేవారు. ఇప్పుడా అడ్వయిజరీ బోర్డు లేక సమస్య తలెత్తింది. పత్తిధర తగ్గిపోయింది.

– దొంతి నర్సింహారెడ్డి, జాతీయ వ్యవసాయరంగ నిపుణుడు



వైద్యశాఖ వార్షిక నివేదికను విడుదల చేస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో శ్రీనివాసరావు, ఇతర అధికారులు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 4.83 కోట్ల ఓపీ

- గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన రోగులు
- ఆయా ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్లు 16.97 లక్షలు
- వైద్య, ఆరోగ్యశాఖ వార్షిక నివేదిక–2022 వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవుట్ పేషెంట్ల (ఓపీ) సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెరగడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు బదులు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారని వైద్య, ఆరోగ్యశాఖ వార్షిక నివేదిక–2022 తెలిపింది. 2021లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ 4.23 కోట్లుగా నమోదవగా 2022లో అది 4.83 కోట్లకు పెరిగిందని వెల్లడించింది. అలాగే 2021లో ఇన్–పేషెంట్ (ఐపీ) సేవలు 14.16 లక్షలుగా ఉండగా 2022లో అవి 16.97 లక్షలకు పెరిగాయని పేర్కొంది. 2021లో 2.57 లక్షలు జరగ్గా 2022 నాటికి సర్జరీల సంఖ్య 3.04 లక్షలకు పెరిగిందని తెలిపింది.

నివేదికలోని ముఖ్యాంశాలు...

- 2022లో ఒకేసారి 8 వైద్య కాలేజీల ప్రారంభం. ఈ ఏడాది మరో 9 కాలేజీలు ప్రారంభించే పనులు. గతేడాది అదనంగా 200 పీజీ సీట్లు.
- ఎంబీబీఎస్ సీట్లలో లక్ష జనాభాకు 19 సీట్లతో దేశంలో మొదటి స్థానం... లక్ష జనాభాకు ఏడు పీజీ మెడికల్ సీట్లతో దేశంలో రెండో స్థానం.
- మాతృత్వ మరణాల రేటు 56 నుంచి 43కు (జాతీయ సగటు 97) తగ్గుదల.
- శిశుమరణాల రేటు జాతీయ స్థాయిలో 28 ఉండగా రాష్ట్రంలో 21.
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో 8,200 పడకలు అందుబాటులోకి తెచ్చేలా పనులు ప్రారంభం.
- గతేడాది 515 డయాలసిస్ పరికరాలతో 61 కొత్త డయాలసిస్ కేంద్రాలు మంజూరు. గతేడాది 50 లక్షలు దాటిన డయాలసిస్ సెషన్స్ సంఖ్య.
- కేసీఆర్ న్యూట్రిషన్ కిట్స్ మొదటి దశలో భాగంగా 9 జిల్లాల్లో పంపిణీ ప్రారంభం.
- కంటివెలుగు రెండో దశ ప్రారంభం.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో 33 శాతంగా ఉన్న ప్రసవాల రేటు ఇప్పుడు 61 శాతానికి పెరుగుదల.
- గతేడాది జరిగిన 5.40 లక్షల ప్రసవాల్లో 61 శాతం అంటే 3.27 లక్షల ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నిర్వహణ.
- ఇన్ఫెక్షన్ల నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు.
- రోగాలను ముందే గుర్తించి చికిత్స అందించేందుకు వీలుగా రాష్ట్రంలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ కార్యక్రమానికి శ్రీకారం. గతేడాది చివరి నాటికి 1.48 కోట్ల మందికి స్క్రీనింగ్ నిర్వహణ. బీపీ, షుగర్ రోగులకు కిట్లు అందజేత.
- కరోనా బూస్టర్ డోసు పంపిణీ 47 శాతం (జాతీయ సగటు 23 శాతం) పూర్తి.
- ఇప్పటివరకు 11 వేల కొత్త పడకలు అందుబాటులోకి వచ్చాయి. 27,500 పడకలకు ఆక్సిజన్ సరఫరాకు ఏర్పాటు.
- డైట్ చార్జీలు రూ. 40 నుంచి రూ. 80కి పెంపు.
- రోగి సహాయకుల కోసం 18 పెద్దాసుపత్రుల్లో రూ. 5కే భోజన పథకం ప్రారంభం.

రోగులను నిర్లక్ష్యం చేస్తే డిస్మిస్

▶ మొదటి పేజీ తరువాయి

లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో వైద్య, ఆరోగ్యశాఖకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 11,440 కోట్ల బడ్జెట్ కేటాయించిందని... ఈ కేటాయింపులతో తలసరి హెల్త్ బడ్జెట్‌లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామన్నారు. నీతి ఆయోగ్ ర్యాంకుల్లో దేశంలోనే తెలంగాణ మూడో స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. ప్రధాని మోదీ పేర్కొనే డబుల్ ఇంజన్ సర్కారున్న ఉత్తరప్రదేశ్ ఈ ర్యాంకుల్లో చివరి స్థానంలో నిలిచిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. అలాగే వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందంటూ కాంగ్రెస్ పార్టీ చార్జిషీట్ విడుదల చేయడాన్ని ఆయన హాస్యాస్పదంగా అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు చార్జిషీట్ పేరుతో హడావిడి చేశారని మండిపడ్డారు. వైద్య రంగంపై నీతి ఆయోగ్ విడుదల చేసిన సూచీలో కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలైన రాజస్తాన్ 16వ స్థానంలో, ఛత్తీస్‌గఢ్ 10వ స్థానంలో, హిమాచల్‌ప్రదేశ్ 7వ స్థానంలో నిలిచాయనే విషయాన్ని ఆ పార్టీ నేతలు మరిచిపోయినట్లున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 50 శాతం గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని... దీనివల్ల అక్కడక్కడా వారు అనారోగ్యం బారినపడుతున్నారని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

రాష్ట్రానికి ఎన్నో అవార్డులు...

దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలు చేస్తున్న మిడ్ వైఫరీ వ్యవస్థకు కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ నుంచి టాప్ పర్ఫార్మింగ్ స్టేట్ అవార్డు లభించిందని.. యునిసెఫ్ కూడా ఈ సేవలను ప్రశంసించిందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి సంరక్షించడంలో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని ఆయన వివరించారు. అలాగే తెలంగాణ డయాగ్నోస్టిక్ హైదరాబాద్ సెంట్రల్ హబ్‌కు ఎన్ఏబీఎల్ గుర్తింపు లభించిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 31 లక్షల మందికి టెలి కన్సల్టెన్సీ ద్వారా వైద్య సేవలు అందించినందుకు కేంద్రం రాష్ట్రానికి అవార్డు ఇచ్చిందని హరీశ్‌రావు చెప్పారు. పీహెచ్‌సీ, జిల్లా ఆసుపత్రి, యూపీహెచ్‌సీలకు నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ ప్రోగ్రాం కింద రాష్ట్రానికి మూడు కేంద్ర అవార్డులు లభించాయన్నారు. టీబీ నియంత్రణలో ప్రతిభ కనబర్చిన నిజామాబాద్, భద్రాచలం, ఖమ్మం జిల్లాలకు వరల్డ్ టీబీ డే సందర్భంగా కేంద్రం అవార్డులు ప్రకటించిందని గుర్తుచేశారు.

గతేడాది 2.59 లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలు..

ఈ ఏడాది మరిన్ని పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకున్నామని మంత్రి హరీశ్‌రావు వివరించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని భావిస్తున్నామన్నారు. ఈఎన్‌టీ, సరోజినీదేవి ఆసుపత్రులను మరింత పటిష్టం చేస్తామని, ఆహార కల్తీ నియంత్రణపై మరింతగా దృష్టి పెడతామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద గతేడాది 2.59 లక్షల మంది రోగులు లబ్ధి పొందారని, ఉద్యోగులు, జర్నలిస్టుల పథకంలో 43,702 మంది లబ్ధి పొందారని మంత్రి వివరించారు. గతంలో పరిమితి రూ. 2 లక్షలు ఉంటే దాన్ని రూ. 5 లక్షలకు పెంచామన్నారు. అలాగే అవయవ మార్పిడి వంటి శస్త్రచికిత్సల కోసం రూ. 10 లక్షల వరకు కూడా ఆరోగ్యశ్రీలో కవరేజీ కల్పిస్తున్నామన్నారు.

'దళితబంధు' ఇక బడ్జెట్ తర్వాతే!

లబ్ధిదారుల ఎంపికపై ఎటూ తేల్చని రాష్ట్ర ప్రభుత్వం

- ఎమ్మెల్యేల సిఫారసు ద్వారా ఎంపికను తప్పుబట్టిన హైకోర్టు
- దీంతో 2022–23లో ఇప్పటికీ మొదలు కాని ఎంపిక ప్రక్రియ
- ప్రభుత్వ మార్గదర్శకాల కోసం ఎదురు చూస్తున్న ఎస్సీ కార్పొరేషన్



సాక్షి, హైదరాబాద్: ప్రతీ నియోజకవర్గంలో 500 మంది 'దళితబంధు' లబ్ధిదారుల ఎంపికపై ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో భారీ మొత్తంలో నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ పథకం కింద నయాపైసా కూడా విడుదల చేయలేదు. లబ్ధిదారుల ఎంపికపై నెలకొన్న సందిగ్ధంతోనే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. దళితబంధు పథకం కింద లబ్ధిదారుల ఎంపికపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి విధివిధానాలను ప్రకటించలేదు. కేవలం ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వారినే అర్హులుగా నిర్ధారిస్తూ వారికి దళితబంధు సాయాన్ని అందిస్తూ వచ్చింది. అయితే ఎమ్మెల్యేల సిఫారసు వ్యవహారం అంతా పక్షపాతధోరణితో జరుగుతోందని పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఎమ్మెల్యేల సిఫారసుతో సంబంధం లేకుండా అర్హులను గుర్తించాలని హైకోర్టు గతంలో తీర్పునిచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించిన ఎస్సీ కార్పొరేషన్.. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తోంది. అయితే మరో రెండు నెలల్లో 2022–23 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. కానీ ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో ఈ పథకం అమలుపై అధికారవర్గాలు దిక్కులు చూస్తున్నాయి.

వచ్చే బడ్జెట్‌తో కలిపేలా.. : 2022–23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకానికి రూ.17,700 కోట్లు కేటాయించింది. ఇందులో ఒక్కో నియోజకవర్గానికి 1,500 యూనిట్ల చొప్పున నిధులు కేటాయించగా.. ఆమేరకు అమలుపై దృష్టిపెట్టింది. అయితే ఒకేసారి 1,500 మంది ఎంపిక బదులుగా తొలివిడతలో ఒక్కో నియోజకవర్గం నుంచి 500 చొప్పున లబ్ధిదారుల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఇంతలోనే లబ్ధిదారుల ఎంపిక విధానంపై హైకోర్టు ఆక్షేపణ చెప్పడంతో అధికారులు ఎంపిక ప్రక్రియను నిలిపివేశారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన తర్వాతే ఎంపిక మొదలు పెట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్, ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తోంది. కాగా, మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా.. ఇప్పటికిప్పుడు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ దరఖాస్తుల స్వీకరణ, అర్హుల నిర్ధారణ కష్టమని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత నిధులను వచ్చే బడ్జెట్‌కు క్యారీఫార్వర్డ్ చేస్తే బాగుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈమేరకు 2023–24 వార్షిక బడ్జెట్‌లో ప్రస్తుత ఏడాది దళితబంధు నిధులను కలిపి ప్రతిపాదనలు తయారు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. సోమవారం ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో జరగనున్న సమావేశంలో ఈ అంశాన్ని పరిశీలించాల్సిందిగా కోరాలని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులు భావిస్తున్నారు.

గోరటి వెంకన్నకు వేటూరి కవితా పురస్కారం



వేటూరి కవితా పురస్కారం అందుకుంటున్న గోరటి వెంకన్న

తుని రూరల్: వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా అందిస్తున్న 12వ వేటూరి కవితా పురస్కారం ప్రఖ్యాత కవి, గాయకుడు పద్మశ్రీ గోరటి వెంకన్నకు లభించింది. సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతి సందర్భంగా ఏపీలోని కాకినాడ జిల్లా తుని చిట్టూరి మెట్రోలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో వేటూరి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేటూరి కవితా పురస్కారాన్ని గోరటి వెంకన్నకు ప్రదానం చేసి, ఘనంగా సన్మానించారు. వేర్వేరు రచయితలు రచించిన 150 పుస్తకాలను బహూకరించారు. అన్ని వర్గాలనూ ఆకట్టుకునే విధంగా వేటూరి సుందరరామ్మూర్తి గీత రచనలు సాగాయని గోరటి వెంకన్న అన్నారు. రచయిత కలగా రామజోగేశ్వరశర్మ రచించిన 'కదంబం'కవితా సంపుటి పుస్తకాన్ని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్ ఆవిష్కరించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, కవి బులుసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో తప్పిన ప్రమాదం

- బ్రేకులు పడక రక్షణ గోడను ఢీకొన్న ఆర్టీసీ అద్దె బస్సు
- 30 మంది ప్రయాణికులు సురక్షితం

దోమలపెంట (అచ్చంపేట): శ్రీశైలం నుంచి మహబూబ్‌నగర్ బయల్దేరిన ఆర్టీసీ అద్దె బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలివి.. శ్రీశైలంలో ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు 30 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు.. కర్నూలు పరిధిలోని శ్రీశైలం కుడిగట్టు ప్రాంతంలో మలుపు వద్ద అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొట్టింది. దీంతో రక్షణ గోడ రాళ్లు కూలిపోగా.. ఇనుప రాడ్ల కంచె వల్ల బస్సు ఆగిపోయింది. భీతిల్లిన ప్రయాణికులు వెంటనే బస్సులో నుంచి కిందకు దిగిపోయారు. బస్సు ఏమాత్రం ముందుకెళ్లినా వంద అడుగుల లోతు ఉన్న లోయలోకి పడేదని ప్రయాణికులు తెలిపారు. బ్రేక్ పడకపోవడం వల్లే బస్సు ముందుకు దూసుకెళ్లినట్లు తెలిసింది. అనంతరం అదే బస్సులో ప్రయాణికులంతా తిరిగి మహబూబ్‌నగర్‌కు బయలుదేరారు.



శ్రీశైలం ఆనకట్ట కుడిగట్టు వద్ద ఘాట్‌రోడ్డులో రక్షణ గోడను ఢీకొట్టిన బస్సు

క్లుప్తంగా...

మార్చి 1 నుంచి హెచ్1బీ వీసా దరఖాస్తుల స్వీకరణ

వాషింగ్టన్: భారతీయ ఐటీ నిపుణులకు శుభవార్త. 2023–24 సంవత్సరానికి గాను మార్చి ఒకటో తేదీ నుంచి హెచ్1బీ వీసాలకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అమెరికా ఇమిగ్రేషన్ విభాగం ఆదివారం తెలిపింది. మార్చి 17వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం ఉంటుందని, మార్చి 31కల్లా వీసా హోల్డర్ల పేర్లను ప్రకటిస్తామని పేర్కొంది. అమెరికా కంపెనీల్లో పనిచేసే విదేశీ సాంకేతిక నిపుణులకు ఇచ్చే నాన్–ఇమిగ్రాంట్ వీసా హెచ్1బీ. ఏడాదికి 85 వేల వరకు హెచ్1బీ వీసాలను మంజూరు చేస్తుంటారు. ఇందులో అత్యధికంగా లాభపడేది భారత్, చైనా దేశస్తులే. టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి రంగాలకు చెందిన ఈ వీసా దారులు ఆరేళ్ల వరకు అమెరికాలో ఉండి పని చేసుకునేందుకు వీలుంటుంది. ఆరేళ్ల తర్వాత శాశ్వత నివాసం లేదా గ్రీన్‌కార్డుకు అర్హులవుతారు.

సహచర మంత్రి జహావిపై సునాక్ వేటు



లండన్: పన్నుల వివాదంలో చిక్కుకున్న అధికార కన్జర్వేటివ్ పార్టీ చైర్మన్, సహచర కేబినెట్ మంత్రి నదీమ్ జహావిని బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ మంత్రి మండలి నుంచి తొలగించారు. జహావి పన్ను వ్యవహారాల్లో మంత్రులకుండే నియమనిబంధనల్ని ఉల్లంఘించారంటూ విచారణలో తేలడంతో సునాక్ ఆయనపై వేటు వేశారు. ప్రస్తుతం జహావి శాఖ లేని మంత్రిగా కేబినెట్‌లో ఉన్నారు. ప్రభుత్వం నియమించిన స్వతంత్ర విచారణ నివేదికను కూడా సునాక్ విడుదల చేశారు. ఇరాక్‌లో జన్మించిన జహావి ఆర్థిక మంత్రిగా ఉండగా అంతకు ముందు కట్టని పన్నులకు పెనాల్టీగా 50 లక్షల పౌండ్లు చెల్లించారు. ఈ విషయాన్ని దాయడం మినిస్టీరియల్ కోడ్‌ను ఉల్లంఘించడమేనని విచారణ నివేదిక తేల్చి చెప్పింది.

దేశంలో ఉన్నత విద్యావంతులు 4 కోట్ల మంది పై చిలుకే

ఎక్కువ కాలేజీలున్న 8 రాష్ట్రాల్లో ఏపీ
జిల్లాల్లో హైదరాబాద్, రంగారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్నత విద్యావంతులు నాలుగు కోట్లకు పైనే ఉన్నట్టు కేంద్ర విద్యా శాఖ వెల్లడించింది. ఉన్నత విద్యపై ఆలిండియా సర్వేను కేంద్ర విద్యా శాఖ ఆదివారం విడుదల చేసింది. ఎక్కువ కాలేజీలున్న ఎనిమిది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు స్థానం దక్కింది. అలాగే ఎక్కువ కాలేజీలున్న జిల్లాల జాబితాలో హైదరాబాద్, రంగారెడ్డి స్థానం దక్కించుకున్నాయి.



మరో నక్షత్ర మండలం!

అంతరిక్షంలో సైంటిస్టులు తాజాగా గుర్తించిన ఓ మిస్టరీ వలయమిది. ఇది బహుశా మరో నక్షత్ర మండలం కావచ్చని భావిస్తున్నారు. ఇది హవాయిలోని సుబారు స్టార్ అబ్జర్వేటరీ కెమెరా కంటికి చిక్కింది.

జేమ్స్ వెబ్‌కు సాంకేతిక సమస్య





వాషింగ్టన్: ప్రపంచంలోకెల్లా అత్యంత శక్తిమంతమైన అబ్జర్వేటరీ అయిన జేమ్స్ వెబ్‌లో మళ్లీ సాంకేతిక సమస్యలు తలెత్తాయి. భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో అంతరిక్ష రహస్యాలను ఒక్కొక్కటిగా ఛేదిస్తున్న జేమ్స్ వెబ్‌లో ఇలాంటి సమస్య రావడం ఇది రెండోసారి. అందులోని అత్యంత కీలకమైన నియర్ ఇన్‌ఫ్రా రెడ్ ఇమేజర్, స్లిట్‌లెస్ స్పెక్ట్రోగ్రాఫ్ పరికరాల్లో సమాచార అంతరాయం నెలకొంది. దాంతో సంబంధిత సాఫ్ట్‌వేర్ మొరాయించింది. అయితే హార్డ్‌వేర్‌లో ఎలాంటి సమస్యలూ తలెత్తిన సూచనలు లేకపోవడం ఊరటనిచ్చే విషయమని నాసా పేర్కొంది. ఇన్‌ఫ్రారెడ్ ఇమేజర్ మాత్రం ప్రస్తుతానికి పని చేయడం లేదని ధ్రువీకరించింది. సమస్యను కనిపెట్టి సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపింది. ఏకంగా వెయ్యి కోట్ల డాలర్ల ఖర్చుతో తయారు చేసిన జేమ్స్ వెబ్ గత ఆగస్టులో కూడా ఇలాగే మొరాయించింది. దాని మిడ్ ఇన్‌ఫ్రారెడ్ ఇన్‌స్ట్రుమెంట్‌లోనూ సాంకేతిక సమస్య తలెత్తింది. బహుశా ఊహించిన దానికంటే పరిమాణంలో పెద్దవైన అంతరిక్ష పదార్థాలు కెమెరా లెన్స్‌ను గుద్దుకోవడమే రెండోసార్లూ సమస్యకు కారణమైందని నాసా భావిస్తోంది.

త్రిపురలో ప్రత్యేక సెగలు

అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతమేరకు ప్రభావం



త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ గ్రేటర్ టిప్రాల్యాండ్ ప్రత్యేక రాష్ట్రం ఉద్యమం వేడెక్కుతోంది. ఒకప్పుడు త్రిపురని ఏలిన మాణిక్య వంశానికి చెందిన ప్రద్యోత్ మాణిక్య డెబ్బార్మాన్‌కు చెందిన టిప్రా మోతా పార్టీ ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తోంది. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ చేస్తున్న సంస్థలన్నీ కలిసి టిప్రా ఇండీజెనస్ ప్రోగ్రెసివ్ రీజనల్ అలయెన్స్ (టిప్రా మోతా)గా ఏకతాటిపైకి వచ్చారు. ఇన్నాళ్లూ సామాజిక సంస్థగా ఉన్న ఈ కూటమి, రాజకీయ పార్టీగా రూపాంతరం చెందింది. అధికారంలోకి వస్తే ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తామని లిఖితపూర్వక హామీ ఇచ్చిన వారితోనే తాము పొత్తు పెట్టుకుంటామని ప్రద్యోత్ తేల్చి చెబుతూ అధికార బీజేపీకి సవాల్ విసురుతున్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతున్న గిరిజనులు, స్థానిక తెగల్లో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకి మద్దతుగా ఉంటూ గత రెండేళ్లలోనే ఢిల్లీ వేదికగా ప్రద్యోత్ ఎన్నో ధర్నాలు, ఉద్యమాలు చేశారు. గత వారంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అమిత్ షాతో ప్రద్యోత్ నేతృత్వంలోని టిప్రా మోతా ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్లి చేసిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ప్రద్యోత్ తాము ఒంటరి పోరాటానికి సిద్ధమై 35 నుంచి 40 సీట్లలో పోటీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ సారి ఎన్నికల్లో ప్రత్యేక రాష్ట్రం అంశం అత్యంత ప్రభావం చూపించబోతోంది.

ఏమిటీ గ్రేటర్ టిప్రాల్యాండ్?

1949లో త్రిపురభారత దేశంలో విలీనం అవడానికి అంగీకరించింది. అప్పటికే తూర్పు బంగ్లాదేశ్ నుంచి త్రిపురలోకి భారీగా బెంగాలీల తాకిడి మొదలైంది. 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం జరిగిన యుద్ధం సమయంలో కూడా బెంగాలీ శరణార్థులు భారీగా వచ్చి చేరారు. ఫలితంగా స్థానికంగా నివసించే గిరిజనులు మైనార్టీలో పడిపోయారు. 1881లో 63.77శాతం ఉండే గిరిజనుల జనాభా 2011 నాటికి 31.80శాతానికి పడిపోయింది. 2011 నాటి భాషాపరమైన జనాభా లెక్కల ప్రకారం త్రిపుర మొత్తం జనాభా 36.74 లక్షలైతే, వారిలో బెంగాలీ మాతృభాష కలిగిన వారి సంఖ్య ఏకంగా 24.14 లక్షలు. స్థానిక ఆదివాసీల మాతృభాష కొక్‌బొరాక్ మాట్లాడేవారు 8.87 లక్షల మంది మాత్రమే ఉన్నారు. అంటే బయట నుంచి వలస వచ్చిన బెంగాలీలే వీరి కంటే మూడు రెట్లు ఎక్కువ. దాంతో స్థానికంగా ఉండేవారి హక్కులు, సంస్కృతి సంప్రదాయాలు, భూమిపై హక్కులు ప్రమాదంలో పడ్డాయి. దాంతో ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ పుట్టింది.

ఎప్పట్నుంచి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్?

2000 సంవత్సరంలో ఏర్పాటైన ఇండిజెనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) పార్టీ తొలిసారిగా ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌పై గళమెత్తింది. రెండేళ్ల తర్వాత ఐపీఎఫ్‌టీ గిరిజనుల మరో పార్టీ త్రిపుర ఉపజాతి జ్యూబా సమితి(టీయూజేఎస్)లో విలీనమై నేషనలిస్ట్ పార్టీ ఆఫ్ ట్విప్రా (ఐఎన్‌పీటీ)గా ఆవిర్భవించింది. వేర్పాటు వాద నాయకుడు బిజోయ్ కుమార్ హరంగ్‌ఖ్వల్ నేతృత్వం వహించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం పెద్దగా ముందుకు వెళ్లకపోవడంతో 2009లో ఎన్‌సీ డెబ్రామా ఆధ్వర్యంలో మళ్లీ ఐపీఎఫ్‌టీను పునరుద్ధరించారు.

ఎన్నికల్లో ప్రభావం ఎంత?

మొత్తం 60 శాసనసభ స్థానాలున్న రాష్ట్రంలో ప్రత్యేక రాష్ట్రం ఆశిస్తున్న ఆదివాసీలు 20 నియోజకవర్గాల్లో ప్రభావం చూపించగలరు. ఇప్పటివరకు ఐపీఎఫ్‌టీయే ఈ నియోజకవర్గాల్లో అత్యంత కీలకంగా ఉంది. త్రిపురలో అద్భుతమైన ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకుని రెండు దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని ఏలిన మాణిక్ సర్కార్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వివిధ స్థానిక పార్టీలతో జత కలిసింది. దీంతో ఈ ప్రాంతంలోని 20 స్థానాలకు గాను బీజేపీ 10సీట్లు, ఐపీటీఎఫ్ 8 ,, సీపీఐ(ఎం) రెండు స్థానాల్లోనూ గెలుపొందింది. మాణిక్ సర్కార్ ఓటమికి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను నిర్లక్ష్యం చేయడం కూడా ఒక కారణంగా మారింది. ఎన్నికలకు ముందు ప్రత్యేక రాష్ట్రం కోసం విస్తృతంగా ప్రచారం చేసిన ఐపీటీఎఫ్ ఎన్నికల తర్వాత అధికార బీజేపీలో చేరింది. ఆ పార్టీ నాయకుడు ఎన్‌సీ డెబర్మా మంత్రిగా కూడా పని చేసి 2022 జనవరి 1న కన్నుమూశారు. గిరిజన హక్కుల మండలి (టీటీఏఏడీసీ)కి 2021 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టిప్రా మోతా పార్టీ 28 స్థానాల్లో పోటీ చేస్తే 18 నెగ్గింది. ప్రస్తుత అసెంబ్లీలో 36 స్థానాలతో ఉన్న అధికార బీజేపీ, 16 స్థానాలతో ప్రతిపక్ష పార్టీగా ఉన్న సీపీఐ(ఎం) ఉంటే, ఐపీటీఎఫ్ ఎనిమిది స్థానాలను నెగ్గింది. టిప్రా మోతా ఒంటరిపోరాటానికి సిద్ధమై అధికార బీజేపీకి వణుకు పుట్టిస్తున్నారు.

ఏయే ప్రాంతాలతో ప్రత్యేక రాష్ట్రం

త్రిపురలో గిరిజనులు అధికంగా ఉన్న ప్రాంతాలన్నింటితో 1985లో త్రిపుర ట్రైబల్ ఏరియాస్ అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ (టీటీఏఏడీసీ) ఏర్పాటైంది. రాష్ట్ర వైశాల్యంలో మూడింట రెండువంతుల్లో విస్తరించింది. గిరిజన తెగల హక్కులు, సంస్కృతి కాపాడడం కోసం ఏర్పాటైన టీటీఏడీసీకి శాసన, కార్య నిర్వాహక అధికారాలున్నాయి. టీటీఏఏడీసీ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రం చేయాలన్న డిమాండ్ ఉంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

పాక్‌లో పెట్రో ధరల మంట... లీటర్‌కు ఏకంగా రూ.35 పెంపు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో మరోసారి పెట్రో ధరల మోత మోగింది. లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలపై రూ.35 రూపాయలు పెంచుతున్నట్టుగా పాకిస్తాన్ ఆర్థిక శాఖ మంత్రి ఇషక్ దార్ ప్రకటించారు. పెట్రో ధరలు పెంచుతున్నట్టుగా ఉదయం 10:50 గంటలకు ప్రకటించిన మంత్రి మరో పది నిముషాల్లో అంటే 11 గంటల నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని చెప్పడంతో ప్రజలు అవాక్కయ్యారు. ఇక కిరోసిన్, లైట్ డీజిల్ ధరల్ని లీటర్‌కి రూ.18 పెంచారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రో ఉత్పత్తుల ధరలు 11శాతం పెరగడం, పాకిస్తాన్ రూపాయి మారకం విలువ పడిపోవడంతో వీటి ధరలు పెంచకతప్పడం లేదని ఇషక్ చెప్పారు. గత నాలుగు నెలలుగా పెట్రోల్, డీజిల్ పెంచని విషయాన్ని గుర్తు చేశారు.

పెట్రో ధరలు ఇలా (లీటర్‌కి)	
పెట్రోల్	రూ.249.80
హై స్పీడ్ డీజిల్	రూ.262.80
కిరోసిన్	రూ.189.83
లైట్ డీజిల్ ఆయిల్	రూ.187

పాక్‌లో పడవ మునక.. 17 మంది విద్యార్థులు మృతి

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. కొహట్ జిల్లాలోని మిర్బాష్ ఖేల్ మదర్సాకు చెందిన 30 మంది విద్యార్థులు తాండా రిజర్వాయర్ సందర్శనకు వెళ్లారు. వారున్న పడవ ప్రమాదవశాత్తు మునిగిపోయింది. ఘటనలో 17 మంది చనిపోగా మరో 13 మంది గాయపడ్డారు. వీరంతా 7–14 ఏళ్లలోపు వారే. సహాయక చర్యల్లో పాల్గొన్న ఆర్మీ రెస్క్యూ బృందాలు మొత్తం 17 మృతదేహాలను వెలికి తీసినట్లు అధికారులు చెప్పారు.

ఒడిశాలో ఘోరం.. మంత్రిని కాల్చేసిన ఏఎస్సై



మంత్రి నవ కిశోర్ దాస్



ఏఎస్సై గోపాల్ దాస్

భువనేశ్వర్: ఒడిశాలో ఘోరం జరిగింది. పోలీసు అధికారి ఒకరు జరిపిన కాల్పుల్లో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రి నవ కిశోర్ దాస్ (60) చనిపోయారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు విశ్వాసపాత్రుడిగా పేరున్న దాస్ ఆదివారం ఝార్సుగూడ జిల్లా బజరంగ్‌నగర్‌లో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గాంధీచౌక్ వద్ద కారు దిగుతుండగా అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై) గోపాల్ దాస్ తన తుపాకీతో మంత్రిపై రెండు రౌండ్ల కాల్పులకు తెగబడ్డాడు. తూటాలు ఛాతీలోకి దూసుకెళ్లాయి. తీవ్ర రక్తస్రావంతో స్పృహతప్పిన దాస్‌ను వెంటనే జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి హుటాహుటిన ఎయిర్ అంబులెన్స్‌లో భువనేశ్వర్ అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆయన తదిశ్వాస విడిచారు. గుండె, ఊపిరితిత్తులు దెబ్బ తిని తీవ్ర అంతర్గత రక్తస్రావం జరిగిందని ఆస్పత్రి తెలిపింది. ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం పట్నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.దీనిపై దర్యాప్తునకు సీఎం ఆదేశించారు. ఏఎస్సైని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అతన్ని ప్రశ్నిస్తున్నామని, కారణాలు త్వరలోనే తెలుస్తాయని ఉన్నతాధికారులు చెప్పారు. కిశోర్‌దాస్‌కు ఝార్సుగూడ మైనింగ్ ప్రాంతంలో మంచి పట్టుంది. మైనింగ్, రవాణా, హాస్పిటాలిటీ రంగాల్లో వ్యాపారాలున్నాయి. సీఎం తర్వాత అత్యంత ధనికుడు ఆయనేనని చెబుతుంటారు. 2019 ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్ నుంచి బీజేడీలోకి మారారు.

నా భర్తకు మతిస్థిమితం లేదు

ఏఎస్సై గోపాల్ దాస్ 8 ఏళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నట్టు భార్య జయంతి మీడియాకు చెప్పారు. ''సాధారణ స్థితికి చేరుకున్నట్లే భావించాం. ఇంతలోనే ఇలా జరిగిందంటున్నారు. మంత్రితో నా భర్తకు ఎటువంటి శత్రుత్వమూ లేదు. విచారణలోనే వాస్తవమేంటో తెలుస్తుంది'' అన్నారు.

నేటితో ముగియనున్న జోడో యాత్ర

- శ్రీనగర్‌లో త్రివర్ణపతాకాన్ని ఎగురవేసిన రాహుల్ గాంధీ
- ముగింపు సభకు 23 ప్రతిపక్ష పార్టీలు



శ్రీనగర్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సోమవారం జమ్మూ కశ్మీర్‌లో ముగియనుది. ఈ సందర్భంగా శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ క్లాక్ టవర్ వద్ద అత్యంత కటుదిట్టమైన భద్రత నడుమ ఆయన ఆదివారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 1948లో ఇక్కడే జాతీయ పతాకాన్ని ఎగరేయడం విశేషం. రాహుల్ మాట్లాడుతూ దేశ ప్రజలకు తానిచ్చిన హామీని నెరవేర్చుకున్నానని చెప్పారు. సెప్టెంబర్ 7న మొదలైన రాహుల్ భారత్ జోడో యాత్ర 12 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, 75 జిల్లాల మీదుగా 4 వేల కిలోమీటర్లను పూర్తి చేసుకుంది. మతసామరస్యమే ప్రధాన ఎజెండా సాగిన ఈ యాత్ర విజయవంతం కావడంతో రాహుల్ ఉల్లాసంగా కనిపించారు. సోమవారం ర్యాలీతో యాత్ర ముగుస్తుంది. ఈ సందర్భంగా శ్రీనగర్‌లోని ఎస్‌కే స్టేడియంలో జరిగే భారీ బహిరంగ సభకు 23 ప్రతిపక్ష పార్టీలను కాంగ్రెస్ ఆహ్వానించింది.

బీజేపీపై పోరుకు విపక్షాలు ఏకం

విపక్షాల మధ్య విభేదాలున్నా, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై పోరులో అవి ఐక్యంగా ఉంటాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. జోడో యాత్రలో పాల్గొనబోమని టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ చెప్పడంపై ఆయన స్పందించారు. జోడో యాత్ర దక్షిణం నుంచి ఉత్తర భారతానికి చేరినప్పటికీ ఫలితం మాత్రం దేశమంతటా ఉందన్నారు. బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్‌ల విద్వేషం, అహంకారంల స్థానంలో తమ యాత్ర దేశానికి సోదరభావమనే ప్రత్యామ్నాయాన్ని చూపిందని అన్నారు.

లోయలో పడిన బస్సు... పాక్‌లో 42 మంది సజీవ దహనం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 42 మంది సజీవదహనమయ్యారు. బలూచిస్తాన్ రాజధాని క్వెట్టా నుంచి సింధు ప్రావిన్స్ రాజధాని కరాచీకి 48 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు లాస్‌బెలా వద్ద ప్రమాదానికి గురైంది. వేగంగా వెళ్తున్న ఈ బస్సు మలుపులో పిల్లర్‌ను ఢీకొట్టి, లోయలో పడిపోయిందని పోలీసులు తెలిపారు. అనంతరం బస్సులో మంటలు చెలరేగి 42 మంది ప్రయాణికులు గుర్తు పట్టడానికి వీలు లేనంతగా మసయ్యారు. ఈ ఘటనలో ఒక చిన్నారి, మహిళ సహా ముగ్గురు మాత్రమే క్షేమంగా బయటపడ్డారు. మిగతా ముగ్గురు క్షతగాత్రుల పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు చెప్పారు.

2025లో అమెరికా, చైనా యుద్ధం!

అమెరికా ఆర్మీ జనరల్ అంచనాలు

వాషింగ్టన్: 2025లో చైనాతో యుద్ధం తప్పకపోవచ్చని అమెరికా ఎయిర్ మొబిలిటీ కమాండ్ చీఫ్ జనరల్ మైక్ మినహాన్ అంచనా వేశారు. 2024లో అమెరికాతోపాటు తైవాన్‌లో ఎన్నికలు జరగాల్సి ఉన్నందున, ఆ అవకాశంగా తీసుకుని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తైవాన్‌పై దాడికి పాల్పడవచ్చన్నారు. అందుకే, ఏఎంసీ సిబ్బంది గురి తప్పకుండా కాల్పులు జరిపేలా కఠోర శిక్షణకు సిద్ధం కావాలని, రికార్డులను అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన కమాండర్లకు పంపిన మెమో మీడియాకు అందింది. చైనాపై పోరాడి గెలిచేందుకు సమీకృత, పటిష్ట బృందాలను సిద్ధం చేయాలని నిర్దేశించారు. ఎయిర్ మొబిలిటీ కమాండ్(ఏఎంసీ) కింద 50 వేల మంది ఆర్మీ సిబ్బంది, 500 విమానాలు ఉన్నాయి. రవాణా, ఇంధన అవసరాలు తీర్చడం ఈ విభాగం ప్రధాన బాధ్యతలు. తైవాన్ చైనాలో అంతర్భాగం, ఎప్పటికైనా కలిపేసుకుంటామంటూ డ్రాగన్ దేశం చెబుతోంది. ఈ అంశంపై చైనా, అమెరికాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

చేష్టలుడిగిన భద్రతా మండలి: కొరోసీ

ఐరాస: అత్యంత శక్తిమంతమైన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి పూర్తిగా చేష్టలుడిగిందని ఐరాస సర్వప్రతినిధి సభ అధ్యక్షుడు సబా కొరోసీ వాపోయారు. వర్తమాన కాలపు వాస్తవాలను అది ఎంతమాత్రమూ ప్రతిబింబించడం లేదంటూ ఆవేదన వెలిబుచ్చారు. ''యుద్ధాలను నివారించి అంతర్జాతీయ శాంతిభద్రతలను పరిరక్షించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మండలి ఆ బాధ్యతల నిర్వహణలో విఫలమవుతోంది. దానికి కారణమూ సుస్పష్టం. దాని శాశ్వత సభ్య దేశాల్లోనే ఒకటి పొరుగు దేశంపై దురాక్రమణకు పాల్పడి ప్రపంచాన్ని తీవ్ర ప్రమాదంలోకి, సంక్షోభంలోకి నెట్టింది. ఈ దుందుడుకుతనానికి గాను రష్యాపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన భద్రతా మండలి శాశ్వత సభ్య దేశాల వీటో పవర్ కారణంగా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడింది. అందుకే మండలిని సంస్కరించాల్సిన అవసరం చాలా ఉంది. మండలి కూర్పు రెండో ప్రపంచ యుద్ధానంతరపు అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో జరిగింది. దాన్నిప్పుడు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవాలి'' అని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సంస్థల పనితీరు ఎలా ఉండాలనే విషయంలో రష్యా దురాక్రమణ పెద్ద గుణపాఠంగా నిలిచిందన్నారు. భారత పర్యటనకు వచ్చిన కొరోసీ పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు.

చార్లెస్ పట్టాభిషేకానికి హ్యారీ హాజరయ్యేనా?

లండన్: మే నెలలో అంగరంగ వైభవంగా జరిగే తన పట్టాభిషేకానికి చిన్న కొడుకు ప్రిన్స్ హ్యారీ, కోడలు మేఘన్ మార్కెల్ రావాలని రాజు చార్లెస్–2 కోరుకుంటున్నారు. 'స్పేర్' ఆత్మకథతో రాజకుటుంబంలో లుకలుకలను, అన్న ప్రిన్స్ విలియంతో విభేదాలు, తన భార్యకు ఎదురైన చేదు అనుభవాలను హ్యారీ బయటపెట్టడం తెలిసిందే. దీంతో తమ్ముడిపై విలియం గుర్రుగా ఉన్నట్లు, పట్టాభిషేకానికి పిలవొద్దని తండ్రితో చెప్పినట్లు డెయిల్ మెయిల్ పేర్కొంది. కానీ వారిద్దరూ రాకుంటే మీడియాలో మరిన్ని పుకార్లకు ఆస్కారమిచ్చినట్లవుతుందని చార్లెస్ భావిస్తున్నట్లు తెలిపింది. వారిని ఎలాగైనా రప్పించాలని పట్టాభిషేకం కార్యక్రమానికి సారథ్యం వహించే ఆర్చిబిషప్ ఆఫ్ కాంటర్‌బరీ జస్టిన్ వెల్బీని కోరినట్లు తెలిపింది.

వారి జీవితాలు స్ఫూర్తిదాయకం

- పద్మ పురస్కార గ్రహీతల గురించి మరింతగా అందరూ తెలుసుకోవాలి
- ఈ ఏడాది అవార్డులు పీపుల్స్ పద్మ
- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ



ఢిల్లీలోని విజయ్ చౌక్‌లో బీటింగ్ రీట్రీట్ కార్యక్రమం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న ప్రధాని మోదీ, మంత్రులు

న్యూఢిల్లీ: ఈ ఏడాది పద్మ అవార్డులకు ఎంపికై న వారి జీవితాలు, వారు సాధించిన ఘనత గురించి ప్రజలందరూ తెలుసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 2023 పద్మ అవార్డుల్ని పీపుల్స్ పద్మగా అభివర్ణించారు. సామాన్యుల్లో అసామాన్యులుగా ఎదిగిన వారిని గుర్తించి గౌరవిస్తున్నట్టు చెప్పారు. కొత్త ఏడాదిలో తొలిసారిగా ప్రధాని ఆదివారం ఆకాశవాణి మన్‌కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడారు. గిరిజనులు, వారి అభ్యున్నతికి కృషి చేసిన వారినే అత్యధికంగా పద్మ అవార్డులతో సత్కరిస్తున్నట్టు వెల్లడించారు. '' పద్మ పురస్కారాలు పొందినవారి జీవితాలు ఎంతో స్ఫూర్తిదాయకమైనవి. గిరిజన భాషలైన టోటో, హో, కూయి వంటి వాటిపై అవిరళ కృషి చేసిన వారు, ఆదివాసీల సంగీత పరికరాలు వాయించడంలో నిష్ణాతులకి ఈ సారి పద్మ పురస్కారాలు వరించాయి.. నగర జీవితాలకి , ఆదివాసీ జీవితాలకు ఎంతో భేదం ఉంటుంది. నిత్య జీవితంలో ఎన్నో సవాళ్లుంటాయన్నారు. అయినప్పటికీ తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడానికి గిరిజనులు ఎంతో పోరాటం చేస్తుంటారు'' అని ప్రధాని కొనియాడారు.

పెరుగుతున్న దేశీయ పేటెంట్ ఫైలింగ్స్

ఈ దశాబ్దం సాంకేతిక రంగంలో దేశీయ టెక్నాలజీస్ వాడకం పెరిగి ''టెకేడ్''గా మారాలన్న భారత్ కలను ఆవిష్కర్తలు, వాటికి వచ్చే పేటెంట్ హక్కులు నెరవేరుస్తాయని ప్రధాని మోదీ అన్నారు. విదేశాలతో పోల్చి చూస్తే దేశీయంగా పేటెంట్ ఫైలింగ్స్ బాగా పెరిగాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పేటెంట్ ఫైలింగ్‌లో భారత్ ఏడో స్థానంలో ఉంటే ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్లలో అయిదో స్థానంలో ఉందని ప్రధాని వెల్లడించారు. గత అయిదేళ్లలో భారత్ పేటెంట్ రిజిస్ట్రేషన్లు 50శాతం పెరిగాయని, ప్రపంచ ఆవిష్కరణల సూచిలో మన స్థానం 40కి ఎగబాకిందన్నారు. 2015 నాటికి 80 కంటే తక్కువ స్థానంలో ఉండేదని గుర్తు చేశారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ 2022లో 145 పేటెంట్‌లను దాఖలు చేసి రికార్డు సృష్టిస్తుందన్నారు. భారత్ ''టెకేడ్''కలని ఆవిష్కర్తలే నెరవేరుస్తారని ప్రధాని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.

మన్‌కీ బాత్‌లో తెలుగువారి ప్రస్తావన

మన్‌కీబాత్‌లో ఇద్దరు తెలుగు వారి గురించి మోదీ ప్రస్తావించారు. మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నడిపే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కె.వి.రామసుబ్బారెడ్డి, తెలంగాణకు చెందిన ఇంజనీర్ విజయ్ గురించి మాట్లాడారు. ''నంద్యాల జిల్లాకు చెందిన కె.వి.రామసుబ్బారెడ్డి చిరు ధాన్యాలు పండించడం కోసం మంచి జీతం వచ్చే ఉద్యోగం మానేశారు. తల్లి చేసే చిరు ధాన్యాల వంటకం రుచి చూసి గ్రామంలో ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించారు వాటి ప్రయోజనాలను అందరికీ వివరిస్తున్నారు'' అని కొనియాడారు. నమో యాప్‌లో ఇ–వేస్ట్ గురించి రాసిన తెలంగాణకు చెందిన ఇంజనీర్ విజయ్ గురించి ప్రస్తావించిన ప్రధాని మొబైల్, ల్యాప్‌టాప్, టాబ్లెట్‌లు నిరుపయోగమైనప్పుడు ఎలా పారేయాలో వివరించారు.

మధ్య తరగతికి చేరువ కండి

పథకాలను ప్రచారం చేయండి మంత్రులకు మోదీ దిశానిర్దేశం

మధ్య తరగతికి మరింత చేరువ కావాలని కేంద్ర మంత్రులకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. వారికి లబ్ధి చేకూర్చిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి మరింత వివరంగా తెలియజేయాలన్నారు. ఆదివారం ఇక్కడ మోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. బుధవారం సమర్పించబోయే కేంద్ర బడ్జెట్ గురించి చర్చ జరిగింది. ప్రభుత్వ పథకాలు పేద, అణగారిన వర్గాలకు ఎనలేని లబ్ధి చేకూర్చడంతో పాటు మధ్యతరగతి ప్రజల జీవితాన్ని ఎంతో సుఖమయం చేశాయని మోదీ అన్నారు. ఈ విషయాలన్నింటినీ వారికి అర్థమయ్యేలా చెప్పాల్సిందిగా మంత్రులకు దిశానిర్దేశం చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... స్వాతంత్య్ర అమృతోత్సవ వేళ బ్రిటిష్ వలస పాలనకు సంబంధించిన చిహ్నాలన్నింటినీ ఒక్కొక్కటిగా తప్పిస్తూ ముందుకు సాగుతున్నట్టు ప్రధాని చెప్పారు. భేటీలో మూడు అంశాలపై మంత్రులకు ప్రజెంటేషన్లు ఇచ్చారు. మోదీ ప్రభుత్వ ఎనిమిదేళ్ల పాలనలో సామాజిక, ఆర్థిక రంగాలకు సంబంధించిన పనితీరుపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి రాజీవ్ గౌబా సవివరంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆరోగ్య, విద్యా రంగాల్లో సాధించిన ప్రగతిని కూడా వివరించారు. చిన్న, మధ్య తరహా నగరాల్లోనూ ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్‌ల స్థాపన తదితరాలను ఉటంకించారు. విద్యా వ్యవస్థలో అన్ని స్థాయిల్లోనూ విద్యార్థుల చేరిక, కొనసాగింపు శాతం బాగా పెరిగాయని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మానవ వనరులతో పాటు అన్నిరకాల వసతులనూ మెరుగుపరిచామన్నారు. ఇక కేంద్రం ప్రారంభించిన పలు ప్రాజెక్టుల వివరాలపై పరిశ్రమలు, అంతర్గత వర్తక శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ మంత్రులకు మరో ప్రజెంటేషన్ ఇచ్చారు. మోదీ ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు మాధ్యమాలను మరింత మెరుగ్గా ఎలా వాడుకోవచ్చో సమాచార ప్రసార శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర తన ప్రజెంటేషన్లో వివరించారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 30 । జనవరి । 2023



ముందు జాగ్రత్తతో కేన్సర్‌కు చెక్

బంజారాహిల్స్‌లోని కేర్ అవుట్ పేషెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు నుంచి ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన నడకను నిర్వహించారు. -8లో



పల్మనాలజీపై పెరిగిన అవగాహన

కరోనా తర్వాత కామన్ మ్యాన్‌లో కూడా పల్మనాలజీపై అవగాహన పెరిగిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. -8లో

1న వేణు వాద్యకచేరి



చిక్కడపల్లి: అంతర్జాతీయ మొదటి మహిళా వేణువాద్య విద్వాంసురాలు డాక్టర్ జయప్రద రామ్మూర్తిచే అన్నమయ్య కీర్తనల వేణు వాద్యకచేరి ఫిబ్రవరి 1న చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

చైన్ స్నాచర్ల దొంగ దొరికాడు

ఉప్పల్: రాచకొండ, సైబరాబాద్ కమిషరేట్ల పరిధిలో ఒక్కరోజే 7 చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన మంగల్ సింగ్‌ను ఆదివారం ఉప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 7వ తేదీన నగర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన 7 చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి పోలీసులకు సవాలు విసురుతూ స్నాచర్‌లు అదే రోజు నగరం దాటి ఇతర రాష్ట్రాలకు పారిపోయారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నగర పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. ఇక్కడ స్నాచింగ్‌కు పాల్పడిన ఉత్తరప్రదేశ్ ఖాన్‌పూర్‌నకు చెందిన మంగల్ సింగ్ (38) ఆ రాష్ట్రంలోనూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. ఈ కేసులో అక్కడి ఝుంజానా పోలీసులు ఈ నెల 24న మంగల్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఉప్పల్ పోలీసులు రికవరీ కోసం అక్కడి కోర్టుకు అర్జీ పెట్టుకోగా ముజాఫర్ నగర్ జైల్‌లో ఉన్న మంగల్‌ను 28న ఉప్పల్ పోలీసులకు అప్పగించారు.

బీహెచ్‌ఈఎల్ @ 12.7 డిగ్రీలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మళ్లీ చలి తీవ్రత పెరిగింది. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలిగాలులు గజగజలాడిస్తున్నాయి. ఆదివారం బీహెచ్‌ఈఎల్ వద్ద అత్యల్పంగా 12.7 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. శివరాంపల్లిలో 13.7 డిగ్రీలు, గచ్చిబౌలి, మచ్చబొల్లారంలలో 13.8 డిగ్రీలు, వెస్ట్ మారేడ్‌పల్లిలో 14.7 డిగ్రీలు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో 15 డిగ్రీలకు పైగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాగల 24 గంటల్లో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతల్లో స్వల్ప హెచ్చుతగ్గులుంటాయని బేగంపేట్‌లోని వాతావరణ శాఖ తెలిపింది.

'ఛాయిస్' సేవలను విస్తరించాలి: కపిల్‌దేవ్



గోల్కొండ: నిరుపేద చిన్నారులకు సకాలంలో వైద్యం అందిస్తూ ఛాయిస్ ఫౌండేషన్ గొప్ప పుణ్యకార్యం చేస్తోందని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ అన్నారు. ఛాయిస్ ఫౌండేషన్ 3వ గోల్ఫ్ ఫండ్ రైజర్‌ను ఆదివారం ఆయన గోల్కొండలోని గోల్ఫ్‌కోర్ట్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కపిల్‌దేవ్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఛాయిస్ ఫౌండేషన్ సేవలు ఇతర రాష్ట్రాలకు విస్తరించాలని సూచించాఉ. ఫౌండేషన్ నిర్వహించే ఫండ్ రైజింగ్ కార్యక్రమాలకు తన మద్దతు ఉంటుందన్నారు. ప్రముఖ చలనచిత్ర దర్శకుడు క్రిష్ మాట్లాడుతూ... ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో అందరూ పాలుపంచుకోవాలిన పిలుపునిచ్చారు. ఫౌండేషన్ ప్రతినిధి రవి తంగిరాల మాట్లాడుతూ... గత సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమాలలో 1,800 పిల్లలకు వైద్య సేవలందించామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ నటుడు నాని, ఏపీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'రన్' రంజితం





ఆరు వేలమందికిపైగా నగరవాసులు 5, 10, 21కే విభాగాల్లో ఉత్సాహంగా పరుగు తీశారు. ఆదివారం మాదాపూర్‌లోని మూడో ఎడిషన్ ఇనార్బిట్ దుర్గం చెరువు రన్ (ఐడీసీఆర్)- 2023ను రాష్ట్ర ఆర్థిక, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ సొసైటీస్ కార్యదర్శి రోనాల్డ్ రాస్, ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌లు ప్రారంభించారు. రన్ ద్వారా రూ.54 లక్షలు సమీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. వీటిని దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసం వినియోగించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శంకరయ్య, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ కె.నారాయణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

– మాదాపూర్







ఇంజినీర్లకు దిశానిర్దేశం

ఎయిర్‌పోర్ట్ మెట్రో మార్గాన్ని పరిశీలించిన ఎన్వీఎస్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్‌ను ఆదివారం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పరిశీలించారు. ఇప్పటికే ఎంపిక చేసిన మార్గంలో విస్తృతంగా పర్యటించారు. ఈ రూట్లో మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను పరిశీలించారు. నార్సింగి అండర్‌పాస్ (మై హోమ్ అవతార్ జంక్షన్) నుంచి రాజేంద్రనగర్ గుట్ట వరకు సీనియర్ ఇంజినీర్లతో కలిసి దాదాపు 10 కి.మీ నడిచి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, సీనియర్ ఇంజినీర్లు విష్ణువర్ధన్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్ నాయక్, వై.సాయప్రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి ఇతర సీనియర్ అధికారులున్నారు. ఇంజినీర్లకు ఎండీ పలు సూచనలు చేశారు.

- ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్‌ను ప్రైవేట్ ఆస్తుల సేకరణను నివారించే విధంగా.. మరి కొన్ని చోట్ల సాంకేతికంగా ఎలాంటి చిక్కులు లేని రీతిలో ఖరారు చేయాలని సూచించారు.
- ఈ రూట్లో నూతనంగా ఏర్పడుతున్న కాలనీలు, రహదారుల నుంచి వచ్చే ప్రయాణికులు స్టేషన్లను సులువుగా చేరుకునే క్రమంలో అండర్‌పాస్‌లను ఉపయోగించేందుకు వీలుగా స్టేషన్ల స్థానాలను నిర్ణయించాలి.
- మెట్రో కారిడార్ పరిసరాల్లో నిర్మాణంలో ఉన్న ఎత్తయిన వాణిజ్య, నివాస భవనాలకు ఇబ్బందులు లేని రీతిలో పలు వంకలు తిరగకుండా మెట్రో వయా డక్ట్ నిర్మాణ ప్రణాళికను సిద్ధం చేయాలి. స్కైవాక్‌లు, పాదచారుల నడక మార్గాలు మెట్రో స్టేషన్ ప్లానింగ్‌లో అంతర్భాగంగా ఉండాలి.
- మెట్రో పిల్లర్లు నానక్‌రాంగూడ జంక్షన్ నుంచి అప్పా జంక్షన్ వరకు విస్తరించిన సర్వీస్ రోడ్డు యొక్క సెంట్రల్ మీడియన్‌లో ఉండాలి. దీంతో సర్వీస్ రోడ్‌లో ట్రాఫిక్ చిక్కులు లేకుండా చూడాలి.
- స్టేషన్ల యాక్సెస్ పాయింట్లు కొత్త సైకిల్ ట్రాక్‌కు అనుగుణంగా ఉండాలి. పర్యావరణహితంగా స్టేషన్‌లను చేరుకోవడానికి ఈ కొత్త సైకిల్ ట్రాక్ ఉపయోగపడుతుంది.
- ఎయిర్పోర్ట్ మెట్రో ప్రయాణం మరింత వేగవంతం చేయడానికి, సజావుగా సాగేలా చేయడానికి కొన్ని ప్రదేశాలలో వంపులను సడలించేందుకు సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి.
- స్టేషన్ల వద్ద పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధి , తాత్కాలిక కాస్టింగ్ యార్డుల ఏర్పాటు కోసం కారిడార్ సమీపంలో ప్రభుత్వ భూములను గుర్తించాలి.

హెచ్‌ఆర్‌ఏ పోస్టులపైనే నజర్!

- ప్రారంభమైన టీచర్ల బదిలీ ప్రక్రియ
- ఇప్పటికే దొడ్డిదారిన కొందరికి పోస్టింగులు
- ఆన్‌లైన్‌లో పెరిగిన దరఖాస్తుల తాకిడి
- గుట్టుగా 10 శాతానికిపైగా ఖాళీల భర్తీ



సాక్షి, సిటీబ్యూరో: ఉపాధ్యాయుల పోస్టింగుల్లో కొందరు అడ్డదారులు తొక్కుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, పిల్లల ఉన్నత చదువుల పేరుతో శివారు జిల్లాల్లో ఉన్నవారు సిటీలో పోస్టింగ్ పొందేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందే కొంత మంది ఉపాధ్యాయులు రాజకీయ, ఆర్థిక పలుకుబడిని ఉపయోగించుకుని గ్రేటర్ జిల్లాల్లో పోస్టింగ్‌లు పొందారు. పది శాతం ఖాళీలు గుట్టుగా భర్తీ అయినట్లు తెలుస్తోంది. ఒకవైపు కొందరు హెచ్‌ఆర్‌ఏ పోస్టులను కొల్లగొట్టగా మిగిలిన పోస్టులను చేజిక్కించుకునేందుకు మరికొందరు పోటీ పడుతున్నారు. శివారు జిల్లాల్లోని మెజార్టీ ఉపాధ్యాయులు నగరంలో సొంత నివాసాలు ఏర్పాటు చేసుకొని ఇక్కడి నుంచే రాక పోకలు సాగిస్తున్నారు. దీనికి తోడు గ్రామీణ ప్రాంతాల్లో హెచ్‌ఆర్‌ఏ 11 శాతం ఉండగా, గ్రేటర్ జిల్లాల్లో 24 శాతం ఉంది. ఈ పోస్టులకు డిమాండ్ ఏర్పడటానికి ఇదే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.. ఎలాగైనా ఈ పోస్టులను దక్కించుకోవాలని పైరవీలకారులను సైతం ఆశ్రయిస్తున్నారు. కౌన్సెలింగ్‌కు ముందే హెచ్‌ఆర్‌ఏ పోస్టులు భర్తీ కావడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

పారదర్శకతకు తూట్లు

ఉపాధ్యాయుల బదిలీలను పాదర్శకంగా చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటిం చింది. ఒకవైపు సీనియార్టీ జాబితా, ఖాళీల జాబితాను సిద్ధం చేస్తూ... మరో వైపు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ముందే పలువురు ఉపాధ్యాయులకు దొడ్డిదారిన కీలక పోస్టులను కట్టబెడుతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. ఇలా ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు పెద్ద సంఖ్యలో పోస్టింగ్ ఉత్తర్వుతో వచ్చి చేరారు. వీరిలో రాజకీయ పలుకుబడి కలిగిన వారు.. ఉపాధ్యాయ సంఘం నేతలు, వారి బంధువులే అధికంగా ఉన్నారు. గ్రేటర్ జిల్లాల్లోని పోస్టులే కాదు నగరానికి ఆనుకుని ఉన్న నల్లగొండ, యాదాద్రి, మహబూబ్‌నగర్, వికారాబాద్, సంగారెడ్డి ఇతర శివారు జిల్లాల్లోనూ అక్రమ బదిలీలు జరిగాయి. వీరంతా జిల్లా పరిధిలోనే బదిలీ అయినప్పటికీ.. గ్రేటర్ జిల్లాలకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పోస్టింగులు పొందడం గమనార్హం. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నవాటిని కాకుండా తక్కువ విద్యార్థులున్న స్కూళ్లను వీరు ఎంపిక చేసుకుంటుండటం గమనార్హం.

70 శాతమే..

మొత్తం ఖాళీల్లో 70 శాతం పోస్టులు పదోన్నతులు, బదిలీల ద్వారా భర్తీ కానున్నాయి. మిగిలిన 30 శాతం పోస్టులు టీచర్స్ రిక్రూట్‌మెంట్ (టీఆర్‌టీ) ద్వారా భర్తీ కానున్నాయి. గెజిటెడ్ హెచ్‌ఎం గ్రేడ్-2. డిప్యూటీ ఐఓఎస్ పోస్టులను పూర్తిగా పదోన్నతులతో నింపనున్నారు. ఇలా ఉపాధ్యాయ పదోన్నతులకు సంబంధించి సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)లు స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏ)గా, ఎస్‌ఏలు ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం)గా పదోన్నతులు పొందనున్నారు.

హైదరాబాద్‌లో ఇలా..

హైదరాబాద్ జిల్లాలో 508 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 182 ఉన్నత పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6,200 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, పీఈటీలు, లాంగ్వేజ్ పండిట్‌లు ఉన్నట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో వివిధ కేటగిరీల్లో 516 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో బదిలీ ప్రక్రియ ద్వారా సుమారు 394 మందికి అవకాశం లభించనుంది. మొత్తం మీద గెజిటెడ్ హెచ్‌ఎం గ్రేడ్-11 డిప్యూటీ ఐఓఎస్, ఎస్‌ఏ మ్యాథ్స్, ఫిజిక్స్, బయోసైన్స్, సోషల్, ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ, హిందీ, పీఈటీ సబ్జెక్టుల్లో సుమారు 514 వివిధ పోస్టులు ఖాళీగా ఉండగా అందులో 70 శాతం కింద సుమారు 392 పోస్టులు పదోన్నతులు, బదిలీల ద్వారా భర్తీ కానున్నాయి. ఉర్దూ మీడియంలో 234 ఖాళీలకు గాను 173, తెలుగుమీడియంలో 206 ఖాళీలకు గాను 157, ఇంగ్లిష్ మీడియంలో 51 ఖాళీలకు గాను 38 ఖాళీలు భర్తీ కానున్నాయి.

గట్టెక్కేదెలా?

విద్యుత్ సంస్థలను వెంటాడుతున్న అంతర్గత నష్టాలు

- నివారణ చర్యలు చేపట్టకుండా లోటును పూడ్చుకునే యత్నం
- ఉమ్మడి రంగారెడ్డిలోని వికారాబాద్ సర్కిల్‌లో 52 శాతం
- హైదరాబాద్‌లో సౌత్ సర్కిల్‌లో 44, సైబర్ సిటీలో 14 శాతం
- హైదరాబాద్ సెంట్రల్‌లో 13.4, రాజేంద్రనగర్‌లో 13 శాతం నష్టాలు



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సంస్థలకు అంతర్గత నష్టాలు గుదిబండగా మారాయి. వీటిని నుంచి సంస్థను గట్టెక్కించే విషయంలో యాజమాన్యం ఘోరంగా విఫలమవుతోంది. పరోక్షంగా ఏసీడీ చార్జీల పేరుతో వడ్డింపులకు సిద్ధమవుతుండంపై ఆందోళన వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో పర్యటించి అంతర్గత నష్టాలకు కారణమవుతున్న విద్యుత్ చౌర్యం, డీటీఆర్‌లలో ఆయిల్ లీకేజీలు, లైన్లలాస్‌లు, డీటీఆర్ ఫెయిల్యూర్లు, అంచనాలకు మించి ఎస్టిమేషన్లు, ఈఆర్‌ఓల చేతివాటం వంటి వాటిని పూర్తిస్థాయిలో కట్టడి చేయకుండా కేవ లం బిల్లుల వసూళ్లు, చార్జీల పెంపు, డిపాజిట్ల వసూళ్లపై దృష్టి సారిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అనాలోచిత చర్యలు సంస్థ మనుగడను ప్రశ్నార్థకంగా మార్చడమేగాక ప్రజాగ్రహానికి గురి కావాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ అంతర్గత నష్టాలపై ఇటీవల ఓ కార్యక్రమంలో ట్రాన్స్‌కో, డిస్కం సీఎండీలు ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

కారణాలివే..

- ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలను వసూలు చేయకుండా వదిలేసి, నెలవారీ బిల్లుల పైనే ఎక్కువ దృష్టి సారించడం, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న అక్రమార్కులను పక్కగా గుర్తించకపోవడం కూడా నష్టాలకు కారణం. లైన్ల పునరుద్ధరణ, నిర్వహణ పేరుతో డిస్కం ఏటా రూ.వంద కోట్ల వరకు ఖర్చు చేస్తుంది. క్షేత్రస్థాయిలో ఆ పనులు జరగడం లేదు. ఇప్పటికీ చాలా లైన్లు చెట్ల కొమ్మల మధ్యే ఉండిపోయాయి.
- డీటీఆర్‌ల నుంచి ఆయిల్ లీకేజీ అవుతూనే ఉంది. అనేక లైన్లు వేలాడుతున్నాయి. డీటీఆర్‌ల వద్ద సరైన ఎర్తింగ్ కూడా లేదు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్యలు ఏర్పడి ఓవర్ లోడు కారణంగా డీటీఆర్‌లు కాలి పోతున్నాయి. ఇంత ఖర్చు చేసినా లైన్‌లాసులు తగ్గక పోగా మరింత పెరుగుతుండటానికి ఇదే కారణం.
- భవిష్యత్తు అవసరాలు, విపత్తుల సమయంలో అత్యవసర పునరుద్ధరణ పనుల పేరుతో అవసరానికి మించి విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు, కాసారాలు, మీటర్, ఫ్యూజ్ బాక్స్‌లు, ఇతర కేబుళ్ల కొనుగోలు చేస్తున్నారు. స్టోర్‌లో ఉండాల్సిన ఈ విద్యుత్ పరికరాలు సబ్‌స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాల ఆవరణలో వృదాగా పడే స్తున్నారు.
- వర్షానికి తడిసి ఎండకు ఎండుతూ తుప్పుపట్టి ఎందుకూ పనికిరాకుండా పోయి విద్యుత్ నష్టాలకు కారణమవుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల పేరుతో సంస్థకు మంజూరు చేసిన నిధులను సక్రమంగా ఖర్చు చేయక పోవడం, లైన్ల విస్తరణ పేరుతో నిధుల దుర్వినియోగానికి పాల్పడుతుండటం, కార్యాలయాల్లో హంగూ ఆర్భాటాల పేరుతో విచ్చలవిడిగా కంప్యూటర్లు, ఫర్నిచర్, ఏసీలు, కూలర్లు కొనుగోలు చేస్తుండటం కూడా సంస్థ నష్టాలకు కారణమవుతోంది.
- అంతర్గత నష్టాలకు కారణమవుతున్న అంశాలపై దృష్టి సారించకుండా కేవలం ఏసీడీ చార్జీల వసూళ్ల ద్వారానే నష్టాల ఊబి నుంచి సంస్థను గట్టెక్కించవచ్చని యాజమాన్యం భావిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రేటర్ జిల్లాల్లో విద్యుత్ చౌర్యం కేసులు

సర్కిల్‌పేరు	డీపీఈ నమోదు చేసిన కేసులు	ఆపరేషన్ విభాగం ఇంజినీర్లు నమోదు చేసినవి
బంజారాహిల్స్	1405	5956
హైదరాబాద్ సెంట్రల్	1524	9731
హైదరాబాద్ సౌత్	1807	8701
సికింద్రాబాద్	576	7076
సైబర్ సిటీ	3536	7919
రాజేంద్రనగర్	2040	7401
సరూర్‌నగర్	2325	8174
హబ్సిగూడ	2310	11697
మేడ్చల్	5630	9144

నష్టాలను సాకుగా చూపి..

గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో మొత్తం 56,37,574 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 46,10,213 గృహ, 7,46,138 వాణిజ్య, 38,209 పారిశ్రామిక, 47,193 వీధిలైట్ల కనెక్షన్లుండగా, మరో 1,95,821 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నా యి. దోబీఘాట్లు, సెలూన్లు, ఫౌల్ట్రీ కనెక్షన్లు మరో 27,318 వరకు ఉన్నాయి. వీటి నుంచి నెలకు రూ.450 కోట్లకుపైగా విద్యుత్ బిల్లుల రూపంలో రావాల్సి ఉంది. కానీ పంపిణీ నష్టాలు, విద్యుత్ చౌర్యం వంటి కారణాలతో హైదరాబాద్ సౌత్ సహా సెంట్రల్, సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, వికారాబాద్ సర్కిళ్లలో నష్టాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. కేవలం హైదరాబాద్ సౌత్‌లోనే 44 శాతం నష్టాలు నమోదవుతుండటం గమనార్హం.

సర్కిళ్ల వారీగా విద్యుత్ నష్టాలు ఇలా..

సర్కిల్ పేరు	శాతాల్లో
హైదరాబాద్ సెంట్రల్	13.4
సరూర్‌నగర్	11.5
హబ్సిగూడ	7.3
మేడ్చల్	5.7
రాజేంద్రనగర్	13.0
వికారాబాద్	52.0
సైబర్‌సిటీ	14.0
సికింద్రాబాద్	6.4
బంజారాహిల్స్	5.0
హైదరాబాద్ సౌత్	44.0

కాంతులీనిన కళా కౌముది

ముగిసిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్



సాక్షి, సిటీబ్యూరో: సాహిత్యం, చిత్రలేఖనం తదితర కళలకు వేదికగా నిర్వహించిన 13వ హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. కరోనా నేపథ్యంలో రెండేళ్ల విరామం తర్వాత సైఫాబాద్‌లోని విద్యారణ్య పాఠశాలలో జరిగిన ఈ వేడుక 3 రోజుల పాటు నగర వాసులను అలరించింది.

ఆద్యంతం.. వైవిధ్యం..

- చివరి రోజైన ఆదివారం తొలి ప్యానెల్ చర్చలో భారతీయ ఒంటరి యువతి.. దగ్గర తనం కోసం అన్వేషణ, స్వేచ్ఛ అనే అంశంపై వరల్డ్ బ్యాంక్ ఉద్యోగినిగా సేవలు అందిస్తున్న శ్రేయణ, సి.రామమోహన్‌రెడ్డిల మధ్య డెస్పరేట్లీ సీకింగ్ ఫర్ షారూఖ్ రచనపై జరిగిన సంభాషణ అర్థవంతంగా సాగింది. హైదరాబాద్ బుక్ 2 ఆఫ్ ది పార్టిషన్‌పై రచయిత్రి మన్రీత్ సోధీ, ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ సోమేశ్వర్ సాతి, ఎ.సునీతలు చర్చ చరిత్రలోకి తొంగిచూసింది.
- అదే విధంగా పలు అంశాలపై ప్యానెల్ చర్చలు ఆసక్తికరంగా సాగాయి. కావ్యధారలో భాగంగా సరోజిని నాయుడు కవిత నుంచి స్ఫూర్తి పొందిన బర్డ్ ఆఫ్ టైమ్‌ను నగరానికి చెందిన కాలేజ్ ప్రొఫెసర్, నృత్య కళాకారిణి మైథిలి ప్రదర్శించారు, హమ్ ఐసీ బోల్లీ పేరిట హైదరాబాద్‌కి చెందిన పలువురు కవుల సమూహం అందించిన కవితలు స్థానికతకు పట్టం కట్టాయి. వేస్ట్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో పర్యావరణ వేత్త నల్లపురాజు చెప్పిన విషయాలు ఆలోచన రేకెత్తించాయి.
- భారతీయ సైన్ లాంగ్వేజ్‌పై సంబంధిత నిపుణురాలు అంజుఖేమాని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. స్టోరీ టెల్లింగ్‌లో భాగంగా సైన్స్ స్టోరీస్ ఫర్ ఆల్ అంటూ రోహిణి చింత సైన్స్‌ని కొత్తగా వినిపించారు. మూవీ ఇమేజెస్‌లో నాచో-మియా కంపోజర్ ప్రదర్శన... ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది.
- ఇండీ ఎక్స్‌ప్రెస్ సంగీతం వీనుల విందు చేయగా, తుది కార్యక్రమంగా నిర్వహించిన మనాల్ పాటిల్, రవి గైక్వాడ్‌ల స్టాండప్ కామెడీ ఆహూతులకు నవ్వుల్ని పంచింది. నృత్యం, సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం.. ఇలా విభిన్న అంశాల మేలు కయికగా సాగిన ఫెస్ట్‌ని ఆహూతులు, కళాభిమానులు బాగా ఆస్వాదించారు. రెండేళ్ల విరామం తర్వాత కూడా హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ తనదైన పునరాగమనాన్ని ఘనంగా చాటింది.

'సాక్షి' ప్రాపర్టీ షోకు విశేష స్పందన

మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో 'సాక్షి' ప్రాపర్టీ షోకు విశేష స్పందన లభించింది. వినియోగదారులు భారీ సంఖ్యలో పాల్గొని స్టాళ్లను సందర్శించారు. ప్రాపర్టీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. - 8లో



స్టాల్‌లో ప్రాపర్టీ వివరాలు తెలుసుకుంటున్న సందర్శకులు

ముగిసిన సాక్షి ప్రాపర్టీ షో

రెండు రోజుల్లో వేల సంఖ్యలో సందర్శకుల రాక





మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో సాక్షి ప్రాపర్టీషో ముగింపు రోజు సందర్శకులు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో రెండు రోజులుగా నిర్వహించిన సాక్షి ప్రాపర్టీ షో ఆదివారం ముగిసింది. నగరవాసులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రాపర్టీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాల్స్ వద్ద కస్టమర్ల తాకిడి ఎక్కువయ్యింది. రెండు రోజుల ఈ ప్రదర్శనలో వేల సంఖ్యలో సందర్శకులు పాల్గొన్నారు. ప్రతి స్టాల్ గృహ కొనుగోలు దారులతో కిటకిటలాడింది. ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు, విల్లాలు, అన్ని రకాల ప్రాపర్టీ వివరాలను సందర్శకులు స్టాల్స్ నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు. ఎంపిక చేసుకున్న ప్రాపర్టీలకు రుణసదుపాయం ఉందా, లేదా అని ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు ఏర్పాటు చేసిన స్టాళ్ళ వద్ద అడిగితెలుసుకున్నారు. ఈ స్థిరాస్తి ప్రదర్శనకు ప్రధాన స్పాన్సర్‌గా అపర్ణ కన్‌స్ట్రక్షన్స్, అసోసియేట్ స్పాన్సర్లుగా వాసవి, సైబర్‌సిటీ, రాజపుష్ప వ్యవహరించాయి.







హైటెక్‌సిటీకి దగ్గరలో చూస్తున్నాం



ఐటీ కార్యాలయాలకు దగ్గరగా ఉండాలని పరిసర ప్రాంతాలలో అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసేందుకు వచ్చి వివరాలను తెలుకుంటున్నాను. వీటితో పాటు ఓపెన్ ప్లాట్లు, విల్లాల రేట్లను తెలుసుకున్నా. గృహాలు కొనుగోలు చేసేటప్పుడు ఎలాంటి అనుమతులు ఉండాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సాక్షి ప్రాపర్టీషోను సందర్శించిన తరువాత విషయాలు తెలిశాయి. – సత్యాన్వేషి, సందర్శకురాలు

సమయం, డబ్బు ఆదా



ప్రస్తుతం ప్రాపర్టీ కొనుగోలు చేయాలంటే అన్ని విధాలా ఆలోచించి కొనుగోలు చేయాలి. తక్కువ రేట్లకు ఇస్తాం అని కొందరు మధ్యవర్తులు మోసాలు చేస్తున్నారు. ఇలాంటి ప్రాపర్టీ షోలను సందర్శించడం వల్ల అన్ని విధాల అనుమతులు పొందిన ప్రాపర్టీలను కొనుగోలు చేయవచ్చు, ఎలాంటి మధ్యవర్తులతో పని ఉండదు. అనుకున్న సమయానికి గృహాలను అందిస్తారు. సాక్షి ప్రాపర్టీ షో చాలా బాగుంది. – గణేష్, బాచుపల్లి

ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలి



వకుళాభరణం కృష్ణమోహన్‌రావును సత్కరిస్తున్న దృశ్యం

కాచిగూడ: ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆళ్ళ సాంబయ్య ఫౌండేషన్ (పాలకోడేరు), ఆదిలీలా ఫౌండేషన్, చైతన్య కళాభారతి (హైదరాబాద్) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సైబర్ మిడోస్ సొసైటీ క్లబ్ హౌస్‌లో శతాబ్ది గాయకుడు పద్మశ్రీ ఘంటసాల శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ గాయనీ గాయకులు ఘంటసాల మధురగీతాలు ఆలపించారు. సాంబయ్య ఫౌండేషన్ చైర్మన్ ఆళ్ల రామకృష్ణ, కుమారస్వామి, ఆదినారాయణ, రహమతుల్లా, బాలకామేశ్వర్‌రావు, రామూర్తి, పద్మజా తదితరులున్నారు.

నేటి నుంచి మెగా హెల్త్ క్యాంపు

సాక్షి, సిటీబ్యూరో: డాక్టర్ విజారత్ రసూల్ ఖాన్ షాదాన్ వైద్య కళాశాల ఏర్పాటు చేసి 20ఏళ్ల పూర్తయిన సందర్భంగా డాక్టర్ విజారత్ రసూల్ ఖాన్ ఫ్రీ మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు షాదాన్ సొసైటీ నిర్వాహకులు షాదాన్ విజారత్ రసూల్ ఖాన్ ఆదివారం తెలిపారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 15 వరకు షాదాన్ హాస్పిటల్‌లో జరిగే ఈ హెల్త్ క్యాంపులో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తామని ఆమె పేర్కొన్నారు. షాదాన్ సొసైటీ వైస్ చైర్మన్ ఏజాజు రహ్మాన్, సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సారిబ్ రసూల్ ఖాన్ మాట్లాడుతూ క్యాంపు చివరి రోజు వైద్య శిబిరంలో చికిత్స పొందిన వారందరికీ ఫ్యామిలీ హెల్త్ కార్డులు అందిస్తామని ప్రకటించారు. ఈ కార్డుల ద్వారా కుటుంబంలోని సభ్యులంతా ఏడాది పాటు ఉచిత వైద్యాన్ని పొందవచ్చని అన్నారు.

ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగానే..

ఫ్రీ మెగా హెల్త్ క్యాంపులో ఖరీదైన వైద్య పరీక్షలు సైతం ఉచితంగానే చేస్తున్నామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని సారిబ్ రసూల్ ఖాన్ కోరారు. అల్ట్రా సౌండ్ ఇమేజింగ్, 2డి ఎకో, రేడియాలజీ ఎమ్మారై స్కాన్ లాంటి పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. యూరాలజీ (మూత్రాశయం), కార్డియాలజీ (గుండె), నెఫ్రాలజీ (కిడ్నీ), ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారన్నారు. పూర్తి వివరాలకు 9676311747, 8686285796 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

పల్మనాలజీపై పెరిగిన అవగాహన

అంతర్జాతీయ సదస్సులో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి హరీశ్‌రావు



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

మాదాపూర్ : కరోనా తరువాత కామన్‌మ్యాన్‌లో కూడా పల్మనాలజీపై అవగాహన కలిగిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో రెండు రోజులపాటు అంతర్జాతీయ పల్మనాలజీ సదస్సు, లైవ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఆదివారం ముగింపు కార్యక్రమంలో హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో గుండె, కిడ్నీ, లివర్ గురించి మాట్లాడుకునే ప్రజలు ఇప్పుడు పల్మనాలజీపై చర్చిస్తున్నారన్నారు. ఇలాంటి కాన్ఫరెన్స్‌లను నిర్వహించడం ద్వారా డాక్టర్లు కొత్తగా వస్తున్న మార్పులను తెలుసుకుని రోగులకు మరింత మెరుగైన సేవలను అందించడానికి వీలుకలుగుతుందని పేర్కొన్నారు. సదస్సులో ప్రపంచవ్యాప్తంగా డాక్టర్లు పాల్గొనడం సంతోషకరమన్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలలో ఉన్న మెడికల్ కళాశాలల్లో పల్మనాలజీకి ప్రాధాన్యత కల్పిస్తున్నట్టు తెలిపారు. యశోద హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి సమయంలో వైద్యులు చేసిన కృషిని కొనియాడారు. యశోద గ్రూప్ ఆఫ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ రావు మాట్లాడుతూ, అంతర్జాతీయ అధ్యాపకులు 40 మంది, 120 మంది జాతీయ అధ్యాపకులు, రెండు వేల మంది పల్మనాలజీ వైద్యులతో సదస్సును నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఫెలిక్స్ హెర్త్, ప్రొఫెసర్ హోగార్త్, డాక్టర్ మైఖెల్ ప్రిట్చెట్, డాక్టర్ పల్లవ్‌షా, డాక్టర్ లోరెంజో, డాక్టర్ జమాలుల్ తదితరులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో ముగిసిన పెటెక్స్



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన టాయ్‌గర్ పిల్లులు (ధర రూ.8 నుండి 10 లక్షలు)

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న పెటెక్స్ ఇండియా 2023 ఆదివారం ముగిసింది. సెలవు రోజు కావడంతో సందర్శకులు అధిక సంఖ్యలో పాల్గొని సందర్శించారు. శునకాలకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. 50 జాతులకు చెందిన 500 కుక్కలు, దాదాపు 700 జాతులకు చెందిన చేపలు, 120 పిల్లులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. పక్షులకు, కుక్కలకు, చేపలకు, పిల్లులకు కావాల్సిన ఆహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి పలువురు డాక్టర్లు సందర్శకులకు స్టాల్స్‌లో వివరించారు. కొన్ని రకాల జాతుల పక్షులు, కుక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఎక్సొటిక్ బర్డ్

ముందు జాగ్రత్తలతో కేన్సర్‌కు చెక్



వాకథాన్‌లో పాల్గొన్న ఐటీ సెక్రటరీ జయేష్ రంజన్ తదితరులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేర్ ఔట్‌పేషంట్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు నుంచి రోడ్ నెం.10 కేర్ అవుట్‌పేషంట్ ఆస్పత్రి వరకు ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన నడక నిర్వహించారు. తెలంగాణ ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ఈ వాక్‌ను ప్రారంభించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కేన్సర్‌ను అరికట్టవచ్చని జయేష్ రంజన్ సూచించారు. ఆస్పత్రిలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరచూ ఏర్పాటు చేస్తుండాలని కోరారు. ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడం ఎలా, వ్యాధిబారిన పడిన తర్వాత అందుబాటులో ఉన్న వైద్యం తదితర అంశాలను ప్రజలకు తెలియజేసేందుకు వారం రోజుల పాటు కేర్ ఆస్పత్రి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరం అన్నారు. పలువురు ఐఏఎస్ అధికారులు ఈ వాక్‌లో పాల్గొన్నారు. ఆస్పత్రి సర్జికల్ అంకాలజీ నిపుణులు విపుల్ గోయెల్, మెడికల్ అంకాలజీ నిపుణులు సాయినాథ్, నీలేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లకు అందని ఆరోగ్యమస్తు

- ఆరంభ శూరత్వంగానే మిగిలిన కేంద్ర పథకం
- అప్పట్లో దత్తాత్రేయ చేతుల మీదుగా ప్రారంభం
- ఆటోలతో పాటు రవాణాకార్మికులకు వర్తింపు
- కార్మికుల కుటుంబాలకు ఈఎస్ఐ వైద్యసేవలు
- పథకాన్ని అమలు చేయాలని కోరుతున్న కార్మిక సంఘాలు

సాక్షి, సిటీబ్యూరో : ఆటోడ్రైవర్ల కుటుంబాల కోసం కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన ఆరోగ్యమస్తు పథకం ఆరంభంలోనే ఆగింది. ఒక్క ఆటోడ్రైవర్లకే కాకుండా రవాణా రంగానికి చెందిన లక్షలాది మంది కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పట్లో కేంద్రకార్మిక శాఖ సహాయ మంత్రిగా విధులు నిర్వహించిన బండారు దత్తాత్రేయ నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీనిని ప్రారంభించారు. ఆటోడ్రైవర్లకు, రవాణా కార్మికులకుఈఎస్ఐ కార్డులను కూడా పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ఈ పథకాన్ని ప్రారంభించి అనంతరం దశలవారీగా దేశవ్యాప్తంగా రవాణా కార్మికులకు విస్తరించాలని భావించారు.కానీ ఈ పథకం ఈఎస్ఐ కార్డుల పంపిణీకే పరిమితమైంది. ఇది అమల్లోకి వస్తే ప్రస్తుతం సంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్యసదుపాయాలు లభిస్తున్నట్లుగానే రవాణా రంగానికి డ్రైవర్లు, వివిధ విభాగాల్లో పని చేసే సిబ్బందికి, వారి కుటుంబాలకు కలిపి సుమారు 10 లక్షల మందికి ప్రయోజనం చేకూరే అవకాశం ఉండేది.

తగ్గిన ఉపాధి అవకాశాలు

గ్రేటర్‌లో వ్యక్తిగత వాహనాల వినియోగం భారీగా పెరిగింది. దీంతో ప్రజా రవాణా ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. క్యాబ్‌లు, బైక్ క్యాబ్‌లు, ఆటోలు, ఇతర వాహనాల మధ్య నెలకొన్న పోటీ వాతావరణం వల్ల కూడా కార్మికుల ఆదాయం గణనీయంగా పడిపోయిందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉబెర్, ఓలా వంటి సంస్థలు ప్రవేశించిన తరువాత డ్రైవర్ల మధ్యనే అనారోగ్యకరమైన పోటీ ఏర్పడింది. దీంతో ఒక్కోసారి ఆదాయం ఉన్నా లేకున్నా బండి నడపాల్సి వస్తుందని తెలంగాణ ఆటోడ్రైవర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.సత్తిరెడ్డి తెలిపారు.ఇటు రాష్ట్రప్రభుత్వం, అటు కేంద్రం కూడా రవాణా కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికులు, వారి కుటుంబాలకుఈఎస్ఐ వైద్యసేవలను అందుబాటులోకి తేవడం వల్ల కనీసం వైద్యం కోసం చేసే ఖర్చులను తగ్గించుకొనేందుకు అవకాశం లభించనుంది. కోవిడ్‌తో వేలాది మంది కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయి. తిరిగి కోలుకుంటున్న తరుణంలో గత రెండేళ్లుగా వ్యక్తిగత వాహనాలు భారీగా పెరిగి ఉపాధి తగ్గిందని చెప్పారు.

ఇదీ పథకం...

- డ్రైవర్లు, వారి కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుంది. అంటే డ్రైవర్, అతని భార్య, ఇద్దరు పిల్లలు ఈ పథకం కింద ఇఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్య సేవలను పొందవచ్చు.
- ఈ పథకంలో చేరేందుకు కార్మికులు మొదటి ఆరు నెలలకు రూ. 1500 చెల్లించాలి. ఆ తరువాత ఆరు నెలలకు రూ.1500 చొప్పున చెల్లిస్తే అన్ని రకాల వైద్య సదుపాయాలను ఉచితంగా పొందవచ్చు.
- వ్యాధి తీవ్రతను బట్టి ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి కార్పొరేట్ ఆసుపత్రులకు పంపిస్తారు. అక్కడ అయ్యే ఖర్చులను కేంద్రమే భరిస్తుంది.

ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించాలి ...

- మరో రెండు రోజుల్లో కేంద్ర ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో రవాణా కార్మికుల సంక్షేమం కోసం నిధులు కేటాయించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇఎస్ఐ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరుతున్నాయి.

నిత్య పెళ్లి కొడుకు ఆటకట్టించిన పోలీసులు

- నెల క్రితమే మూడో పెళ్లి..
- విడాకులు ఇవ్వకుండానే మరోసారి పెళ్లికి సిద్ధం
- బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు

కంటోన్మెంట్: ముచ్చటగా మూడు పెళ్లిళ్లు చేసుకుని నాలుగో పెళ్లికి సిద్ధమైన నిత్య పెళ్లి కొడుకు బాగోతం బోయిన్‌పల్లిలో కలకలం సృష్టించింది. బోయిన్‌పల్లి పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. వంశీ కృష్ణ (39) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దిల్‌కుష్ నగర్‌లోని కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇతను గతంలోనే రెండు పెళ్లిళ్లు చేసుకుని వివిధ కారణాల వల్ల విడాకులు తీసుకున్నాడు. తాజాగా మూడో పెళ్లి కోసం ఓ మ్యాట్రిమోనీని సంప్రదించాడు. నెల్లూరు జిల్లాకు చెందిన డాక్టర్ మీనారెడ్డికి ఏడాది క్రితమే వివాహం జరగ్గా ఇటీవలే భర్త చనిపోయాడు. ఈమె కూడా అదే మ్యాట్రిమోనీలో దరఖాస్తు చేసుకుంది. మ్యాట్రిమోనీ ద్వారా ఒకరి వివరాలు మరొకరికి అందడంతో, గత నెలలోనే వంశీకృష్ణ నెల్లూరుకు వెళ్లి మీనారెడ్డినికి కలిశాడు. నాలుగైదు రోజుల పాటు అక్కడే ఉండి నగరానికి తిరిగొచ్చాడు. ఈ నెల 4వ తేదీన నగరానికి వచ్చిన మీనారెడ్డిని కుటుంబ సభ్యుల సమక్షంలోనే ఆడంబరం లేకుండా వివాహం చేసుకున్నట్లు తెలుస్తోంది. వారం రోజుల అనంతరం నెల్లూరుకు వెళ్లికిన మీనా రెడ్డి ఈ నెల 24న మళ్లీ తిరిగొచ్చి వంశీకృష్ణ ఇంటికి చేరుకుంది. అయితే అప్పటికే వంశీకృష్ణ తనకు మీనారెడ్డితో వివాహ బంధాన్ని కొనసాగించడం ఇష్టం లేదంటూ చెప్పి, ఓ గదిలో బంధించాడు. మళ్లీ వివాహం కోసం మ్యాట్రిమోనీని సంప్రదించాడు. ఇటీవలే పెళ్లి చేసుకున్న వంశీకృష్ణ మళ్లీ పెళ్లికోసం దరఖాస్తు చేసుకోవడంతో మ్యాట్రిమోనీ నిర్వాహకులు మీనారెడ్డిని ఫోన్‌లో సంప్రదించారు. ఆమె చెప్పిన వివరాలతో పాటు వంశీకృష్ణపై ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు. దీంతో ఆమె వంశీకృష్ణ చెరనుంచి తప్పించుకుని బోయిన్‌పల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వంశీకృష్ణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వంశీకృష్ణ మూడు పెళ్లిళ్ల వ్యవహారంలో అతని కుటుంబ సభ్యులు పాత్రపై కూడా ఆరాతీస్తున్నారు.

ఉత్సాహంగా గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్



గ్లోబల్ ఎడ్యుకేషన్ అడ్మిషన్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న నవీన్ మిట్టల్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని సుల్తాన్ ఉల్ ఉలూం క్యాంపస్‌లో ఆదివారం గ్లోబల్ ఎడ్యుకేషన్ కెరీర్ ఫోరం ఆధ్వర్యంలో ఉన్నత విద్యా మండలి కమిషనర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ గ్లోబల్ ఎడ్యుకేషన్ అడ్మిషన్స్ ఫెయిర్‌ను నిర్వహించింది. ఉస్మానియా, జేఎన్‌టీయూ హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, కాకతీయ యూనివర్సిటీల సౌజన్యంతో ఈ ఫెయిర్‌ను నిర్వహించారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ఈ కార్యక్రమాన్ని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌ఛాన్సిలర్ ప్రొఫెసర్ రవీందర్‌తో కలిసి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో గ్లోబల్ ఎడ్యుకేషన్ కెరీర్ ఫోరం 19 జీ–సెల్స్‌ను ప్రారంభించిందని ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 55 యూనివర్సిటీల ప్రతినిధులు తరచూ ఎడ్యుకేషన్ ఫెయిర్లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంజగుట్ట ఏసీపీగా మోహన్‌కుమార్


మోహన్‌కుమార్

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్ డివిజన్ ఏసీపీగా ఎస్.మోహన్ కుమార్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వహించిన పి.వి.గణేష్ ఖమ్మం లోకల్ ఏసీపీగా బదిలీపై వెళ్లారు. సీసీఎస్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న మోహన్ కుమార్ బదిలీపై పంజగుట్టకు వచ్చారు. గతంలో మోహన్‌కుమార్ పంజగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. మోహన్‌కుమార్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు చేసిన సమయంలో పంజగుట్టలో క్రైమ్ రేట్ తగ్గడం, ఎన్నో మార్పులు తీసుకురావడం వల్లే గతంలో భారతదేశంలో రెండవ అత్యుత్తమ పోలీస్‌స్టేషన్‌గా పంజగుట్ట స్టేషన్ ఎంపికైంది. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు మోహన్ కుమార్ తెలిపారు.

సాయిబాబాకు నేరేడు రసంతో అభిషేకం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన శ్రీ సాయిబాబా మాఘమాస మహోత్సవంలో భాగంగా ఆదివారం బాబాకు నేరేడు పండ్ల రసంతో అభిషేకం నిర్వహించారు. వైరాగ్యం నుంచి విముక్తి కై ఈ అభిషేకం జరిగింది. వేడుకల్లో భాగంగా ఉదయం నక్షత్ర హారతి, మధ్యాహ్న హారతి, సంధ్యాహారతి, రాత్రి శేజ్ హారతి కన్నుల పండువగా జరిగాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

సొసైటీ థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నాలు

రహమత్‌నగర్: సొసైటీ థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్‌కు ఎమ్మెల్యే గోపీనాథ్ పూర్తి సహకారం అందిస్తున్నారని, త్వరలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని ఎస్ఆర్ఆర్ పురం హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ఎంఏ సత్తార్ హామీ ఇచ్చారు. బోరబండ సైట్-1 తురైబాజ్‌ఖాన్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్ సమస్యపై సొసైటీ ప్రతినిధులు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. సొసైటీ మరింత అభివృద్ధి చెందాలంటే సభ్యులు సహకారం అవసరం అన్నారు. కో ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ భీమ్ రాజ్, సొసైటీ కార్యదర్శి అహ్మద్‌అలీ, ఉపాధ్యక్షుడు సత్తాజీ, కోశాధికారి షేక్ యా సుఫోద్దీన్, షేర్ హోల్డర్స్ సొసైటీ సభ్యులు ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

రహమత్‌నగర్: బీజేపీ కార్యకర్తలు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు లంకాల దీపక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్పీఆర్‌హిల్స్ మహాత్మానగర్‌కు చెందిన దివ్యాంగుడు రత్నంకు ట్రైసైకిల్‌ను ఆయన ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతాల్లో వారి అవసరాలను తీర్చేందుకు యువత కృషి చేయాలని సూచించారు. ఇందుకు తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కుంభాల గంగరాజు, మాజీ కన్వీనర్ ప్రేమ్, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కిలారి మనోహర్, అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ, రాంధారి బాబు, డివిజన్ అధ్యక్షుడు కనకరాజు, నాయకులు భాస్కర్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను బూత్ స్థాయిలో ప్రచారం చేయాలి


ఎమ్మెల్యేకు బూత్ కమిటీ వివరాలను అందజేస్తున్న బస్తీ నాయకులు

రహమత్‌నగర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను బూత్‌స్థాయిలో ప్రచారం చేయాల్సిన బాధ్యత బస్తీ నాయకులదే అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్ బూత్ కమిటీల సమావేశం ఎస్పీఆర్ హిల్స్ క్వారీ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయడంలో ప్రతి నాయకుడు శ్రమించాలని సూచించారు. రహమత్‌నగర్ డివిజన్‌లో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రతి వ్యక్తికి వివరించాలని సూచించారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మన్సూర్, ప్రధాన కార్యదర్శులు సుబ్బరాజు, మాజీ డివిజన్ అధ్యక్షుడు కొండాపురం నాగరాజు, శ్రీనివాస్, రవిశంకర్, అబ్దుల్ సమద్, నజీర్, జాఫర్ హుస్సేన్, ఘని, నరసింహ, వేముల యాదయ్య పాల్గొన్నారు.

సమన్వయ లోపం.. ప్రజలకు శాపం

- కుంగిన రోడ్డు కింద ఉన్న నాలా మాకు రాదంటే మాకు రాదంటూ వాదోపవాదనలు
- తమదైతే కాదంటూ ఆధారాలతో తేల్చిన జలమండలి
- ఎట్టకేలకు తమదేనంటూ అంగీకరించిన జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం

ప్రభుత్వ విభాగాల మధ్య నెలకొన్న సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారుతోంది. ఇందుకు ఉదాహరణగా హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్-5 వద్ద నాలా సమీపంలో కుంగిన రోడ్డు నిలుస్తోంది.



కుంగిన రోడ్డులో కూరుకుపోయిన టిప్పర్, టిప్పర్‌ను బయటకు తీసిన తర్వాత కనిపిస్తున్న బిడ్, పెద్ద గుంత

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లో శనివారం కుంగిన రోడ్డు కింద నిజాం కాలం నాటి ఓపెన్ నాలా ఉండేది. దానిపై ఓ బిడ్‌ను వేసి దానిపై తారుతో రోడ్డును వేశారు. దీని పక్కనే నాలా కోసం మరో పైప్‌లైన్ వేశారు. ఓ పక్క నిజాం కాలం నాటి ఓపెన్ నాలా మరో పక్క వరద నీరు ప్రవహించేందుకు నిర్మించిన పైప్‌లైన్. వీటిపై వేసిన రోడ్డు కాస్త నాణ్యత లోపం కారణంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాల తాకిడికి అదురుతూ వస్తుంది.

- ఈ క్రమంలోనే టన్ను బరువుతో వెళ్తున్న మినీ టిప్పర్ దాటికి ఓపెన్ నాలపై వేసిన రోడ్డు కుంగిన సంఘటన సర్వత్రా భయందోళనకు దారి తీసింది. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణ లోపం కారణంగానే ఇంత పెద్ద ప్రమాదం జరిగిందనే విమర్శలు వినవస్తున్నాయి.

నిజాం కాలం నాటి ఓపెన్ నాలా.. దానిపై బిడ్‌తో రోడ్డు

- హిమాయత్‌నగర్ స్ట్రీట్‌నెంబర్-5 వద్ద ముషీరాబాద్‌కు వెళ్లే నాలా ఉంది. ఈ నాలాకు అనుసంధానించి ప్రధాన రహదారి వైపు నిజాం కాలం నాటి ఓపెన్ నాలా ఉంది. ఆ నాలాను పూర్తిగా బంద్ చేసి.. పక్కనే పైప్‌లైన్‌ను నిర్మించి దాని ద్వారా వరదనీరు చేరేలా కొన్నేళ్ల క్రితం అధికారులు నిర్మించారు.
- ఓపెన్ నాలా పైన ఓ బిడ్‌ను వేసి ఆ బిడ్‌పై రోడ్డు వేశారు. ఈ రోడ్డు కాస్త నాణ్యత లోపించడం, ఏళ్ల క్రితం వేసిన రోడ్డు కావడంతో చిన్నపాటి వాహనాలకు సైతం రోడ్డు ధ్వంసం అయ్యే పరిస్థితిలు ఏర్పడ్డాయి.
- నాణ్యత లోపం కారణంగా ఈ రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు సాగించిన ప్రతిసారీ రోడ్డు ఆ బరువుకు అదురుతుంది. ఇక్కడ కొత్తగా రోడ్డును నిర్మించాలంటూ పలుమార్లు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగానికి ఫిర్యాదులు చేసినా వాటిని పక్కన పెట్టేశారు.

ఇరు వర్గాల మధ్య విభేదాలు

- డివిజన్‌లో ఎక్కడెక్కడ ఓపెన్ నాలాలు ఉన్నాయి.. ఏఏ ప్రాంతంలో వరదనీరు వెళ్లే పైప్‌లైన్‌లు ఉన్నాయనే కనీస అవగాహన సైతం ఇక్కడి ఏఈకి లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత ఇటు జలమండలి మేనేజర్ మహేందర్‌రెడ్డి అటు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ డీఈ దుర్గాప్రసాద్, ఏఈ దివ్యతేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివలు సంఘటన స్థలానికి వచ్చారు. ఓపెన్ నాలపై బిడ్ వేసి దానిపై రోడ్డు నిర్మాణం చేపట్టిన కారణంగానే రోడ్డు కుంగిందని, కింద ఉన్న ఓపెన్ నాలాకు జలమండలికి సంబంధం లేదంటూ మహేందర్‌రెడ్డి చెప్పినప్పటికీ జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం వినే పరిస్థితిలో లేరు. ఈ కారణంగా కొంత సమయం పాటు ఇరువురి మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆధారాలతో సహా ఇది మాకు రాదంటూ మహేందర్‌రెడ్డి చెప్పడంతో అప్పటికి కళ్లు తెరిచిన డీఈ, ఏఈలు మినీ టిప్పర్‌ను అక్కడ నుంచి తొలగించే ప్రయత్నం చేశారు.

హిమాయత్‌నగర్‌నూ పట్టించుకోండి: టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి

హిమాయత్‌నగర్: హైదరాబాద్ అభివృద్ధి అంటే డల్లాస్, దావోస్ మాత్రమే కాదని టీ పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టకంటి వినోద్‌రెడ్డి అన్నారు. నగరం నడిబొడ్డున ఉన్న మొట్టమొదటి సిటీ హిమాయత్‌నగర్‌ను పట్టించుకోవాలని ఆయన సూచించారు. హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్-5లో కుంగిన రోడ్డులో కూరుకుపోయిన టిప్పన్ స్థలాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి మాట్లాడుతూ... నిజాం కాలం నాటి ఓపెన్ నాలపై బిడ్‌లు నిర్మించి దానిపై రోడ్డును వేసి వదిలేశారన్నారు. రోడ్డు బలంగా లేని కారణంగా వాహనాల బరువుకు కుంగిపోయిందన్నారు. కేటీఆర్ మునిసిపల్ మంత్రిగా ఉంటూ.. సిటీకి అనేక పెట్టుబడులను తేవడం సంతోషమే. కానీ హిమాయత్‌నగర్ అనేది ప్రధాన సిటీ ఈ సిటీపై ఆయన దృష్టి సారించాలన్నారు. ఎక్కడ ఓపెన్ నాలాలు ఉన్నాయి, ఎక్కడెక్కడ సమస్యాత్మకమైన రోడ్లు ఉన్నాయనే విషయాలను ముందుగా గుర్తించాలన్నారు. సిటీ అభివృద్ధి అంటే హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు మాత్రమే కాదని ఇటువంటి ప్రాంతాలను కూడా పట్టించుకోవాలన్నారు. ఇటువంటి ఓపెన్ నాలాలు ఉన్న ప్రాంతాల్లో స్పెషల్ ఇంజినీరింగ్ టీంతో సర్వే చేసి సమస్యలను గుర్తించాలన్నారు. ఇటువంటి సమస్యలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ తరుపున ఉద్యమిస్తామని హెచ్చరించారు.


రోడ్డు కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వినోద్‌రెడ్డి

నిమ్స్‌లో 'మళ్లీ' ఆపరేషన్!

రోగిని అడ్మిట్ చేసుకున్న ఆస్పత్రి వర్గాలు

సాక్షి ఎఫెక్ట్..

లక్డీకాపూల్: వాంతులు, కళ్లు తిరిగే సమస్యతో ఆస్పత్రికి వచ్చిన రోగికి ఆపరేషన్ చేయకుండానే చేసినట్టు డిశ్చార్జ్ చేసిన వైద్యులు తాజాగా ఆపరేషన్ చేయడానికి సిద్ధమయ్యారు. ఎల్లారెడ్డిగూడకు చెందిన వెంకటేశ్వరరావు 2021 ఏప్రిల్ 4న నిమ్స్‌లో చేరాడు. ఆరోగ్యశ్రీ ఉన్నా.. డబ్బులు కట్టలేదని ఆపరేషన్ చేయలేదు. పైగా చేసిన డిశ్చార్జి సమ్మరీ ఇచ్చి పంపించేశారు. బయట ఎన్ని ఆస్పత్రులకు వెళ్లినా నీకు ఆపరేషన్ చేశారు. మళ్లీ ఆపరేషన్ చేయమంటూ ఉస్మానియా, గాంధీతో సహా అన్ని ఆస్పత్రులకు తిప్పిపంపించేశాయి. ఇదే విషయాన్ని 'సాక్షి' 'ఆపరేషన్' నిమ్స్! అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రిక వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై స్పందించిన నిమ్స్ న్యూరాలజీ విభాగం రెండేళ్ల తర్వాత మళ్లీ ఆస్పత్రిలో చేరుకుంది. వైద్యవర్గాల నిర్లక్ష్యం కారణంగానే చేయని ఆపరేషన్‌కు కుట్లు తీయాలంటూ సమ్మరీలో రాసిపంపించారంటూ బాధితుడు నిమ్స్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడు. స్పందించిన యాజమాన్యం రోగిని అడ్మిట్ చేసుకుని ఆపరేషన్ జరిగేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుతం నిమ్స్ న్యూరోసర్జన్ డాక్టర్ విజయసారథి వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహిస్తుంది. ఒకటి, రెండు రోజుల్లో వెంకటేశ్వరావుకు ఆపరేషన్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు నిమ్స్ వర్గాలు పేర్కొంటున్నాయి.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం 36లో ఆదివారం తెల్లవారుజామున అదుపు తప్పిన వేగంతో వచ్చిన కారు(టీఎస్/టీఎస్09/టీసీ/142) కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ముందు భాగం నుజ్జునుజ్జైంది. కారులో నలుగురు యువతీయువకులు కూర్చున్నారని, రోడ్ నెం. 45 వైపు నుంచి ఉదయం 6 గంటల సమయంలో వేగంగా దూసుకొచ్చారని ఎదురుగా వెళ్తున్న స్కూటరిస్ట్‌ను తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని కారును తొలగించారు. ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ప్రధాని అందరికీ స్ఫూర్తి: చింతల

బంజారాహిల్స్: ఈ ఏడాది పద్మ అవార్డుల్లో ఆదివాసీలకు సేవ చేసిన వారికి ఎక్కువగా దక్కాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. 2023 సంవత్సరాన్ని పీపుల్స్ పద్మ ఏడాదిగా అభివర్ణించిన అయన ఈ ఏడాదిలో తొలి మన్‌కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడారు. జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యురాలు కె.స్వరూప నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి విచ్చేసి స్థానిక బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. మోదీ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని ఈ సందర్భంగా చింతల పేర్కొన్నారు. ప్రధాని పేర్కొన్నట్లుగా నేటి అత్యాధునిక పరికరాలే రేపటి ఈ-వ్యర్థాలుగా మారుతాయని ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు కాలుష్య రహిత సామగ్రిపైనే దృష్టి పెట్టాలన్నారు. మోదీ బాటలో నడవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చింతల సూచించారు.


మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు

ప్రపంచ శాంతే లక్ష్యం

వరల్డ్ పీస్ కౌన్సిల్ అధ్యక్షుడు పల్లబ్ సేన్ గుప్తా

హిమాయత్‌నగర్: ప్రపంచ శాంతి కోసం 'అవును' అంటూ.. యుద్ధనికి 'కాదు' అంటూ తాము ముందుకెళ్తున్నామని వరల్డ్ పీస్ అంతర్జాతీయ అధ్యక్షుడు పల్లబ్ సేన్ గుప్తా అన్నారు. ప్రపంచంలో ప్రజలకు శాంతి అవసరమని అది లేకుండా అభివృద్ధి, సామాజిక న్యాయం, మంచి భవిష్యత్తు సాధ్యం కాదన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలపై సామ్రాజ్యవాద శక్తులు బెదిరింపులకు పాల్పడుతూ ఆంక్షలు విధించడం వల్ల క్యూబా లాంటి అనేక దేశాలు ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయన్నారు. పల్లబ్ సేన్ గుప్తా ఇటీవల అంతర్జాతీయ అధ్యక్షుడిగా నియమితులై నగరానికి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని.. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని మినర్వా హోటల్లో అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం, తెలంగాణ రాష్ట్ర శాఖలు సంయుక్తంగా ఆయనను సత్కరించాయి. ఈ సందర్భంగా పల్లబ్ సేన్ గుప్తా మాట్లాడుతూ... ఐక్య రాజ్య సమితి గుర్తింపు పొందిన వరల్డ్ పీస్ కౌన్సిల్ శాంతికి అవును, యుద్ధానికి కాదు అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో పనిచేస్తుందన్నారు. నిజమైన శాంతిని విశ్వసించే దేశాలు అంతర్జాతీయ సహకారం అందిస్తాయన్నారు. సామ్రాజ్యవాద దేశాలు ఆంక్షలను, యుద్ధాలను ప్రోత్సహిస్తాయన్నారు. కార్యక్రమంలో అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కె.యాదవరెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డిడ్డి. సుధాకర్, కె.వి.ఎల్, ఇప్సో రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాచం సత్యనారాయణ, సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.జి.వినోద్ రెడ్డి, సయ్యిద్ అజీజ్ పాషా, పల్లా వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు హాజరయ్యారు.


పల్లబ్ సేన్ గుప్తాను సత్కరిస్తున్న దృశ్యం

నేత్రపర్వం.. అమ్మవారి అవభృత సంబురం


అవభృత స్నాన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ ఆలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు రథ సప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని రథంపై ఊరేగించిన అనంతరం ఆ తెల్లవారి నిర్వహించే అవభృత స్నానం వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఆలయ ఆవరణలో పుష్కరిణిలో పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తుల జయజయ ధ్వానాల నడుమ అర్చకులు ఈ సంప్రదాయ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. నగర నలుమూలల నుంచి ఆలయానికి విచ్చేసిన భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు.

సన్మానం


విజయారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పంజగుట్ట: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి వరించిన ఖైరతాబాద్ కార్పొరేటర్‌ను ఆదివారం స్థానిక కాంగ్రెస్ నేతలు ఘనంగా సత్కరించారు. రామకృష్ణానగర్, ఎర్రమంజిల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎర్రమంజిల్ మహిళా మండలిలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విజయారెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో తనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చిన టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయనని తప్పకుండా పార్టీ అధికారంలోకి తెచ్చేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున విజయారెడ్డి సమక్షంలో యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అన్నదానం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ దర్గా వద్ద స్థానిక మైనార్టీ నేత అష్రఫ్ నిర్వహించిన గ్యార్వీ షరీఫ్ వేడుకలకు హాజరైన ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత మధుకర్ యాదవ్, భిక్షపతి పాల్గొన్నారు.

పాదచారుల ఐలాండ్ల వద్ద 'బోర్డు'ల ఏర్పాటు

బంజారాహిల్స్: పాదచారుల భద్రతకు పెద్ద పీట వేస్తూ నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్‌బాబు ఇటీవల బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్ నగర్, పంజగుట్ట సోమాజిగూడ జంక్షన్లలో పర్యటించి స్థానిక ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగానే బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు చౌరస్తాలో విశాలంగా ఉన్న పాదచారులు వేచి ఉండే ఐలాండ్‌ను మరింతగా తీర్చిదిద్దాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజును కోరారు. ఈ ఐలాండ్ కేవలం పాదచారులు వేచి ఉండటానికి మాత్రమేనని తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ అదనపు కమిషనర్ సూచనల మేరకు ఆదివారం కేబీఆర్ పార్కు చౌరస్తాలో పాదచారులు వేచి ఉండే స్థలం అనే బోర్డులను ఐలాండ్‌లో ఏర్పాటు చేశారు. అలాగే టీవీ9 చౌరస్తాలో కూడా వీటిని ఏర్పాటు చేయాలని కోరిన నేపథ్యంలో త్వరలోనే అక్కడ కూడా ఐలాండ్‌లో మరింతగా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. జూబ్లీహిల్స్ చౌరస్తాలో కూడా ఇప్పుడున్న ట్రాఫిక్ ఐలాండ్‌ను పాదచారుల కోసం మరింత అభివృద్ధి చేయాలని సూచించారు.


కేబీఆర్ పార్కు జంక్షన్‌లో సూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విద్యార్థులు ఇష్టంగా చదవాలి

శ్రీనగర్‌కాలనీ: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే మెదడుకు చేరుతుందని, చిన్నారులతో తల్లిదండ్రులు కొంత సమయాన్ని కేటాయించాలని హైదరాబాద్ ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ డాక్టర్ ఎల్.రామ్‌జీరావు అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో క్వీన్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్, ప్రిసమ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు బ్లూమీ బ్లాసమ్ పేరుతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు అతిథిగా హాజరైన హీరో సుధీర్‌బాబు విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కళారంగాల్లో రాణించాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అతిథులు నంద్యాల రామకృష్ణ డిగ్రీకాలేజీ చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, గ్రీన్‌వే ఇంటర్నేషన్ ఫౌండేషన్ చైర్మన్ కేఎల్ నారాయణ, విద్యావేత్త మజీబ్ బహుమతులు అందజేశారు. స్కూల్ చైర్మన్ రామలింగం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


క్వీన్స్, ప్రిసమ్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

రోజుల తరబడి నిరీక్షణ

- ఇబ్బందుల్లో స్థానికులు, వాహనదారులు
- పనులు ఆలస్యం అవుతండటంతో సమస్యలు తీవ్రం
- బంజారాహిల్స్ రోడ్ నెం. 14లో రోడ్డు తవ్వి పది రోజులు దాటినా లేని పురోగతి

బంజారాహిల్స్: ప్రజలకు గుంతలమయమైన రోడ్ల నుంచి విముక్తి కలిగించేందుకు జీహెచ్ఎంసీ లక్షలాది రూపాయలు వెచ్చిస్తూ పనులు ప్రారంభిస్తున్నది. అయితే ఆర్భాటంగా ఈ పనులు ప్రారంభించినా పురోగతి మాత్రం కనిపించడం లేదు. ఎక్కడికక్కడ రోడ్లను తవ్వేసి రోజుల తరబడి వాటి ఊసే ఎత్తడం లేదు. ఫలితంగా రోడ్డు తవ్వేసిన తర్వాత నాలుగైదు వారాల పాటు స్థానికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఎంచుకుంటూ చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ఈ సమస్య గడచిన నాలుగైదేళ్లుగా కనిపిస్తున్నది. ఎక్కడికక్కడ నిధులు మంజూరు అవుతున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. నిబంధనల ప్రకారం సీసీ రోడ్డు వేసే ముందు బీటీ రోడ్డు తవ్వేసి వారం రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. మరో పది రోజుల్లో సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలి. ఇటీవల బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం అప్పటికే ఉన్న రోడ్డును తవ్వేశారు. పనులు మాత్రం ప్రారంభించలేదు. ఫలితంగా స్థానికులు చెత్తాచెదారాన్ని రోడ్డుమీదే వేస్తున్నారు. దీనికి తోడు తవ్విన రోడ్డులో మురుగు పారుతున్నది. అపరిశుభ్రతతో స్థానికులు నరకాన్ని చవి చూస్తున్నారు. బంజారాహిల్స్‌రోడ్ నెం. 14 ప్రధాన రహదరిలో రూ. 28 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనుల కోసం రోడ్డును తవ్వి 13 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు పనులే ప్రారంభం కాలేదు. ఇక్కడ వన్‌వేలో వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చవి చూస్తున్నారు. తవ్విన రోడ్డులో మురుగు లీకవుతూ సమస్య మరింత పెరుగుతున్నది.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకే...

- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17, జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో బీటీ, సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన తర్వాత ఆ పనులుముందుకు సాగుతున్నాయా లేదా అన్న విషయాన్ని ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. అయితే ఈ రెండు సర్కిళ్లలో మాత్రం పనుల పురోగతిపై ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు ఇష్టానుసారంగా పనులు సాగదీసుకుంటూ వెళ్తున్నారు. ప్రజల అవస్థలను పట్టించుకోవడం లేదు. జీహెచ్ఎంసీలో విజిలెన్స్ విభాగం నీరుగారిపోయింది. రోడ్డు వేసిన తర్వాత నాణ్యతను పరిశీలించడం కూడా కొన్నేళ్లుగా పక్కనపెట్టినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు పనులు ప్రారంభమైన తర్వాత వివిధ దశల్లో పర్యవేక్షించాల్సిన క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు అటు వైపు తొంగిచూడటం లేదు. అందినకాడికి దండుకుంటూ చేతులెత్తేస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బడా బాబులు వెళ్లేదారిలోనే...

- జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ తదితరులు నివాసం ఉంటారు. అయితే ఈ సర్కిల్ పరిధిలోనే రోజుల తరబడి రోడ్డు పనులు సాగుతూ పోతున్నాయి. ఉన్నతాధికారుల నిఘా ఉంటుందన్న భయం కూడా జీహెచ్ఎంసీ ఇంజినీర్లలో పూర్తిగా కరువైంది. ఏ ఒక్కరు పట్టించుకోకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతున్నట్లుగా విమర్శలు వినిపిస్తున్నాయి.


బంజారాహిల్స్ రోడ్ నెం. 14లో తవ్వేసిన రోడ్డులో వ్యర్థాలు తొలగిస్తున్న సిబ్బంది


బంజారాహిల్స్ రోడ్ నెం. 2 ఇందిరానగర్‌లో తవ్వేసిన సీసీ రోడ్డు

క్లుప్తంగా...

నేడు, రేపు ఏపీ సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటన

- 'ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్'లో పాల్గొననున్న ఏపీ ముఖ్యమంత్రి



సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 30, 31 తేదీల్లో ఢిల్లీలో పర్యటించనున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 6.45 గంటలకు ఢిల్లీ చేరుకుని 1 జన్‌పథ్ నివాసంలో రాత్రికి బసచేస్తారు. మంగళవారం ఉదయం 10.30 నుంచి 5.30 గంటల వరకు ఢిల్లీ లీలా ప్యాలెస్ హోటల్లో దౌత్యవేత్తలతో జరగనున్న ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్ రౌండ్ టేబుల్ సమావేశం-కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం 6.05 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 8.50 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

తీరంలో అలజడి

- నేడు వాయుగుండంగా మారనున్న తీవ్ర అల్పపీడనం



సాక్షి, విశాఖపట్నం/వాకాడు (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా వాకాడు తీరంలో భీకర శబ్దాలతో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతం, తూర్పు భూమధ్యరేఖ ప్రాంతం మీదుగా ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం మధ్య ట్రోపోస్ఫిరిక్ స్థాయి వరకు విస్తరించి ఉంది. తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. అనంతరం నైరుతి బంగాళాఖాతం మీదుగా నెమ్మదిగా పయనిస్తూ ఫిబ్రవరి 1 నాటికి శ్రీలంక తీరానికి చేరుకుంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి నివేదికలో తెలిపింది. దీని ప్రభావంతో సోమవారం నుంచి మూడు రోజుల పాటు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో ఆదివారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరంలో ఈదురు గాలులు వీస్తుండగా.. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దీంతో సముద్రం దాదాపు 5 మీటర్ల వరకు ముందుకు చొచ్చుకొచ్చి తీరాన్ని తాకుతోంది.

'గల్ఫ్' వలసలపై ఆరా!

బడ్జెట్‌కు ముందు సర్కారు కసరత్తు ● వివరాలు సేకరిస్తున్న ఇంటెలిజెన్స్ విభాగం



మోర్తాడ్ (బాల్కొండ): గల్ఫ్ దేశాలకు కార్మికుల వలసలపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం వివరాలు సేకరిస్తోంది. 2018 నుంచి ఇప్పటివరకు ఏ సంవత్సరం ఎంతమంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారనే వివరాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించనున్న తరుణంలో ఈ ప్రక్రియ చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి అధికంగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోని కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో, పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల గెలుపు ఓటములపై గల్ఫ్ వలసలు ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. వలస కార్మికుల సంక్షేమానికి ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేసింది. ఆయన మరణం తర్వాత గల్ఫ్ వలస కార్మికుల గురించి పట్టించుకున్నవారు లేరని విమర్శలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం సమయంలోనూ గల్ఫ్ వలస కార్మికుల అంశం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ఉద్యమంలో కార్మికుల కుటుంబాలు చురుగ్గా పాల్గొన్నాయి. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా గల్ఫ్ వలస కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కేరళ తరహాలో ప్రవాసీ విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేయాలని లేదా గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మొదటి నుంచీ వినిపిస్తోంది. కాగా 2019 అక్టోబర్‌లో కూడా పంచాయతీ రాజ్ శాఖ ఇదే అంశంపై వివరాలను నమోదు చేసింది. కానీ అప్పట్లో ఆ ప్రక్రియ అర్ధంతరంగా ఆగిపోయింది. త్వరలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న తరుణంలో మరో సారి వలస కార్మికుల లెక్కల విషయంలో సర్కారు దృష్టి సారించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వలస కార్మికుల వివరాలు సేకరిస్తున్న విషయం తమ దృష్టికి కూడా వచ్చిందని గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు మంద భీంరెడ్డి తెలిపారు. ప్రభుత్వం వద్ద కచ్చితమైన లెక్కలు ఉంటే వలస కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఉమ్మడి జిల్లాల వారీగా వలస కార్మికుల వివరాలు..
(వలస కార్మికుల సంఘాల అంచనాల ప్రకారం)

జిల్లా పేరు	వలస కార్మికుల సంఖ్య
హైదరాబాద్	4,50,000
కరీంనగర్	3,10,000
నిజామాబాద్	2,90,000
ఆదిలాబాద్	1,85,000
మెదక్	1,00,000
వరంగల్	80,000
మహబూబ్‌నగర్	30,000
నల్లగొండ	25,000
ఖమ్మం	20,000
రంగారెడ్డి	20,000
మొత్తం	15,10,000




చెర్వుగట్టు ఆలయం వద్ద భక్తజన సందోహం. (ఇన్‌సెట్లో) కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకుడు →

కమనీయం.. రామలింగేశ్వరుడి కల్యాణం

- చెర్వుగట్టులో భక్తజన సందోహం

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ప్రధాన ఆలయం నుంచి స్వామి అమ్మవారిని నంది వాహనంపై మంగళవాయిద్యాలు, భజనల మధ్య కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. వేద పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్యశాస్త్రి, నీలకంఠశివాచార్య, ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సురేశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ తంతు జరిపించారు. స్వామి వారికి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి నూతన పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి దాదాపు లక్ష మంది భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

'తెలంగాణ తరహా పాలన కావాలంటున్నారు'

బోధన్/నిర్మల్: మహారాష్ట్ర ప్రజలు తెలంగాణ తరహా సంక్షేమ పాలన కావాలని కోరుతున్నారని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 5న నిర్వహించే బీఆర్ఎస్ సభాస్థలిని ఆదివారం ఆయన పరిశీలించారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాల మల్లు, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఆయన వెంట ఉన్నారు. సభాస్థలంలో వేదిక, పార్కింగ్ ప్రదేశాలు, బారికేడ్ల ఏర్పాటు పనుల ప్రగతిని మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ ప్రముఖులు బీఆర్ఎస్‌తో కలసి పనిచేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు.

వట్టి వసంతకుమార్ కన్నుమూత



భీమడోలు/ఆరిలోవ/ ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వట్టి వసంతకుమార్ (70) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆయన 4 రోజుల క్రితం విశాఖపట్నంలోని అపోలో ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు పిల్లలు లేరు. భార్య ఉమాదేవి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, పీహెచ్‌డీ చేసిన వట్టి వసంతకుమార్ అదే విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరుడు, సహచరుడిగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక భూమిక పోషించారు. 2004, 2009 ఎన్నికల్లో ఉంగుటూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రిగా పనిచేశారు. వైఎస్సార్ మృతి తర్వాత పరిణామాలకు కలతచెందిన ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. కాగా వట్టి వసంతకుమార్ మృతి పట్ల ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

'రాజకీయ స్వార్థం కోసమే బీఆర్ఎస్'



సాక్షి, హైదరాబాద్: రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ పార్టీ పని చేస్తుంది తప్ప.. ప్రజా ప్రయోజనాల కోసం కాదని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆదివారం వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు టీడీపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ చెప్పేదొకటి.. చేసేది ఒకటిగా ఉందని విమర్శించారు.



విద్యుత్ కోతలపై రైతులు ఆగ్రహించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి, ఐనవోలు, వరంగల్ జిల్లా నెక్కొండ, గీసుకొండ, సంగెం మండలాల్లో ఆందోళనలు చేపట్టారు. నెక్కొండ మండలం అలంకానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై ఆదివారం ఇలా ధర్నాకు దిగారు.

నగర వార్తలు

కళాశాలల అధ్యాపకుల బదిలీలు చేపట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంటర్, పాలిటెక్నికల్, గురుకుల కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం (టీడీఎల్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్‌కుమార్ ఆదివారం పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా బదిలీలు, పదోన్నతలు లేనందున అధ్యాపకులుగా పని చేస్తున్న భార్య, భర్తలు అనేక సమస్యలను ఎదుర్కొంటు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల ఉపాధ్యాయుల మాదిరి కళాశాలల అధ్యాపకులకు కూడా బదిలీలకు, పదోన్నతులకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

బైక్ దొంగ దొరికాడు

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న నిందితుడిని ఎల్బీనగర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఏపీలోని నంద్యాలకు చెందిన గడ్డం హుస్సేన్ రెడ్డి క్రేన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన జల్సాలకు డబ్బు అవసరం అయితే బైక్‌లను దొంగిలించి సెకండ్ హ్యాండ్‌లో అమ్మేవాడు. ఈ క్రమంలో ఎల్బీనగర్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి సార్వీ బేదార్కర్ ఓ రోజు కామినేని ఆసుపత్రి ముందు బైక్‌ను పార్కింగ్ చేసి లోపలికి వెళ్లాడు. తిరిగొచ్చి చూసేసరికి తన బైక్ కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు తన ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారని ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుడు హుస్సేన్‌ను అరెస్టు చేశారు. రూ.5 లక్షలు విలువ చేసే తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే హుస్సేన్‌పై ఎల్బీనగర్, చైతన్యపురి, మీర్‌పేట, ఉప్పల్, గద్వాల్‌లోని ఉండవల్లి ఠాణాలలో కేసులున్నాయి.

ఉత్సాహంగా సైక్లథాన్



మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్ వద్ద గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సైక్లథాన్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సెఫ్టీ స్టాండర్డ్స్ అథారిటి ఆఫ్ ఇండియా సీఈఓ జి.కమల వర్ధనరావు మాట్లాడుతూ కాలుష్యం తగ్గించేందుకు సైక్లింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చిన్న వయస్సు నుంచే పిల్లలకు సైక్లింగ్ అలవాటు చేయాలన్నారు. ఈ పోటీలలో భాగంగా 5కె, 10కె, 25కె, 50 కిలోమీటర్లు, 100 కిలోమీటర్ల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీవీ మనోహర్, వరల్డ్ సైక్లింగ్ అలయన్స్ ప్రెసిడెంట్ సర్‌గ్రాహం వాట్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఇక రేషన్ షాపుల ద్వారా బ్యాంకింగ్ సేవలు

- డీలర్లకు బిజినెస్ కరెస్పాండెంట్లుగా అవకాశం
- పౌరసరఫరాల శాఖతో ఐపీపీబీ ఒప్పందం
- త్వరలో రేషన్ డీలర్లకు బ్యాంకింగ్ సేవలపై శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: ఇక ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా బ్యాంకింగ్ సేవలు అందనున్నాయి. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) రేషన్ దుకాణాల ద్వారా బేసిక్ సేవలు అందించేందుకు ముందుకు వచ్చింది. ఇప్పటికే పౌరసరఫరాల శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో రేషన్ సరుకులను అందించే దుకాణాలు ఐపీబీబీ సేవా కేంద్రాలుగా మారనున్నాయి. రేషన్ డీలర్ల ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చేందుకు సులభమైన, సురక్షితమైన పద్ధతిలో డిజిటల్ లావాదేవీలకు పౌరసరఫరా శాఖ పచ్చజెండా ఊపినట్లయింది.

బిజినెస్ కరస్పాండెంట్లుగా డీలర్లు

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెట్లుగా రేషన్ డీలర్లకు లైసెన్స్‌లు జారీ చేయనుంది. ప్రతి బ్యాంకింగ్ సేవలపై ఐపీపీబీ కమీషన్లను కూడా అందించనుంది. ఇప్పటికే బిజినెస్ కరస్పాండెట్లుగా పనిచేసేందుకు ఆసక్తి కనబర్చే రేషన్ డీలర్ల వివరాలను బ్యాంక్ అధికారులు సేకరిస్తున్నారు. త్వరలో బ్యాంకింగ్ సేవలపై డీలర్లకు అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు.

ఆధార్-ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్

రేషన్ దుకాణాల వద్దకు అధిక సంఖ్యలో జనం వచ్చే అవకాశాలున్నందున బ్యాంకింగ్ లావాదేవీలకు కేంద్ర బిందువులుగా మారే అవకాశం ఉందని ఐపీపీబీ భావిస్తోంది. ఏదైనా బ్యాంకు ఖాతాదారులు రేషన్ దుకాణానికి వస్తే డబ్బు జమ,విత్ డ్రా సేవలు అందే విధంగా చర్యలు చేపడుతోంది. ఆధార్-ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీ ఎస్) లావాదేవీలపై ప్రధాన దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.రేషన్ దుకాణాలల్లో అధునిక ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ (ఈ-పాస్) పరికరాలోనే ఐపీపీబీ సేవల సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేయనున్నారు. ఆర్థిక సేవలతో పాటు బీమా ఇతరాత్ర సేవలు సైతం అందించే విదంగా వెసులుబాటు కల్పిస్తున్నారు.

గ్రేటర్‌లో 2,301 దుకాణాలు

గ్రేటర్ పరధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో సుమారు 2.301 ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు ఉన్నాయి.అందులో హైదారబాద్‌లో 690, మేడ్చల్ జిల్లాలో 636, రంగారెడ్డి జిల్లాలో 975 రేషన్ షాపులు ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆహార భద్రత కార్డులు కలిగిన స్థానిక, స్థానికేతర 20 లక్షల కుటుంబాలు ప్రభుత్వ చౌకధరల దుకాణాల నుంచి సరుకులు డ్రా చేస్తుంటారు.

చెరువులపై కెమెరా కన్ను

- 179 చెరువుల వద్ద 1170 సీసీ కెమెరాలు
- ఏర్పాటు చర్యల్లో జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో దాదాపు 185 చెరువులుండగా వాటిల్లో 179 చెరువుల వద్ద నిఘా ఏర్పాట్లకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. పలు చెరువు స్థలాలు కబ్జాలకు గురవుతుండటంతో పాటు చెరువుల్లోనే వివిధ వ్యర్థాలను కుమ్మరిస్తుండటంతో చెరువులు కాలుష్యకాసారాలుగా మారుతున్నాయి. గృహవ్యర్థాలే కాకుండా వాటిల్లో భవన నిర్మాణ వ్యర్థాలు తదితరమైనవి కుమ్మరిస్తున్నారు. వాటితో నిండిపోవడంతో వర్షాలొచ్చిన సమయంలో చెరువుల్లో నీరు నిలిచే దారి లేక పరిసర ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఇప్పటికే చెరువుల ప్రక్షాళన, సుందరీకరణ పనులకు సిద్ధమైన యంత్రాంగం చెరువుల్లో వ్యర్థాల కుమ్మరింత నిరోధించడంతోపాటు అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు రక్షణ చర్యలకు సిద్ధమైంది. అందులో భాగంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు సిద్ధమైంది. చెరువు విస్తీర్ణం తదితరమైనవి పరిగణనలోకి తీసుకొని ఒక్కో చెరువు వద్ద ఒక సీసీటీవీ కెమెరానుంచి 17 సీసీటీవీ కెమెరాల వరకు మొత్తం 1170 కెమెరాలను ఏర్పాటు చేయనుంది.

ఉల్లంఘనులకు జరిమానాలు..

సీసీటీవీ కెమెరాల ఫీడ్ ద్వారా భవననిర్మాణ వ్యర్థాలు, చెత్త తదితరమైనవి చెరువుల్లో వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించే యోచనలోనూ ఉన్నారు. కెమెరాల ఏర్పాటు తర్వాత ఈ చర్యలు తీసుకోనున్నారు.

జోన్లవారీగా వివరాలిలా ఉన్నాయి.

ఎల్‌బీనగర్	చెరువులు	సీసీటీవీ కెమెరాలు
ఎల్‌బీనగర్	20	153
శేరిలింగంపల్లి	69	318
చార్మినార్	25	142
కూకట్‌పల్లి	42	383
ఖైరతాబాద్	19	142
సికింద్రాబాద్	04	32
మొత్తం	179-	1170

దొంగ సాధువు మళ్లీ దొరికాడు

6 గంటల్లో పట్టుకున్న ఎల్బీనగర్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నరదృష్టి పూజలు చేస్తానని నమ్మించి నిలువెల్లా మోసం చేస్తున్న సీరియల్ దొంగ బాబాను రాచకొండ పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. ఎల్బీనగర్ డీసీపీ సాయి శ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. బంగారం ఆభరణాలు చోరీ చేసిన 6 గంటల వ్యవధిలో నిందితులను పట్టుకున్నారు రాచకొండ పోలీసులు. వీబూడీ రాములు నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వీబూడీ రాములు మీర్‌పేటలో స్థిరపడ్డాడు. ఇతను గతంలో నల్లగొండ దిండి, రాచకొండ సరూర్‌నగర్ పోలీసు స్టేషన్లలో ఇదే తరహా కేసులలో అరెస్టయ్యాడు. ఇటీవల బెయిల్ మీద బయటికి వచ్చిన రాములు పూనుకున్నాడు. ఎల్బీనగర్‌లోని హస్తినాపురం కాలనీకి చెందిన చీకట్ల వీరలక్ష్మి ఇంట్లోకి సాదువు లాగా వేశం వేసుకొని ప్రవేశించిందాడు. బాధితురాలి కుటుంబానికి నరదృష్టి ఉందని పూజలు చేయాలని నమ్మించాడు. బియ్యం, నీళ్లు, గిన్నె తీసుకురావాలని సూచించాడు. నిజమేనని నమ్మిన బాధితురాలు అవన్నీ తీసుకురాగా.. బియ్యం గిన్నెల పుత్తెలతాడు పెట్టమని చెప్పాడు. దీంతో రూ.40 వేలు విలువ చేసే ఆరు గ్రాముల బంగారం ఆభరణాలు ఆ గిన్నెలో పెట్టింది. పూజ చేసేందుకు పసుపు తీసుకు రమ్మని బాధితురాలికి సూచించాడు. ఆమె ఇంటిలో పలికి వెళ్లగానే పుస్తలతాడుతో దొంగ స్వామి అక్కడ్నుంచి ఉడాయించాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎల్బీనగర్ పోలీసులు, ఎస్ఓటీ ఎల్బీనగర్ టీం నిందితుడు రాములును అరెస్టు చేశారు.

'గాంధీజీ హంతకుడు' పుస్తకం ఆవిష్కరణ



సుందయ్య విజ్ఞాన కేంద్రంలో గాంధీజీ హంతకుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ తిరుమలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ కవి ధీరేంద్ర కే.ఝూ రచించిన గాంధీజీ హంతకుడు పుస్తకాన్ని ఆదివారం నవతెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ఎస్‌వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ అనువాదం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ గాడ్సే జీవితం, ఆలోచనలు, అనుబంధాలకు సంబంధించిన గాంధీస్ అసాసిన్ పుస్తకాన్ని తెలుగులో అనువాదం చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి పుస్తకాలు సమాజాన్ని ఆలోచింపజేస్తాయని సూచించారు. ప్రముఖవిద్యావేత్త కె.ఆనందచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుడిపూడి విజయరావు, కొండూరు వీరయ్య, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ జనరల్ మెనేజర్ ఆర్.వాసు, మేనేజర్ డి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నిమ్స్ డైరెక్టర్ తప్పుదారి పట్టించారు'

లక్డీకాపూల్ : నిమ్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై డైరెక్టర్ ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించారని నిమ్స్ టెక్నికల్-నాన్ టెక్నికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్‌సింగ్, రమేష్ బాబు ఆరోపించారు. కోర్టు తీర్పు ఇచ్చినప్పటికి 29 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి కుంటిసాకులు చెపుతూ.. తనకు అనుకూలమైన నలుగురిని పర్మినెంట్ చేయడానికి ఫైల్ మూవ్ చేయడాన్ని ఆక్షేపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సింగ్, రమేష్‌లు యూనియన్ సర్వసభ్యసమావేశం తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. గత ఏడాది ఆగస్టులో ఇచ్చిన కోర్టు తీర్పు మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అన్ స్కిల్డ్ వేతనంపై సెమీ స్కిల్డ్ విధులను నిర్వహిస్తున్న వారికి పదోన్నతులు,, పదవి విరమణ చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. గాడితప్పిన ఆస్పత్రి పరిపాలను చక్కదిద్దుతున్న ప్రస్తుత ఇంఛార్జి డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పకు పూర్తి బాధ్యతలు అప్పగించాలని యూనియన్ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు.

సామాజిక సేవకు స్ఫూర్తి చింతపట్ల పండితరావు



అంబర్‌పేట: సమాజసేవకు స్ఫూర్తినిచ్చిన మహానీయుడు చింతపట్ల పండితరావు అని ఎమ్మెల్సీ మధుసుదనాచారి తెలిపారు. పండితరావు 90వ జయంతి సందర్భంగా ఆయన స్మారకార్థం పోస్టల్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన పోస్టల్ స్టాంప్‌ను ఆయన ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మదుసుధనాచారి మాట్లాడుతూ.. పండితరావు సమాజానికి అందించిన సేవలు నేటితరానికి తెలియజేసేందుకే ఈ పోస్టల్ స్టాంపు విడుదల నిదర్శనమన్నారు. తెలంగాణ విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన ట్రస్ట్ చైర్మన్ లాల్‌కోట వెంకటాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, శివప్రసాద్, భాస్కర్, సంఘమేశ్వర్‌రావు, పండితరావు కుటుంబసభ్యులు, శ్రీధర్‌రావు, సురేష్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మారథాన్

ఖైరతాబాద్: కలింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, కలింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఆదివారం నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో మారథాన్ నిర్వహించారు. 1కె, 2కె, 5కె విభాగాలుగా నిర్వహించిన మారథాన్‌ను ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటు ప్రతి ఒక్కరు క్రీడల్లో రాణించాలని, విద్యను అందరికి అందేలా తల్లి దండ్రులు చొరవ చూపాలన్నారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో పాటు సోషల్ వెల్ఫేర్ కళాశాలల విద్యార్థులు, మారథాన్ క్లబ్ సభ్యులు, డాక్టర్లు పాల్గొన్నారు. మారథాన్‌లో పాల్గొన్న వారికి మెడల్స్ అందజేశారు.



మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు..

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 30-1-2023

సన్నిధి

సందర్భం - నేడు మహాత్మా గాంధీ వర్ధంతి

ప్రార్థన
ఆత్మశుద్ధికి మార్గం



గాంధీమహాత్ముని ఒక రాజకీయనేతగా కాకుండా సత్యాన్వేషకునిగా పరిశీలిస్తే ఎన్నో అద్భుత విషయాలు అవగతమవుతాయి. మతం పట్ల ఆయన అభిప్రాయాలు నిజంగా ఎంత ఉన్నతమైనవో తెలుపుతాయి. 'అసలైన మతం సంకుచితమైనది కాదు. అది భౌతికమైన పరిశీలనకు సంబంధించినది కాదు. అది పరమాత్ముడిపైన ఉండే విశ్వాసం, ఆయనతోనే ఉండేది. అంటే భవిష్యత్తు మొత్తం సత్యం, అహింసలపై శ్రద్ధ కలిగించేది. అది హృదయానికి సంబంధించినది'. ఇదీ మతమంటే మహాత్ముడి భావన. సామరస్యపూర్వక బంధంతో మనిషికి మనిషికి మధ్య ఐక్యతను కలిగివుండడమే గాంధీజీ చెప్పే మతం. అందువల్ల సిక్కు, హిందువు, క్రిస్టియన్, ముస్లిం, బౌద్ధులు...ఇలా ఏ మతం వారైనా ఒకరు ఎక్కువ అనే ఉన్నత భావం, మరొకరు తక్కువ అనే న్యూనతాభావం కూడదని ఆయన చెప్పేవారు.

రఘుపతి రాఘవ రాజారాం, పతిత పావన సీతారాం, ఈశ్వర్ అల్లా తేరోనామ్, సబ్‌కో సన్మతి దే భగవాన్... ఇది మహాత్ముడికి అత్యంత ప్రీతికరమైన ప్రార్థన. తరచుగా ఆయన నోట వినిపించే అమృత పదాలు.

మనిషిని పరమాత్ముని దృష్టిలోకి తీసుకొచ్చేవి ప్రేమ, సత్యమేనని ఆయన అనేవారు. మానవత్వం కలిగిన మనిషికి, దేవుడికి భేదం లేదని చెప్పేవారు.

సత్యమే దైవం

సత్యాన్ని పరమాత్ముని రూపంగా ఆయన ఎందుకు భావించారో కూడా వివరించారు. 'నా అభిప్రాయం ప్రకారం సత్యమే అన్నింటికంటే గొప్పది. అందులో అనేక విషయాలు నిక్షిప్తమై ఉంటాయి. ఇక్కడ సత్యం అంటే వాక్సత్యం ఒక్కటే కాదు. భావానికి సంబంధించినది కూడా. ఇది కల్పిత సత్యం కాకుండా సుస్థిరత కలిగిన స్వతంత్రమైన ఆస్తిత్వం గల సత్యం. అంటే సాక్షాత్ పరబ్రహ్మమన్నమాట' సత్యంలో భగవంతుడిని ఆయన చూసినంత నిశితంగా మరొకరు పరికించి ఉండరు. సత్యానికి ఆయన ఇచ్చినంత ప్రాముఖ్యం వేరొకరు ఇవ్వలేదు.

ప్రార్థన మానవత్వానికి పిలుపు. ఆత్మశుద్ధికి మార్గం. మనలోని బలహీనతలను గుర్తించే ప్రక్రియే ప్రార్థన. శరీరానికి ఆహారం ఎంత అవసరమో మనసుకు ప్రార్థన అంతే. ప్రార్థన అంటే కేవలం పెదవులతో ఉచ్చరించేదే కాదు. ఎలాంటి భేదభావాలు, తారతమ్యాలకు తావివ్వకుండా హృదయ ప్రక్షాళన కోసం ప్రార్థన చేయాలి. ప్రార్థన అంటే కళ్లు మూసుకుని ధ్యానం చేస్తూ కూర్చోవడం కాదు. ప్రార్థనకు కావలసింది మనసులేని మాటలు కాదు, మాటలు లేని మనసు. ఇదీ ప్రార్థనపై మహాత్ముడి అభిప్రాయం.

ఎవరి హృదయం నిర్మలంగా ఉంటుందో, ఎవరు తమ లక్ష్యాన్ని దైవంగా భావిస్తారో వారివెంట దైవం ఉంటుంది. సత్యం, ప్రేమ, ధర్మం, నిజాయితీ, నిర్భయం... కలిగి ఉండే వారికి పరమాత్ముని తోడ్పాటు ఎప్పుడూ ఉంటుంది. ఇదే గాంధీతత్వం. దాన్ని అందుకునేందుకు దీక్ష, పట్టుదల, క్రమశిక్షణ... అవసరం.

– తాడేపల్లి శివరామకృష్ణారావు

విజయం
ఓటమి తర్వాత వేకువ

మంచి మాట



ఓటమి ద్వారా వచ్చే విజయం ఉంది! అది ఓటమి నేర్పే పాఠం!! ఓటమి నేర్పే పాఠం ఎంతో ముఖ్యమైంది ఆపై విలువైంది; అది మరే విధంగానూ రాదు. ఓటమి దెబ్బ బలంగా తగిలినా మనిషి పడిపోకుండా నిలబడి ఆ పాఠాన్ని చదవాలి. ఓటమి నేర్పిన పాఠాన్ని సరిగ్గా చదవగలిగిన మనిషికి భవిష్యత్తులో విజయం అందుతుంది; విజయవంతమైన భవిష్యత్తు అందుతుంది.

ఓడిపోయాక శోకిస్తూ ఉండడం సరి కాకపోవడమే కాదు హానికరమైంది కూడా. ఓడిపోయాకైనా గెలవాలి అన్న పట్టుదల కలగాలి. ఆ పట్టుదల ఓటమి తరువాతి జీవనంపై పట్టును ఇవ్వాలి. ఓడిపోవడం నేరం కాదు. ఓడిపోయాక తలదించుకోవాల్సిన అగత్యంలేదు. ఓడిపోతే కుంగిపోకూడదు ఓటమికి లొంగిపోకూడదు. ఓడిపోతే వాడిపోకూడదు, వాడిమిని కోల్పోకూడదు. ఓడిపోయాక మనిషి ఎడారిలో ఒంటరివాణ్ణి అయిపోయానని కృశించిపోతూ ఉండిపోకూడదు; ఎందుకూ కొరగాని వాణ్ణి అయిపోయానని నిస్తేజంగా ఉండిపోకూడదు. ఓడిపోతే నిస్పృహా ప్రభావానికి మ్రాన్పడి చిత్తై పోకూడదు. ఓడిపోయాక, నిస్పృహ ఆవరించాక నిద్రలోంచి లేచినట్లుగా లేవాలి. ఆపై మెలకువను పొందినట్లుగా సత్‌స్పృహను పొందాలి.

ఓడిపోతే కష్టాలొస్తాయి; ఆ కష్టాలలోనే సత్యాలు తెలుస్తాయి. ఆ సత్యాలు ఎంతో ముఖ్యమైనవి.

జీవితం అన్నాక, జీవనం ఉన్నాక ఆశాభంగం తప్పదు. భంగం అయినంత మాత్రాన భాగ్యం భగ్నమైపోదు. ఓడిపోయిన తరువాత నిలదొక్కుకోగలిగిన మనిషి ముందుకు సాగగలడు.

కలిగిన ఓటమికి దెబ్బతిన్నాక గెలవడంపై మనిషికి చైతన్యం రావాలి. ఓటమి గురించి చింత, చింతనలను అధిగమించాలంటే మనిషికి గెలవాలి అన్న చైతన్యం కావాలి, రావాలి. ఆ చైతన్యంతో గెలుపును సుసాధ్యం చేసుకోవాలి.

ఓటమి కలిగాక దాన్ని అర్థం చేసుకుని అంగీకరించాలి. కలిగిన ఓటమికి మనం సాక్ష్యం మాత్రమే అవ్వాలి. అంతకుమించి మనం ఓటమిలో కూరుకుపోకూడదు. భవిష్యత్తులో విజయంలో విలీనం అవ్వాలంటే కలిగిన ఓటమి నుంచి మనల్ని మనం విడిపించుకోవాలి. విజయం సాధించడం ఎలాంటిదో ఓటమి నుంచి విడివడడం కూడా అలాంటిదే. ప్రపంచంలో విజేతలైనవాళ్లలో ఎక్కువ శాతం మంది ఓటమి నుంచి తమను తాము విడిపించుకున్నవాళ్లే.

సూర్యోదయాన్ని పొందుతూ ఉండడం భూమి రోజూ సాధిస్తున్న విజయం. పొంగుతూ, సాగుతూ పారడం నది సాధిస్తున్న విజయం. వీస్తూ ఉండడం గాలికి విజయం.

విజయం అనేది ఒక లక్ష్యమా? కాదు. విజయం అనేది లక్షణం. అవును విజయం అనేది మనిషికి లక్ష్యంగా కాదు లక్షణం గా ఉండాలి. ఓటమి చీకటిలా మూగినప్పుడు కాస్తంత ఓపిక పడితే విజయం వేకువై వచ్చేస్తుంది. ''వేసవికాలం వెంబడించని చలికాలం లేదు'' అన్నారు వివేకానంద. ఓటమి అనే చలికి పట్టుబడి గడ్డకట్టుకుపోకుండా ఉండగలగాలి. చలికాలం తరువాత వేసవి వచ్చేస్తుంది. ఓటమి శోకాన్ని కలిగించినా విజయాన్ని సాధించేందుకు కాలం ఉందని, ఉంటుందని తెలుసుకోవాలి.

విజయం కోసం ఆశపడితే, ఆకాంక్షిస్తే తప్పకుండా మనిషికి అవకాశాలు ఆసన్నం అవుతాయి. వాటిని సఫలం చేసుకుంటే విజయం వస్తుంది. ఆ విజయానికి చిహ్నంగా మనిషి జీవితం వసంతం అవుతుంది.

– రోచిష్మాన్

వసుధైవ కుటుంబకమ్

గురువాణి



''అయంనిజః పరో వేతి గణనా లఘు చేతసామ్/ ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకమ్.''

అందరం ఆకలితో ఉన్నవాళ్ళమే. అన్నం తింటే ఆకలి తీరుతుంది. అందరికీ దాహం వేస్తుంది. నీళ్ళు తాగితేనే అది తీరుతుంది. మనకే కాదు. సమస్త ప్రాణులకూ అంతే... అని భావన చేసినవాడికి, అందరం ఒక్కటే అనుకున్నవాడికి అడ్డుగోడలన్నీ కరిగిపోతాయి.

కుటుంబం అన్నది సమాజంలో ఓం ప్రథమంగా ఏర్పాటయిన వ్యవస్థ. మా అమ్మ, మా నాన్న, నా అన్నదమ్ములు, నా అక్కచెల్లెళ్ళు, మా తాత, మా నాయనమ్మ.. ఇవన్నీ పుట్టుకతో మనం ఎదగడానికి సంస్కృతిని పొందడానికి ఏర్పాటు చేసుకున్న ఊతాలు. అంటే ... పెద్దలు కనబడితే గౌరవం, పిల్లలు కనబడితే దయ, సమానులు కనబడితే ఆదరభావం. ..ఇవన్నీ కలిసి ప్రేమ భావన. సుఖమయినా దుఃఖమయినా కలిసి పంచుకుందాం అన్న సర్దుబాటు, త్యాగం. ఇది కుటుంబం వరకే. అలాకాక కుటుంబంతో సంబంధం లేకుండా సమాజంలో ఎవరు సుఖపడినా మనం సుఖపడినట్లు, ఎవరు బాధపడినా మనమే బాధపడుతున్నట్లు భావించడం ఎవరికి సాధ్యం? అంటే ప్రపంచాన్నే కుటుంబంగా భావించగలిగినవాడికి మాత్రం సుసాధ్యం. ఆయన మహాత్ముడు, గొప్పవాడు, ఆయన ఈ గోడలను కూలగొట్టి బతుకుతున్నవాడు.

ఆ స్థాయికి వెళ్ళిన మహాపురుషుడు శంకర భగవత్పాదులు. ఆయన కాశీ అన్నపూర్ణమ్మ దగ్గరకు వెళ్ళి..'అమ్మా! మూడు లోకాల్లోని సమస్త ప్రాణులూ మీ బిడ్డలేగా.. అన్నం పెట్టు' అన్నాడు. అదీ వసుధైవ కుటుంబకమ్.. ఈ వసుధ, ఈ భూమి మీద ఉన్న వారందరూ, ప్రాణులన్నీ నా కుటుంబమే.. అన్న భావన పొందిన వారు..'ఉదారచరితానాం తు'.. వాళ్ళది ఉదారమైన నడవడిక అంటే.

అపార కీర్తి పొందిన శాస్త్రవేత్త, భారతదేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన అబ్దుల్ కలాం గారు .. ఒకసారి హైదరాబాద్‌లో నిజాం వైద్యశాలలో పోలియో బాధితులైన పిల్లలతో కొద్దిసేపు గడిపి వారిని ఉల్లాసపరచాలని వెళ్ళారు. అక్కడ వారు కాలిపర్స్ సాయంతో నడుస్తూన్నా.. అవి బరువుగా ఉండి వారు ఇబ్బందిపడుతున్నట్లు గమనించి... వెంటనే ఇస్రో కార్యాలయానికి వెళ్ళి శాస్త్రవేత్తలందరినీ సమావేశపరిచారు. అంతరిక్షంలోకి పంపే ఉపగ్రహాలకు వాడే తేలికపాటి లోహంతో కాలిపర్స్ రూపొందించడానికి మేథోమథనం చేసారు. మూడువారాల్లో కేవలం 300 గ్రాములు మాత్రమే బరువున్న కాలిపర్స్‌ను తీసుకొని ఆ ఆస్పత్రి కి వెళ్ళి వారికిచ్చారు. అప్పటివరకు భారీ కాలిపర్స్‌తో ఇబ్బందిపడిన పిల్లలు ఇవి వేసుకుని పొందిన ఆనందాన్ని చూసి ఉబ్బితబ్బిబ్బయిపోయారు. తరువాత కాలంలో ఈ సంఘటనను ప్రస్తావించి 'మిగిలిన వాటన్నింటికంటే.. నా జీవితంలో ఎల్లప్పుడూ జ్ఞాపకం ఉండిపోయే సందర్భం ఇది. అక్కడ పిల్లల సంతోషం చూసి సార్థక్యం పొందాను' అని తెలిపారు... అదీ ఉదారచరితానాం తు..అంటే... వసుధైవ కుటుంబకమ్ అంటే...




బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సకలైశ్వర్య సంపన్నుడు

సువార్త

ఆకాశ వైశాల్యమంతటి క్రింద నున్నదంతయు నాదే గదా! (యోబు 41:11). మన దేవుడు సకలైశ్వర్య సంపన్నుడు. ఆయనది కానిది ఈ విశ్వంలో ఏదైనా ఉందా? నేను తిరిగి ఇయ్యవలసియుండునట్లు నాకెవడైనను ఏమైనను ఇచ్చెనా? అని దేవుడు ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పగలమా?

సమస్తము నావే కదా అని దేవుడు మాట్లాడుతుంటే ఎంత హుందాగా ఉందో కదా! మన దేవునికి కొదువ ఏమీలేదు. ఆయన అందరికి జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైనను కొదువ యున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాడు.



ఒక మనిషి దేవున్ని ఆరాధించుట వలన ఆయనకేదో లాభమని కొందరు భావిస్తుంటారు. దేవుని సేవకు సహకరించుట ద్వారా దేవునికి చాలా గొప్ప ప్రయోజనాన్ని చేకూర్చుస్తున్నామని సంబర పడిపోతుంటారు. దేవుని కార్యాలు చేయడం ద్వారా మనకే ఎక్కువ ప్రయోజనమని గ్రహించాలి. కలిగియున్న దేదియు దేవుడు లేకుండా కలుగలేదు గనుక ఎల్లప్పుడు కృతజ్ఞులమై జీవించాలి. భౌతిక ప్రపంచంలోనైనా, ఆధ్యాత్మిక ప్రపంచంలోనైనా మన దేవుడు సర్వసమద్ధి కలిగినవాడు. సకల చరాచర సృష్టిని తన మహత్తయిన మాటతో సష్టించి తన మహాశ్చర్య జ్ఞానముతో నిర్వహించువాడు. ఈ విశ్వంలో ప్రకృతియే గొప్పదని భావించేవాళ్ళు కొందరున్నారు. ఆరాధనకు యోగ్యుడైన దేవుడు ఈ ప్రకృతికి ఆకృతిని ఇచ్చినవాడు.

పూర్వదినాల్లో మాసిదోనియాలోని ప్రధాన పట్టణాలలో ఒకటిగా పిలువబడే పట్టణం ఫిలిప్పీ.సంపన్నవంతులైన వ్యాపారస్థులు నివసించే ప్రాంతమది. ఆ రాజుల్లో ఎన్నో రకాలైన ఆదాయ మార్గములను ఏర్పరచుకొని డబ్బు సంపాదనలో బిజీగా ఉండే పట్టణమది. అపొస్తలుడైన పౌలు పరిశుద్ధాత్మ నడిపింపుతో సువార్తను ప్రకటించినప్పుడు అనేకులు సువార్తకు లోబడి తమ జీవితాలను ప్రభువుకు సమర్పించుకున్నారు. కొందరు తమ అక్రమ సంపాదనను విడిచి దేవుని సన్మార్గంలో నడవడం ప్రారంభించారు. కొన్నిసార్లు వారు లోకసంబంధులను చూసిననప్పుడు లోలోపల మదనపడియుండవచ్చు. అలాంటివారికి పౌలు భక్తుడు తెలిపిన గంభీర సత్యమిది. ''కాగా దేవుడు తన ఐశ్వర్య చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరము తీర్చును'' (ఫిలిప్పీ 4:19).

– డా॥ జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

సినిమా

కాంబినేషన్ సెట్?



ప్రభాస్



హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో 'బ్యాంగ్ బ్యాంగ్'(2014), 'వార్' (2019), 'పఠాన్'(2023) వంటి సూపర్ హిట్స్ సాధించారు దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్. ఆయన దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ఓ సినిమా రూపొందనుందని, ఈ చిత్రాన్ని మైత్రీమూవీ మేకర్స్‌పై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మించనున్నారనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్‌తో మల్టీ స్టారర్‌గా ఈ మూవీ రూపొందనుందని, ఇందులో ప్రభాస్, టైగర్ ష్రాఫ్‌లు కలిసి నటిస్తారనే టాక్ బాలీవుడ్‌లో వినిపించింది. తాజాగా ఈ సినిమాలో ప్రభాస్, హృతిక్ రోషన్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇక హృతిక్ రోషన్, సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో 2019లో 'వార్' సినిమా వచ్చింది. ప్రస్తుతం వీరిద్దరి కాంబోలో 'ఫైటర్' మూవీ తెరకెక్కుతోంది. ప్రభాస్ కూడా 'సలార్', 'ప్రాజెక్ట్ కె' లతో పాటుగా 'రాజాడీలక్స్'(ప్రకటన రావాల్సి ఉంది) సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రభాస్‌తో పాటు హృతిక్ రోషన్-సిద్ధార్థ్ ఆనంద్‌ల ప్రస్తుత కమిట్‌మెంట్ ప్రాజెక్ట్స్ పూర్తయిన తర్వాతే వీరి ముగ్గురి కాంబినేషన్ సినిమా గురించి ఓ స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

కోలీవుడ్ ఎంట్రీ!



మృణాల్ ఠాకూర్

'సీతారామం'(2022) సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమై తెలుగు ప్రేక్షకుల మనసు గెల్చుకున్నారు బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్. ఈ బ్యూటీకి ఇప్పుడు కోలీవుడ్(తమిళ ఇండస్ట్రీ) నుంచి కబురొచ్చిందట. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో ఓ హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్ రూపొందుతోంది. ఈ సినిమాలో దిశా పటానీ ఓ హీరోయిన్. కాగా ఈ మూవీలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ సన్నివేశాల్లో సూర్య సరసన నటించేందుకు మరో హీరోయిన్‌కి అవకాశం ఉందట. ఈ రోల్‌లోనే మృణాల్ ఠాకూర్ నటించనున్నారని కోలీవుడ్ టాక్. అంతేకాదు.. ఫిబ్రవరిలో ఈ సినిమా సెట్స్‌లో మృణాల్ జాయిన్ అవుతారనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రం ఖరారు అయితే కోలీవుడ్‌లో ఆమెకు ఇదే తొలి ప్రాజెక్టు అవుతుంది. కాగా తెలుగులో నాని హీరోగా నటించనున్న ఓ కొత్త సినిమాలో మృణాళ్ హీరోయిన్‌గా నటించనున్న సంగతి తెలిసిందే.

4 రోజులు.. 400 కోట్లు



షారుక్‌ఖాన్

బాలీవుడ్ బాక్సాఫీస్ రికార్డ్స్‌ను తిరగ రాస్తున్నాడు 'పఠాన్'. షారుక్‌ఖాన్ హీరోగా సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన స్పై (గూఢచారి) మూవీ 'పఠాన్'. దీపికా పదుకొనే హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జాన్ అబ్రహాం కీలక పాత్ర చేయగా, హీరో సల్మాన్‌ఖాన్ అతిథి పాత్రలో నటించారు. దాదాపు 250 కోట్ల బడ్జెట్‌తో ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. కాగా, 'పఠాన్'కు విశేష ప్రేక్షకాదరణ దక్కుతున్నట్లు ఈ సినిమా బాక్సాఫీస్ లెక్కలు చెబుతున్నాయి. సినిమా విడుదలైన నాలుగు రోజుల్లోనే 429 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించినట్లు 'పఠాన్' యూనిట్ ఆదివారం వెల్లడించింది. ''పఠాన్' విడుదలైన నాలుగు రోజుల్లోనే వేగంగా 400కోట్లకుపైగా కలెక్షన్స్ సాధించిన హిందీ చిత్రంగా నిలిచింది. ఇండియాలో 265 కోట్ల రూపాయలు, ఓవర్ సీస్‌లో 164 కోట్ల రూపాయాల వసూళ్లు సాధించింది'' అని యూనిట్ పేర్కొంది. 'పఠాన్' విడుదలైన ఐదోరోజు (జనవరి 29, ఆదివారం) వీకెండ్ కావడంతో కలెక్షన్స్ మరింత పెరుగుతాయని, అతి త్వరలోనే ఈ సినిమా ఐదు వందల కోట్ల క్లబ్‌లో చేరుతుందని విశ్లేషిస్తున్నాయి ట్రేడ్ వర్గాలు. అలాగే హిందీలో అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా కూడా 'పఠాన్' నిలుస్తుందని కొందరు ట్రేడ్ వర్గీయులు అంటున్నారు.

యాక్షన్ డ్రామా

కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ నటించిన తాజా చిత్రం 'వేద'. ఎ.హర్ష దర్శకత్వం వహించారు. శివ రాజ్‌కుమార్ భార్య గీతా శివ రాజ్‌కుమార్ నిర్మించిన ఈ సినిమా గత డిసెంబరు 23న కన్నడలో విడుదలైంది. ఈ చిత్రాన్ని 'వేద' పేరుతోనే కంచి కామాక్షి కలకత్తా క్రియేషన్స్ పతాకంపై వీఆర్ కృష్ణ మండపాటి తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా 'వేద' తెలుగు టైటిల్, మోషన్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. వీఆర్ కృష్ణ మండపాటి మాట్లాడుతూ– ''యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రం 'వేద'. శివ రాజ్‌కుమార్‌గారి కెరీర్‌లో 125వ మూవీగా రూపొందింది. కన్నడలో ఈ మూవీ ఘన విజయం సాధించడం, కథ నాకు బాగా నచ్చడంతో తెలుగులో రిలీజ్ చేస్తున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె.గౌడ్, సంగీతం: అర్జున్‌జన్య.



శివ రాజ్‌కుమార్, వీఆర్ కృష్ణ

వెల్‌కమ్ టు మాలీవుడ్



ప్రణీత

'అత్తారింటికి దారేది, పాండవులు పాండవులు తుమ్మెద, రభస, డైనమైట్' వంటి పలు చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కన్నడ బ్యూటీ ప్రణీత. కన్నడ, తెలుగు, తమిళ్, హిందీ చిత్రాల్లో నటించిన ప్రణీత మలయాళ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. మలయాళ స్టార్ హీరో దిలీప్, దర్శకుడు రతీష్ రఘునందన్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోంది. దిలీప్ కెరీర్‌లో 148వ సినిమాగా రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రణీత హీరోయిన్‌గా నటిస్తున్నారు. ''మాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయమవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అయితే మలయాళంలో డైలాగ్స్ చెప్పడం కాస్త కష్టంతో కూడినపనే.. ప్రస్తుతం నా ముందున్న చాలెంజ్ అదే. ఈ మూవీలో కాస్త అహం ఉన్న యువతి పాత్రలో కనిపిస్తాను. నేను అమ్మగా మారిన తర్వాత ఒప్పుకున్న తొలి సినిమా ఇది. ఈ మూవీ కోసం నా కుమార్తె ఆర్నాకు దూరంగా ఉండాల్సి వస్తోంది. అయితే వ్యక్తిగత జీవితాన్ని, వృత్తి జీవితాన్ని నేను బ్యాలెన్స్ చేయాలనుకుంటున్నాను.. ఇందుకోసం కష్టపడతాను'' అని పేర్కొన్నారు ప్రణీత. కాగా 2021 మే 30న నితిన్ రాజును వివాహం చేసుకున్న ప్రణీత గత ఏడాది ఆర్నాకు జన్మనిచ్చారు.

కోనసీమ నేపథ్యంలో..



బృందా గోపాల్

ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ బృందా గోపాల్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'థగ్స్'. ఈ చిత్రం ద్వారా నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శిబు తమీన్స్ కుమారుడు హ్రిదు హరూన్ హీరోగా పరిచయమవుతున్నారు. తమీన్స్ సింహ, ఆర్‌కె సురేష్, మునిష్కంత్, శరత్ అప్పనీ ముఖ్య పాత్రలు చేశారు. హెచ్‌ఆర్ పిక్చర్స్ బ్యానర్ సమర్పణలో జియో స్టూడియోస్‌తో కలిసి రియా శిబు నిర్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్స్‌ని విజయ్ సేతుపతి, దుల్కర్ సల్మాన్, ఆర్య, అనిరుధ్, కీర్తీ సురేష్ విడుదల చేశారు. తెలుగులో 'కోనసీమ థగ్స్' పేరుతో ఈ సినిమా విడుదల కానుంది. డైరెక్టర్ బృందా గోపాల్ మాట్లాడుతూ–''కోనసీమ నేపథ్యంలో జరిగే రా యాక్షన్ ఫిల్మ్ ఇది. ప్రేక్షకులకు గ్రిప్పింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శామ్ సీఎస్, కెమెరా: ప్రియేష్ గురుస్వామి, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ముత్తు కురుప్పయ్య, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: యువరాజ్.

సస్పెన్స్ థ్రిల్లర్



అరవింద్ కృష్ణ, రజత్ రాఘవ్ హీరోలుగా, నటాషా దోషి ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'ఎస్ఐటీ'(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్). వీబీఆర్ దర్శకత్వం వహించారు. ఎస్ఎన్ఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్, వైజాగ్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్స్‌పై ఎస్.నాగిరెడ్డి, తేజ్‌పల్లి, గుంటక శ్రీనివాస్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ''సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఎస్ఐటీ'. స్క్రీన్ ప్లే హైలెట్‌గా ఉంటుంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి, కెమెరా: జగదీష్ బొమ్మిశెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎ.అరవింద్ రెడ్డి, సహ నిర్మాతలు: కె.చంద్రబాలి రెడ్డి, రమేష్ గుండా, నరేంద్ర వాసిరెడ్డి.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్



చేతన్

''ఫస్ట్ ర్యాంక్ రాజు' సినిమా తర్వాత చాలా కథలు విన్నాను. గోపీమోహన్‌గారు చెప్పిన స్టోరీకి బాగా కనెక్ట్ అయ్యాను. ఈ కథ నచ్చడంతో హీరోగా నటించడంతో పాటు నేనే సొంతంగా నిర్మిస్తున్నాను'' అని చేతన్ మద్దినేని అన్నారు. సాయి కిషోర్ దర్శకత్వంలో హెబ్బా పటేల్ హీరోయిన్‌గా ఓ మూవీ తెరకెక్కుతోంది. చేతన్ మద్దినేని హీరోగా నటిస్తూ, నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ 50శాతం పూర్తయింది. చేతన్ మద్దినేని మాట్లాడుతూ–''రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న సినిమా ఇది. 'డీ, రెడీ, చిరునవ్వుతో' చిత్రాల తరహాలో ఉంటుంది'' అన్నారు.

బీసీసీఐ కానుక రూ. 5 కోట్లు

అండర్–19 టి20 ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టును భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అభినందించింది. జట్టు సభ్యులు, సహాయక సిబ్బందికి కలిపి రూ. 5 కోట్ల నజరానా ప్రకటించింది. మరోవైపు ఫైనల్లో ఇంగ్లండ్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించి టైటిల్ సాధించిన మహిళల టీమ్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందించారు. ఈ యువ జట్టు భవిష్యత్తులోనూ మరిన్ని టోర్నీల్లో విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.



"అమ్మాయిలంతా చాలా బాగా ఆడారు. వారి ప్రదర్శన, తమపై తమకు ఉన్న నమ్మకం గురించి ఎంత చెప్పినా తక్కువే. కీలక పాత్ర పోషించిన సహాయక బృందానికి కూడా కృతజ్ఞతలు. ఇదొక్కటే కాదు... వచ్చే నెలలో ఇంతకంటే పెద్ద ట్రోఫీ (సీనియర్ మహిళల టి20 ప్రపంచకప్)ని కూడా అందుకోవాలని ఉంది."

–షఫాలీ వర్మ, భారత కెప్టెన్

ఎవరెవరిపై గెలిచామంటే..

లీగ్ దశలో: దక్షిణాఫ్రికాపై 7 వికెట్లతో గెలుపు
యూఏఈపై 122 పరుగులతో విజయం
స్కాట్లాండ్‌పై 83 పరుగులతో గెలుపు
సూపర్ సిక్స్ దశలో: ఆస్ట్రేలియా చేతిలో 7 వికెట్లతో ఓటమి.
శ్రీలంకపై 7 వికెట్లతో విజయం
సెమీస్‌లో: న్యూజిలాండ్‌పై 8 వికెట్లతో విజయం



మన అమ్మాయిలదే 'ప్రపంచం'

మన అమ్మాయిలు అదరగొట్టారు... అద్భుతమైన ఆటతో ఆది నుంచీ ఆధిపత్యం ప్రదర్శించిన మహిళా బృందం చివరకు అగ్రభాగాన నిలిచింది... సీనియర్ స్థాయిలో ఇప్పటివరకు ఒక్క ఐసీసీ టోర్నీ గెలవని నిరాశను దూరం చేస్తూ 'యువ'బృందం చిరస్మరణీయ ఫలితాన్ని సాధించింది. తొలిసారి నిర్వహించిన అండర్–19 ప్రపంచకప్‌లో కొత్త చరిత్రను సృష్టిస్తూ టీమిండియా మహిళలు విశ్వవిజేతగా నిలిచారు. ఏకపక్షంగా సాగిన తుది పోరులో ఇంగ్లండ్ ఆట కట్టించిన మన బృందం జగజ్జేతగా అవతరించింది... మహిళల క్రికెట్‌లో కొత్త తరానికి ప్రతినిధులుగా దూసుకొచ్చిన అమ్మాయిలు మొదటి ప్రయత్నంలోనే శిఖరాన నిలిచి మన మహిళల క్రికెట్‌కు మంచి భవిష్యత్తు ఉందనే భరోసాను మరింత పెంచారు.

- తొలి అండర్–19 మహిళల టి20 వరల్డ్‌కప్ విజేత భారత్
- ఫైనల్లో 7 వికెట్లతో ఇంగ్లండ్‌పై గెలుపు
- రాణించిన గొంగడి త్రిష
- ఏ స్థాయిలోనైనా భారత మహిళల క్రికెట్ జట్టుకు ఇదే తొలి ప్రపంచకప్

పోష్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): మహిళల తొలి అండర్–19 ప్రపంచకప్ విజేతగా భారత్ తమ పేరును ఘనంగా లిఖించుకుంది. 16 జట్లు పాల్గొన్న ఈ టి20 టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శనతో టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత జట్టు 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ అండర్–19పై నెగ్గింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 17.1 ఓవర్లలో 68 పరుగులకే కుప్పకూలింది. అనంతరం భారత్ 14 ఓవర్లలో 3 వికెట్లకు 69 పరుగులు చేసి విజయాన్నందుకుంది.

ప్రస్తుతం పురుషుల అండర్–19 వరల్డ్‌కప్ విజేత భారత్ కాగా... ఇప్పుడు మహిళల జట్టు కూడా జత చేరడం విశేషం. ప్రపంచకప్ నెగ్గిన భారత జట్టులో తెలంగాణ నుంచి గొంగడి త్రిష, యశశ్రీ, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు.

ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో కూడా 99 పరుగులకే కుప్పకూలి అదృష్టవశాత్తూ విజయంతో బయటపడ్డ ఇంగ్లండ్ బ్యాటింగ్ బలహీనత ఫైనల్లోనూ కనిపించింది. ఒకరితో మరొకరు పోటీ పడి విఫలం కావడంతో జట్టు సాధారణ స్కోరు కూడా చేయలేకపోయింది. టిటాస్ సాధు, అర్చన, పార్శవి ధాటికి ప్రత్యర్థి బ్యాటర్లంతా చేతులెత్తేశారు. ర్యానా మెక్‌డొనాల్డ్ (24 బంతుల్లో 19; 3 ఫోర్లు)దే అత్యధిక స్కోరు కాగా... ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లే నమోదయ్యాయి. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్ దూసుకుపోయింది. షఫాలీ వర్మ (15), శ్వేత సెహ్రావత్ (5) విఫలమైనా... గొంగడి త్రిష (29 బంతుల్లో 24; 3 ఫోర్లు), సౌమ్య (37 బంతుల్లో 24 నాటౌట్; 3 ఫోర్లు) మూడో వికెట్‌కు 46 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. 6 పరుగులిచ్చి 2 వికెట్లు తీసిన టిటాస్ సాధు 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్'గా నిలిచింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ అండర్–19 ఇన్నింగ్స్: స్క్రివెన్స్ (సి) త్రిష (బి) అర్చన దేవి 4; హీప్ (సి అండ్ బి) టిటాస్ సాధు 0; హాలండ్ (బి) అర్చన దేవి 10; సెరెన్ స్మేల్ (బి) టిటాస్ సాధు 3; ర్యానా మెక్‌డొనాల్డ్ (సి) అర్చన దేవి (బి) పార్శవి 19; పేవ్లీ (ఎల్బీ) (బి) పార్శవి 2; స్టోన్‌హౌస్ (సి) సోనమ్ (బి) మన్నత్ 11; గ్రోవ్స్ (రనౌట్) 4; బేకర్ (సి) రిచా ఘోష్ (బి) షఫాలి 0; సోఫియా స్మేల్ (సి అండ్ బి) సోనమ్ 11; అండర్సన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (17.1 ఓవర్లలో ఆలౌట్) 68. వికెట్ల పతనం:** 1–1, 2–15, 3–16, 4–22, 5–39, 6–43, 7–53, 8–53, 9–68, 10–68. **బౌలింగ్:** టిటాస్ సాధు 4–0–6–2, అర్చనా దేవి 3–0–17–2, పార్శవి చోప్రా 4–0–13–2, మన్నత్ కశ్యప్ 3–0–13–1, షఫాలీ 2–0–16–1, సోనమ్ 1.1–0–3–1.

భారత్ అండర్–19 ఇన్నింగ్స్: షఫాలీ (సి) స్టోన్‌హౌస్ (బి) బేకర్ 15; శ్వేత (సి) బేకర్ (బి) స్క్రివెన్స్ 5; సౌమ్య (నాటౌట్) 24; త్రిష (బి) స్టోన్‌హౌస్ 24; రిషిత (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (14 ఓవర్లలో 3 వికెట్లకు) 69. వికెట్ల పతనం:** 1–16, 2–20, 3–66. **బౌలింగ్:** బేకర్ 4–1–13–1, సోఫియా స్మేల్ 2–0–16–0, స్క్రివెన్స్ 3–0–13–1, గ్రోవ్స్ 2–0–9–0, స్టోన్‌హౌస్ 2–0–8–1, అండర్సన్ 1–0–10–0.

'చిరస్మరణీయం'

సాక్షి క్రీడావిభాగం

దాదాపు 18 ఏళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై భారత మహిళల జట్టు తొలిసారి వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ చేరింది. అయితే ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడి రన్నరప్‌గా నిలవాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఏ స్థాయిలో, ఏ ఫార్మాట్‌లో కూడా మన టీమ్ వరల్డ్‌కప్ గెలవలేకపోయింది. నాటి జట్టులో సభ్యురాలిగా ఉన్న ఆఫ్ స్పిన్నర్ నూషీన్ అల్ ఖదీర్ ఇప్పుడు యువ మహిళల టీమ్‌కు కోచ్. ఇప్పుడు అదే దక్షిణాఫ్రికా గడ్డపై మరో ఫైనల్ ఆడిన భారత బృందం ఈసారి విజేతగా నిలిచింది. దాదాపు 2005 వరల్డ్‌కప్ జరిగిన సమయంలోనే పుట్టిన అమ్మాయిలంతా ఇప్పుడు విశ్వవిజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించారు. సీనియర్ టీమ్ మంచి ఫలితాలు సాధిస్తున్న సమయంలో అండర్–19 జట్టు కూడా తమ స్థాయిని ప్రదర్శించడం శుభపరిణామం. దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటుతున్న వర్ధమాన ప్లేయర్లలో బీసీసీఐ తొలి వరల్డ్‌కప్ కోసం టీమ్‌ను ఎంపిక చేసింది. అయితే ఎలాగైనా వరల్డ్‌కప్ గెలవాలనే ఉద్దేశంతో ఇప్పటికే సీనియర్ టీమ్‌లో ఆడిన షఫాలీ వర్మ, రిచా ఘోష్‌లను జట్టులోకి తీసుకుంది. దీనిపై కొన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. అమ్మాయిలందరూ తమపై ఉన్న అంచనాలకు అనుగుణంగా రాణించడం విశేషం. శ్వేత సెహ్రావత్ 139.43 స్ట్రయిక్‌రేట్‌తో 297 పరుగులు సాధించి ఎవరికీ అందనంత ఎత్తులో నిలవగా, షఫాలీ (172 పరుగులు), తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (116 పరుగులు) అండగా నిలిచారు. బౌలింగ్‌లో పార్శవి చోప్రా (11 వికెట్లు), మన్నత్ కశ్యప్ (9 వికెట్లు) కీలకపాత్ర పోషించారు. సీనియర్ టీమ్‌లో జూనియర్‌గా బ్యాటింగ్‌పైనే దృష్టి పెట్టిన షఫాలీ ఈ టోర్నీ ద్వారా తన నాయకత్వ ప్రతిభను కూడా ప్రదర్శించడం విశేషం.

వరల్డ్‌కప్ సాధించిన బృందం గురించి సంక్షిప్తంగా...

షఫాలీ వర్మ (కెప్టెన్): హరియాణాలోని రోహ్‌తక్‌కు చెందిన షఫాలీ భారత్ సీనియర్ జట్టు సభ్యురాలిగా ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. భారత్ తరఫున 74 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది.

రిచా ఘోష్: బెంగాల్‌కు చెందిన కీపర్ రిచా కూడా సీనియర్ టీమ్ సభ్యురాలిగా 47 మ్యాచ్‌లు ఆడింది.



పార్శవి చోప్రా: యూపీలోని గ్రేటర్ నోయిడాకు చెందిన లెగ్‌స్పిన్నర్. తండ్రి ఫ్లడ్ లైట్ సౌకర్యాలతో సొంత గ్రౌండ్ ఏర్పాటు చేసి మరీ కూతురును ఆటలో ప్రోత్సహించాడు.



ఎండీ షబ్నమ్: విశాఖపట్నానికి చెందిన షబ్నమ్ తల్లిదండ్రులు నేవీలో పని చేస్తారు. శివశివాని స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. 15 ఏళ్ల వయసులోనే 110 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసి అందరి దృష్టినీ ఆకర్షించింది.



సౌమ్య తివారి: స్వస్థలం భోపాల్. టాప్ ఆర్డర్ బ్యాటర్... కోహ్లిని ఇష్టపడే సౌమ్య అతనిలాగే కవర్‌డ్రైవ్ అద్భుతంగా ఆడుతుంది.



టిటాస్ సాధు: బెంగాల్‌కు చెందిన టిటాస్ తండ్రి ఒక క్రికెట్ అకాడమీ నడపిస్తాడు. బెంగాల్ సీనియర్ టీమ్‌కు ఇప్పటికే ఆడింది.



గొంగడి త్రిష: భద్రాచలంకు చెందిన త్రిష హైదరాబాద్‌లో స్థిర పడింది. తండ్రి ప్రోత్సాహంతో క్రికెట్‌లోకి అడుగుపెట్టి 8 ఏళ్ల వయసులోనే అండర్–16లో ప్రాతినిధ్యం వహించింది.



మన్నత్ కశ్యప్: పటియాలాకు చెందిన లెఫ్టార్మ్ స్పిన్నర్. ఇటీవల వరుసగా 'మన్కడింగ్'లు చేసి గుర్తింపు తెచ్చుకుంది.



శ్వేత సెహ్రావత్: ఢిల్లీకి చెందిన బిగ్ హిట్టర్. ఆర్థికంగా మెరుగైన నేపథ్యం ఉన్న కుటుంబం.



సొప్పదండి యశశ్రీ: హైదరాబాద్‌కు చెందిన మీడియం పేసర్. టోర్నీలో ఒక మ్యాచ్ ఆడింది. గాయంతో తప్పుకున్న హర్లీ గలా స్థానంలో జట్టులోకి వచ్చింది.



అర్చనా దేవి: ఆఫ్‌స్పిన్నర్. యూపీలోని ఉన్నావ్ స్వస్థలం. కడు పేదరికం. తండ్రి ఎప్పుడో చనిపోయాడు. కుల్దీప్ యాదవ్ కోచ్ కపిల్ పాండే దత్తత తీసుకొని ముందుకు నడిపించాడు.

సోనమ్ యాదవ్: యూపీ లెఫ్టార్మ్ స్పిన్నర్. తండ్రి ఫిరోజాబాద్‌లో చేతి గాజులు తయారు చేసే పరిశ్రమలో కార్మికుడు

ఫలక్ నాజ్: స్వస్థలం యూపీలోని ప్రయాగ్‌రాజ్. ఈ బౌలింగ్ ఆల్‌రౌండర్ తండ్రి ఒక ప్రైవేట్ స్కూల్‌లో ప్యూన్.

రిషిత బసు: వికెట్ కీపర్, బెంగాల్‌లోని హౌరా స్వస్థలం. అద్భుతమైన మెరుపు షాట్‌లు ఆడుతుంది. మాజీ క్రికెటర్ లక్ష్మీరతన్ శుక్లా తన అకాడమీలో ఉచిత శిక్షణ ఇస్తున్నాడు.


సూర్యకుమార్

ఆపసోపాలు పడి...

- రెండో టి20లో భారత్ గెలుపు
- 6 వికెట్ల తేడాతో ఓడిన న్యూజిలాండ్
- బుధవారం చివరి టి20

లక్నో: భారత్ విజయలక్ష్యం 100 పరుగులు... పిచ్ ఎలా ఉన్నా ఇది మన లైనప్‌కు సులువైన లక్ష్యంలాగే అనిపించింది... కానీ న్యూజిలాండ్ అంత సులువుగా ఓటమిని అంగీకరించలేదు. చివరి వరకు పోరాడింది. ఎట్టకేలకు ఒక బంతి మిగిలి ఉండగా మ్యాచ్‌ను ముగించి భారత్ ఊపిరి పీల్చుకుంది. రెగ్యులర్, పార్ట్‌టైమ్ స్పిన్నర్లు కూడా హవా చూపించిన రెండో టి20 మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. మిచెల్ సాన్‌ట్నర్ (19 నాటౌట్)దే అత్యధిక స్కోరు కాగా... అర్ష్‌దీప్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం భారత్ 19.5 ఓవర్లలో 4 వికెట్లకు 101 పరుగులు చేసింది. కఠిన పరిస్థితుల్లో తన శైలికి భిన్నంగా ఆడిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (31 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్) చివరి వరకు నిలిచి జట్టును గెలిపించాడు. ఈ మ్యాచ్ మొత్తంలో ఒక్క సిక్స్ కూడా నమోదు కాకపోవడం విశేషం. తాజా ఫలితంతో ఇరు జట్లు 1–1తో సమంగా నిలవగా...సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరి మ్యాచ్ బుధవారం అహ్మదాబాద్‌లో జరుగుతుంది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (బి) చహల్ 11; కాన్వే (సి) ఇషాన్ (బి) సుందర్ 11; చాప్‌మన్ (రనౌట్) 14; ఫిలిప్స్ (బి) హుడా 5; మిచెల్ (బి) కుల్దీప్ 8; బ్రేస్‌వెల్ (సి) అర్ష్‌దీప్ (బి) పాండ్యా 14; సాన్‌ట్నర్ (నాటౌట్) 19; సోధి (సి) పాండ్యా (బి) అర్ష్‌దీప్ 1; ఫెర్గూసన్ (సి) సుందర్ (బి) అర్ష్‌దీప్ 0; డఫీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 99. వికెట్ల పతనం:** 1–21, 2–28, 3–35, 4–48, 5–60, 6–80, 7–83, 8–83. **బౌలింగ్:** పాండ్యా 4–0–25–1, సుందర్ 3–0–17–1, చహల్ 2–1–4–1, హుడా 4–0–17–1, కుల్దీప్ 4–0–17–1, అర్ష్‌దీప్ 2–0–7–2, మావి 1–0–11–0.

భారత్ ఇన్నింగ్స్: గిల్ (సి) అలెన్ (బి) బ్రేస్‌వెల్ 11; ఇషాన్ (రనౌట్) 19; త్రిపాఠి (సి) ఫిలిప్స్ (బి) సోధి 13; సూర్యకుమార్ (నాటౌట్) 26; సుందర్ (రనౌట్) 10; పాండ్యా (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.5 ఓవర్లలో 4 వికెట్లకు) 101. వికెట్ల పతనం:** 1–17, 2–46, 3–50, 4–70. **బౌలింగ్:** డఫీ 1–0–8–0, బ్రేస్‌వెల్ 4–0–13–1, సాన్‌ట్నర్ 4–0–20–0, ఫిలిప్స్ 4–0–17–0, సోధి 4–0–24–1, చాప్‌మన్ 1–0–4–0, ఫెర్గూసన్ 1–0–7–0, టిక్నర్ 0.5–0–7–0.

హాకీ జగజ్జేత జర్మనీ

ఫైనల్లో బెల్జియంపై 'షూటౌట్'లో విజయం

భువనేశ్వర్: 13 ఏళ్ల విరామం తర్వాత జర్మనీ జట్టు పురుషుల హాకీలో జగజ్జేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ప్రపంచకప్ హాకీ టోర్నీ ఫైనల్లో జర్మనీ 'షూటౌట్'లో 5–4తో డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం జట్టును ఓడించింది. నిర్ణీత సమయం ముగిసే సరికి రెండు జట్లు 3–3తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించడానికి 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో నిర్ణీత ఐదు షాట్‌ల తర్వాత రెండు జట్లు 3–3తో సమంగా నిలిచాయి. 'సడెన్ డెత్'లో తొలి షాట్‌లో రెండు జట్ల ఆటగాళ్లు సఫలమయ్యాయి. రెండో షాట్‌లో జర్మనీ సఫలంకాగా... బెల్జియం ఆటగాడు విఫలం కావడంతో జర్మనీ విజయం ఖరారైంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ జట్ల తర్వాత మూడుసార్లు ప్రపంచకప్ నెగ్గిన మూడో జట్టుగా జర్మనీ గుర్తింపు పొందింది. జర్మనీ 2002, 2006లలో టైటిల్ నెగ్గింది. కాంస్య పతకం మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 3–1తో ఆస్ట్రేలియాను ఓడించింది.



'గ్రేట్' జొకోవిచ్

గత ఏడాది కూడా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడేందుకు జొకోవిచ్ మెల్‌బోర్న్‌కు వచ్చాడు. కానీ కోవిడ్ టీకా వేసుకోనందుకు... అప్పటి ఆస్ట్రేలియా ప్రభుత్వం జొకోవిచ్ విషయంలో కఠినంగా వ్యవహరించింది. ఒక్కడి కోసం నిబంధనలు మార్చలేమని స్పష్టం చేసింది. విమానాశ్రయంలోనే అతడిని నిర్బంధించింది. జొకోవిచ్ వీసాను రద్దు చేసింది. మూడేళ్లపాటు ఆస్ట్రేలియాలో అడుగు పెట్టకుండా నిషేధం విధించింది. న్యాయపోరాటం చేసినా ఈ సెర్బియా స్టార్‌కు అనుకూల నిర్ణయం రాలేదు. దాంతో అవమానకర రీతిలో జొకోవిచ్ విమానాశ్రయం నుంచే స్వదేశానికి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఏడాది గడిచిపోయింది. కోవిడ్ తీవ్రత తగ్గింది. ఆస్ట్రేలియాలో ప్రభుత్వం కూడా మారిపోయింది. జొకోవిచ్ వీసాను పునరుద్ధరించడం జరిగింది. వెరసి తనకెంతో కలిసొచ్చిన ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో జొకోవిచ్ పదోసారి విజయగర్జన చేశాడు.

- పదోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ హస్తగతం
- ఫైనల్లో సిట్సిపాస్‌పై విజయం
- ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్
- కెరీర్‌లో 22వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో నాదల్ రికార్డు సమం

మెల్‌బోర్న్: ఫ్రెంచ్ ఓపెన్ అంటే రాఫెల్ నాదల్... వింబుల్డన్ అంటే రోజర్ ఫెడరర్ గుర్తుకొస్తారు. మరి ఆస్ట్రేలియన్ ఓపెన్ అంటే ఎవరు గుర్తుకు రావాలి అన్న ప్రశ్నకు సమాధానం తానేనని సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ నిరూపించాడు. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తనకు తిరుగులేదని ఈ సెర్బియా యోధుడు మరోసారి చాటుకున్నాడు. ఆదివారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ జొకోవిచ్ 6–3, 7–6 (7/4), 7–6 (7/4)తో ప్రపంచ మూడో ర్యాంకర్, మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్)పై గెలుపొందాడు. విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు 29,75,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 17 కోట్ల 22 లక్షలు)... రన్నరప్ సిట్సిపాస్‌కు 16,25,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 9 కోట్ల 40 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది. తాజా విజయంతో 35 ఏళ్ల జొకోవిచ్ నేడు విడుదల చేసే అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్నాడు. కెరీర్‌లో 22వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో పురుషుల టెన్నిస్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా రాఫెల్ నాదల్ (22; స్పెయిన్) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ సమం చేశాడు. సిట్సిపాస్‌తో 2 గంటల 56 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో జొకోవిచ్‌కు ఏ దశలోనూ ఆందోళన చెందేరీతిలో ప్రతిఘటన ఎదురుకాలేదు. కీలకదశలో ఈ సెర్బియా స్టార్ పైచేయి సాధించి సిట్సిపాస్‌కు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. తొలి సెట్‌లోని నాలుగో గేమ్‌లో సిట్సిపాస్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ ఆ తర్వాత తన సర్వీస్‌ను నిలబెట్టుకొని 4–1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే జోరులో తొలి సెట్‌ను 36 నిమిషాల్లో దక్కించుకున్నాడు. రెండో సెట్‌లో ఇద్దరూ హోరాహోరీగా పోరాడారు. ఫలితంగా సర్వీస్ ఒక్కసారీ బ్రేక్ కాలేదు. స్కోరు 6–6తో సమం కావడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో జొకోవిచ్ పైచేయి సాధించి 70 నిమిషాల్లో రెండో సెట్‌ను గెల్చుకున్నాడు. మూడో సెట్ తొలి గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సిట్సిపాస్ ఆ వెంటనే తన సర్వీస్‌ను కూడా కోల్పోయాడు. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో స్కోరు 6–6తో సమమైంది. మళ్లీ టైబ్రేక్ అనివార్యమైంది. ఈసారి టైబ్రేక్‌లో జొకోవిచ్ ఆధిపత్యం కనబరిచి 70 నిమిషాల్లో మూడో సెట్‌నూ సొంతం చేసుకొని విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో జొకోవిచ్ చేతిలో ఓడిపోవడం సిట్సిపాస్‌కిది రెండోసారి. 2021 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోనూ జొకోవిచ్ చేతిలో ఓడిపోయాడు.


జొకోవిచ్

ఫైనల్ గణాంకాలు

జొకోవిచ్		సిట్సిపాస్
7	ఏస్‌లు	15
3	డబుల్ ఫాల్ట్‌లు	3
36	విన్నర్స్	40
22	అనవసర తప్పిదాలు	42
2	బ్రేక్ పాయింట్లు	1
10	నెట్ పాయింట్లు	12
112	మొత్తం పాయింట్లు	94


సిట్సిపాస్

22 జొకోవిచ్ నెగ్గిన గ్రాండ్‌స్లామ్ టైటిల్స్. ఇందులో ఆస్ట్రేలియన్ ఓపెన్ (10), వింబుల్డన్ (7), యూఎస్ ఓపెన్ (3), ఫ్రెంచ్ ఓపెన్ (2) ఉన్నాయి. ప్రస్తుతం అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుల జాబితాలో రాఫెల్ నాదల్ (22) సరసన జొకోవిచ్ నిలిచాడు.

93 జొకోవిచ్ కెరీర్‌లో నెగ్గిన టైటిల్స్. అత్యధిక టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుల జాబితాలో నాదల్‌ను (92) ఐదో స్థానానికి నెట్టి జొకోవిచ్ నాలుగో స్థానానికి ఎగబాకాడు. టాప్–3లో జిమ్మీ కానర్స్ (అమెరికా: 109), ఫెడరర్ (స్విట్జర్లాండ్: 103), ఇవాన్ లెండిల్ (అమెరికా: 94) ఉన్నారు.

10 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జొకోవిచ్ 10 సార్లు (2008, 2011, 2012, 2013, 2015, 2016, 2019, 2020, 2021, 2023) ఫైనల్ చేరుకోగా... పదిసార్లూ గెలిచాడు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
30-1-2023

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
874	288
59,331	17,604

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	11,622	△	109
డోజోన్స్	33,978	△	29
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,765	△	04
డాక్స్	15,150	△	17
షాంఘై (20వ తేదీ ముగింపు)	3,265	△	25
నికాయ్	27,383	△	20

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధారావాహిక	80.85	82.52
£	బ్రిటన్ పౌండ్	ధారావాహిక	87.51	90.58
€	యూరో	ధారావాహిక	99.03	102.34
¥	జపాన్ ఎన్ (100)	ధారావాహిక	61.61	63.63
AUS	ఆస్ట్రేలియా డాలర్	ధారావాహిక	56.87	59.30
S$	సింగపూర్ డాలర్	ధారావాహిక	60.99	63.00
SAR	సౌదీ రియాల్	ధారావాహిక	20.76	22.43
UAE D	యూఏఈ దిర్హామ్	ధారావాహిక	21.32	23.11
¥	చైనా యువాన్	ధారావాహిక	10.90	12.98

ఆకాంక్షలు నెరవేరేనా!



మోదీ 2.0 సర్కారు చివరి బడ్జెట్‌పై ఎన్నో ఆశలు

- మధ్యతరగతికి పన్ను ఉపశమనం
- ఉపాధి కల్పన, ఆరోగ్యానికి ప్రాముఖ్యం
- రైతాంగానికి సాయం పెంపుపై అంచనాలు
- ఉన్నత విద్యకు చేయూతనందించాలని సూచన

వచ్చే సార్వత్రిక ఎన్నికల ముందు వస్తున్న చివరి పూర్తి స్థాయి కేంద్ర బడ్జెట్ ఇదే. ఎంత కాదన్నా బడ్జెట్ నిర్ణయాలు, కేటాయింపుల ప్రభావం కొన్ని వర్గాలపై కచ్చితంగా ఉంటుంది. ఇప్పటికే కేంద్రంలో మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీయే సర్కారు 9 ఏళ్లుగా పాలిస్తోంది. మరోసారి ప్రజామోదం కోసం బడ్జెట్‌ను ఒక అవకాశంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భావిస్తారా..? లేక మొదటి నుంచి సంస్కరణల హితమేనన్న తమ విధానానికి కట్టుబడి ఉంటారా? అన్నది ఫిబ్రవరి 1న తేటతెల్లం అవుతుంది. కానీ, సామాన్య, మధ్యతరగతి ప్రజలు పెరిగిపోయిన ధరల భారాన్ని ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఉపాధి కల్పనపైనా ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. పన్నుల భారాన్ని తగ్గించాలన్న మధ్యతరగతి వాసుల వినతులు, వివిధ రంగాల ఆకాంక్షలకు ఈ బడ్జెట్ ఏ మేరకు న్యాయం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కరోనా తర్వాత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో ఇంకా కోలుకోలేదు. డిమాండ్ పరిస్థితులు దీన్నే తెలియజేస్తున్నాయి. మరి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఉత్తేజానికి ఆర్థిక మంత్రి ఏం చేస్తారో చూడాలి. నిర్మలమ్మకు ఇది ఐదో బడ్జెట్ కానుంది. **- బిజినెస్ డెస్క్**

మధ్యతరగతికి 'ఐటీ' తాయిలం..?



రూ.2.5 లక్షల వరకు ఆదాయం కలిగిన వారికి ఎలాంటి ఆదాయపన్ను లేదు. 2014–2015 సంవత్సరానికి ఆదాయపన్ను బడ్జెట్ ప్రవేశపెట్టిన నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రూ.2 లక్షలుగా ఉన్న పరిమితిని రూ.2.5 లక్షలు చేశారు. 60 ఏళ్లు నిండిన వృద్ధులకు ఇది రూ.3 లక్షలుగా, రూ.80 ఏళ్లు నిండిన వారికి రూ.5 లక్షలకు పెంచారు. తొమ్మిదేళ్లుగా ఇదే బేసిక్ పరిమితి కొనసాగుతోంది. రూ.2.51–5 లక్షల వరకు ఆదాయం ఉన్నా పన్ను చెల్లించే అవసరం లేకుండా తర్వాతి కాలంలో రాయితీ కల్పించారు. కానీ, బేసిక్ పరిమితిలో మార్పులు చేయలేదు. గణనీయంగా పెరిగిపోయిన జీవన వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని దీన్ని రూ.5–6 లక్షలు చేయాలనే డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తోంది. ఈ కానుక ఉంటుందనే అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. లేదంటే రూ.50వేలుగా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను పెంచుతారేమో చూడాలి. అలాగే, సెక్షన్ 80సీ కింద వివిధ సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల ఆదాయంపై పన్ను లేకుండా ఉపశమనం పొందొచ్చు. దీన్ని కూడా రూ.2–3 లక్షలకు పెంచాలనే డిమాండ్లు నెలకొన్నాయి. అలాగే, గరిష్ఠ పన్ను రేటు 30 శాతం అమలుకి ఆదాయపన్ను పరిమితిని పెంచాలన్న డిమాండ్ బలంగా ఉంది. ప్రస్తుతం వార్షికాదాయం రూ.10లక్షలకు మించితే పాత పన్ను విధానంలో 30 శాతం రేటు అమలు చేస్తున్నారు. రూ.20 లక్షల వరకు ఆదాయం ఉండే వారికి 20 శాతం మించి పన్ను ఉండరాదన్నది నిపుణుల సూచనగా ఉంది. పన్ను భారం తగ్గించడం వల్ల మధ్య తరగతి, వేతన జీవులకు ఖర్చు చేసే ఆదాయం మరింత మిగులుతుంది. ఇది వినియోగంలోకి మారి, డిమాండ్‌కు ఊతం ఇస్తుందన్న విశ్లేషణ వినిపిస్తోంది. పన్నుల భారం తగ్గించడం ఒక కోణం అయితే, సామాన్యులు, మధ్యతరగతి వాసులపై కొత్తగా ఏ రూపంలోనూ పన్నుల భారం మోపకుండా ఉండడం కీలకం కానుంది. మరోవైపు ధరల భారం ఎక్కువ మందిని భయపెడుతోంది. కనుక కూరగాయలు, వంట నూనెలు, చమురు ధరల కట్టడికి తీసుకునే చర్యలకూ ఎంతో ప్రాధాన్యం ఉంటుంది.

ఔషధాల భారాన్ని దింపరూ..



పరిశోధన, అభివృద్ధికి, ఫార్ములేషన్, ఏపీఐల తయారీకి సంబంధించి ప్రత్యేక నిధుల కేటాయింపు అవసరం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఔషధాలపై జీఎస్‌టీని సులభతరం చేయాలని కోరుతున్నాయి. దేశ ఫార్మా పరిశ్రమ 2023 ముగిసే నాటికి 130 బిలియన్ డాలర్లకు చేరుతుందన్న అంచనా ఉంది. ఫార్మా పరిశ్రమ ఔషధ పరీక్షలు, సర్టిఫికేషన్ వంటి సేవలను అందిస్తున్నా.. సేవల ఎగుమతి ప్రోత్సాహక పథకం (ఎస్‌ఈఐఎస్) కింద ఎలాంటి ప్రోత్సాహకాలు అందించడం లేదని, తమకూ వాటిని అందించాలన్న డిమాండ్ ఉంది. ఆరోగ్యం కోసం ప్రజలు జేబు నుంచి చేసే ఖర్చు 65 శాతంగా ఉందని, కనుక ఔషధాలపై జీఎస్‌టీని తగ్గించడం వల్ల ఈ భారాన్ని దింపొచ్చని పరిశ్రమ కోరుతోంది.

పాలసీదారులు/బీమా కంపెనీలు



మనదేశంలో బీమా వ్యాప్తి ఇప్పటికీ అంతర్జాతీయ సగటుతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. '2047 నాటికి అందరికీ బీమా' అనే లక్ష్యాన్ని బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) పెట్టుకుంది. టర్మ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై వినియోగదారులు 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి వస్తోంది. ఇది ఎంతో మందికి భారంగా పరిణమించిదని, దీన్ని 5 శాతానికి తగ్గించాలని పరిశ్రమ ఎప్పటి నుంచో కోరుతోంది. ఉదాహరణకు రూ.10,000 ప్రీమియంపై రూ.1800 పన్ను రూపంలో చెల్లించాల్సి వస్తోంది. పన్ను తగ్గింపుతో ప్రీమియం తగ్గడం వల్ల మరింత మంది బీమా పాలసీలు తీసుకునేందుకు ముందుకు వస్తారని పరిశ్రమ చెబుతోంది. ఈ డిమాండ్‌ను ఆర్థిక మంత్రి నెరవేర్చితే అది కచ్చితంగా బీమా వ్యాప్తికి దోహదపడుతుంది. ముఖ్యంగా అధిక కవరేజీనిచ్చే టర్మ్ ఇన్సూరెన్స్‌కు ఆదరణ పెరుగుతుందని పరిశ్రమ అంటోంది. హెల్త్ ఇన్సూరెన్స్‌కు చెల్లించే ప్రీమియం ఒక కుటుంబానికి రూ.25,000 వరకు ఉంటే సెక్షన్ 80డీ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. లైఫ్ ఇన్సూరెన్స్ కోసం ప్రత్యేక పన్ను మినహాయింపు కావాలని, యాన్యుటీ (పెన్షన్ ప్లాన్) ఆదాయంపై పన్ను ఎత్తేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై మరింత పన్ను మినహాయింపు ఇవ్వాలని బీమా రంగం కోరుతోంది.

ఉపాధి కల్పన



అమెరికా, యూరప్‌లో ఆర్థిక మాంద్యం ఆందోళనల నేపథ్యంలో టెక్ కంపెనీలు ఉద్యోగులను తగ్గించుకుంటున్నాయి. దీనిపై ఆందోళన వ్యక్తమవుతోంది. కనుక ఉపాధి కల్పన, పెట్టుబడులకు ఊతమిచ్చే ప్రతిపాదనలకు చోటు ఇవ్వాలన్న సూచనలు నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. నిజానికి ఉపాధి కల్పన లక్ష్యంతోనే మోదీ సర్కారు భారత్‌లో తయారీ విధానాన్ని ఎంచుకుంది. దీనికింద ఆత్మ నిర్భర్ (స్వావలంబన) భారత్ పేరుతో దేశీ తయారీని ప్రోత్సహించే పలు విధానాలను ఇప్పటికే చేపట్టింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కింద ఇప్పటికే 14 రంగాలకు ప్రోత్సాహకాలను ప్రకటించారు. బడ్జెట్‌లో ఇందుకు సంబంధించి కేటాయింపులు పెంచొచ్చని భావిస్తున్నారు. ముఖ్యంగా మరిన్ని రంగాలు తమకు సైతం పీఎల్ఐ ప్రోత్సాహకాలు కావాలని కోరుతున్నాయి. వీటికి ఏ మాత్రం ప్రాధాన్యం ఇస్తారన్నది బడ్జెట్‌తో తెలుస్తుంది. స్టార్టప్‌లకు సైతం కేంద్రం ప్రోత్సాహకాలు ఇస్తోంది. దీనికి కూడా కేటాయింపులు పెంచొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీ) కింద కేటాయింపులు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రామీణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేటాయింపులు పెంచడం ద్వారా ఉపాధి కల్పించొచ్చనే సూచనలు వస్తున్నాయి.



ఫిన్‌టెక్/ఎంఎస్‌ఎంఈ



దేశీ ఫిన్‌టెక్ పరిశ్రమ తమకు మరిన్ని మద్దతు చర్యలు కావాలని కోరుతోంది. అందరికీ ఆర్థిక సేవల చేరువలో తమ పాత్ర కీలకమని, ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థకు, ఉపాధి కల్పనకు కీలకంగా వ్యవహరిస్తున్న ఎంఎస్ఎంఈ రంగం అవసరాలు తీర్చడంలోనూ ఫిన్‌టెక్ పరిశ్రమ చేస్తున్న సేవలను గుర్తు చేసింది. 45 శాతం మందికి ఉపాధినిస్తూ, జీడీపీలో 30 శాతం వాటాను ఎంఎస్ఎంఈ పరిశ్రమ కలిగి ఉంది. కనుక బడ్జెట్ ప్రతిపాదనల పట్ల ఫిన్‌టెక్ పరిశ్రమ ఆసక్తిగా చూస్తోంది.

కార్పొరేట్ రంగం డిమాండ్..



కొత్తగా తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేసే దేశీ కంపెనీలకు అతి తక్కువగా 15 శాతం కార్పొరేట్ పన్నును కేంద్రం లోగడ ప్రకటించింది. 2024 మార్చి 31లోపు తయారీ కార్యకలాపాలు ఆరంభించేవి ఈ ప్రయోజనం పొందొచ్చు. ఈ గడువును పొడిగించాలనే డిమాండ్ ఉంది. దీనివల్ల మరిన్ని కంపెనీలు ముందుకు వస్తాయని, తద్వారా ఉపాధి కల్పన పెరుగుతుందన్న అభిప్రాయాలు ఉన్నాయి. కరోనా మహమ్మారి ప్రభావం నుంచి బయట పడేందుకు కంపెనీలకు సమయం పట్టిందని.. ఇప్పుడు నూతన పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నందున గడువు పొడిగించాలనే డిమాండ్ ఉంది. కొత్త ప్లాంట్ తయారీ కార్యకలాపాలు ప్రారంభించేందుకు కనీసం 2–3 ఏళ్లు పడుతుందని, కనుక ప్రస్తుత గడువు చాలదన్న అభిప్రాయం ఉంది. ఆదాయపన్ను విషయంలో ఊరట కల్పిస్తే అది హౌసింగ్ పరిశ్రమ వృద్ధికి మేలు చేస్తుందని రియల్టీ భావిస్తోంది. భారీ ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈ రంగం తమకు క్షేత్రస్థాయిలో రుణ లభ్యత సమస్యగా ఉందని చెబుతోంది. ఎంఎస్ఎంఈ తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే కీలకమైన ఆటోమొబైల్ రంగం పన్నుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తోంది. కనిష్టంగా 28%, గరిష్టంగా 40 శాతానికి పైనే వాహనాలపై పన్నుల భారం వేస్తున్నారని.. మార్కెట్ విస్తరణకు ఇది అవరోధంగా నిలుస్తున్నట్టు చెబుతున్నాయి.

స్టాక్ మార్కెట్ కోర్కెలు



మూలధన లాభాల పన్ను పరంగా ఉపశమనం కల్పిస్తే అది మార్కెట్లకు మంచి జోష్‌నిస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డెట్, ఈక్విటీ, ప్రాపర్టీలకు వేర్వేరు మూలధన లాభాల పన్ను, హోల్డింగ్ పీరియడ్ అమలవుతున్నాయి. వీటి మధ్య ఏకరూపతకు అవకాశం ఉందని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి ఇప్పటికే సంకేతం ఇచ్చింది. ఈ క్రమంలోనే మూలధన లాభాల పన్ను విషయమై అంచనాలు ఏర్పడ్డాయి. దీర్ఘకాల మూలధన లాభాలపై నష్టాన్ని, స్వల్పకాల మూలధన లాభాలతో సర్దుబాటుకు అవకాశం లేదు.

గత ఎన్నికల ముందు బడ్జెట్‌లో ఏం చేశారు?



2019 ఎన్నికల ముందు నాటి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఒకసారి గమనించినట్టయితే.. హెల్త్ కేర్, పారిశుద్ధ్యం, విద్యా రంగాలకు అంతకుముందు మూడు సంవత్సరాల్లో లేనంతగా కేటాయింపులు పెంచారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అరుణ్ జైట్లీ ప్రకటించారు. విద్య, సామాజిక భద్రత, ఆరోగ్యం కోసం రూ.1.38 లక్షల కోట్లు కేటాయించారు. ఆదాయపన్నుపై హెల్త్, ఎడ్యుకేషన్ సెస్‌ను 3 శాతం నుంచి 4 శాతానికి పెంచారు. "భారత్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోంది. అతిపెద్ద యువ జనాభా కలిగి ఉన్న భారత్ తన హామీలను అమల్లో పెట్టాల్సిన అవసరం ఉంది"అని నాడు అరుణ్‌జైట్లీ 2018–19 బడ్జెట్ సందర్భంగా ప్రకటించారు.

విద్యారంగం




దేశంలో నాణ్యమైన విద్యకు డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలోనే విదేశీ విద్యా సంస్థలకు మోదీ సర్కారు ఆహ్వానం పలికింది. విద్యా సేవలపై జీఎస్‌టీ భారాన్ని తొలగించడం లేదంటే తగ్గించాలని విద్యా సంస్థలు కోరుతున్నాయి. దేశంలో ప్రాథమిక విద్యలో ఎక్కువ మంది చేరుతున్నారు. ఉన్నత విద్యకు వెళ్లేసరికి పిరమిడ్ మాదిరి చేరే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అందుకుని ఉన్నత విద్యలోనూ మరింత మంది చేరేందుకు వీలుగా ఆకర్షణీయమైన రుణ పథకాలు, స్కాలర్‌షిప్‌లు ప్రకటించాలనే డిమాండ్ ఉంది.

గృహ కల్పన



అందరికీ ఇల్లు అనేది మోదీ సర్కారు నినాదం. దీని సాకారానికి వీలుగా రుణ సబ్సిడీ పథకాన్ని కొనసాగించాలని హౌసింగ్ పరిశ్రమ కోరుతోంది. అందుబాటు ధరల ఇంటికి నిర్వచనాన్ని విస్తరించాలన్న డిమాండ్ కూడా ఉంది. నిర్మాణ రంగ మెటీరియల్ అయిన స్టీల్, సిమెంట్‌పై జీఎస్‌టీ తగ్గించాలని పరిశ్రమ కోరుతోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం గడువును మరింత కాలం పెంచాలని కోరుతోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద రుణంపై కొంత రాయితీ లభిస్తుంది.



రైతులను చూస్తారా..?




సాగు రంగం నుంచి డిమాండ్ల చిట్టా పెద్దదిగానే ఉంది. పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో రైతుకు ఏటా సాగుకు కావాల్సిన ముడి సరుకుల కోసం ఇస్తున్న రూ.6,000ను పెంచాలనే డిమాండ్ ప్రధానంగా వినిపిస్తోంది. దీనివల్ల రైతులు రుణాలతో పనిలేకుండా సాగుకు కావాల్సిన ముడి పదార్థాలను కొనుగోలు చేసుకోగలరన్న సూచన ఉంది. పంటల బీమా పథకాన్ని మరింత మెరుగ్గా రూపొందించాలనే డిమాండ్ సైతం ఉంది. అగ్రి టెక్ స్టార్టప్‌లకు రాయితీలు కల్పించాలని, ఆగ్రోకెమికల్స్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని పరిశ్రమ కోరుతోంది. సాగులో టెక్నాలజీ విస్తరణకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ల వినియోగం పెంచేందుకు చర్యలు ప్రకటిస్తారనే అంచనాలు ఉన్నాయి. ముడి చమురు మాదిరే వంట నూనెల విషయంలోనూ 65 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. దీంతో 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్స్ ఆయిల్స్' పేరుతో నూనె గింజల సాగుకు ఆర్థిక సహకారం అందించాలని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. ఏటా రూ.25,000 కోట్ల చొప్పున ఐదేళ్లపాటు అందించాలని కేంద్రానికి సూచించింది. దీనివల్ల దిగుమతులను 30 శాతానికి తగ్గించొచ్చని పేర్కొంది. సాగు రంగంలో పరిశోధన, అభివృద్ధికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని ధనూకా గ్రూప్ చైర్మన్ ఆర్‌జీ అగర్వాల్ కోరారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ఉన్న బడ్జెట్‌లో వ్యవసాయానికి మెరుగైన కేటాయింపులు చేస్తారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

హెల్త్‌కేర్‌కు పెద్ద పీట వేస్తారా?



ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులను 20–30 శాతం పెంచాలన్న డిమాండ్లు నెలకొన్నాయి. కరోనా మహమ్మారి ఆరోగ్య మౌలిక సదుపాయాల అవసరాన్ని గుర్తు చేసింది. హెల్త్‌కేర్ రంగానికి 2022–23 బడ్జెట్‌లో 16.5 శాతం అధికంగా రూ.86,200 కోట్ల కేటాయింపులు చేశారు. ఈ విడత కేటాయింపులు ఏ మేరకు ఉంటాయన్నది చూడాల్సి ఉంది. బడ్జెట్‌లో కేటాయింపుల పట్ల భారీ అంచనాలతో ఉన్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రెసిడెంట్ డాక్టర్ శరద్ కుమార్ అగర్వాల్ తెలిపారు. ముఖ్యంగా హెల్త్‌కేర్ పరిశ్రమ డిజిటైజేషన్‌కు అదనపు నిధులు అవసరమని అపోలో టెలీహెల్త్ సీఈవో విక్రమ్ తాప్లూ అభిప్రాయపడ్డారు. నేషనల్ డిజిటల్ హెల్త్ ఎకోసిస్టమ్, నేషనల్ టెలీ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ ప్రకటించినప్పటికీ, వీటి విస్తరణకు మరిన్ని నిధుల కేటాయింపు అవసరాన్ని ప్రస్తావించారు. ముఖ్యంగా టెలీ మెడిసిన్ సేవల విస్తరణకు అధిక నిధుల కేటాయింపు అవసరమని డాక్టర్ అగర్వాల్ సైతం పేర్కొన్నారు. స్వచ్ఛందంగా మెడికల్ ఇన్సూరెన్స్‌కు ప్రతిపాదికీ అవకాశం కల్పించాలని కోరారు. అది కూడా ఉచితంగా అందించాలని సూచించారు. కేన్సర్ కేర్ వసతుల పెంపునకు మరిన్ని నిధులు అవసరమని నిపుణుల సూచనగా ఉంది. హెల్త్‌కేర్ మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక నిధి కేటాయించాలనే డిమాండ్ సైతం ఉంది.

మంచి కంపెనీని గుర్తించడం ఎలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మార్కెట్ పతనంలో పెట్టుబడులకు అనుకూలమైన స్టాక్స్‌ను గుర్తించడం ఎలా? - శ్వేత

మార్కెట్లలో కరెక్షన్ మొదలైన తర్వాత పెట్టుబడి పెట్టేందుకు కంపెనీలను అన్వేషించకూడదు. ఒక కంపెనీలో పెట్టుబడి పెట్టడానికి ముందు ఎంతో విస్తృతమైన పరిశోధన, కసరత్తు కావాలి. కంపెనీ ఎప్పటికప్పుడు వ్యాపారంలో వృద్ధి నమోదు చేస్తోందా? అని చూడాలి. రిటర్న్ ఆన్ ఈక్విటీ మంచి రేషియోలో ఉందా? అని చూడాలి. రుణభారంతో నెట్టుకొస్తూ ఉండకూడదు. అంటే ఎక్కువ రుణాలు తీసుకుని ఉండకూడదు. కంపెనీని నడిపించే యాజమాన్యం నిధులు పక్కదారి పట్టించకుండా నిజాయతీగా, సమర్థవంతంగా పనిచేసేదై ఉండాలి. కంపెనీలో ఇన్వెస్ట్ చేస్తున్నారంటే మీ డబ్బులను వేరే వారికి అప్పగిస్తున్నట్టుగా భావించాలి. అందుకే కంపెనీని నడిపించే వ్యక్తులు విశ్వసనీయత కలిగి ఉండాలి. ఇవన్నీ ఒక కంపెనీలో గుర్తిస్తే ఆకర్షణీయమైన ధర వద్ద షేరులో పెట్టుబడులు పెట్టుకోవచ్చు. ఇలాంటి నాణ్యత అంశాలతో కూడిన కంపెనీలను గుర్తించినప్పుడు వాటిని వాచ్ లిస్ట్ (పరిశీలన జాబితా)లో పెట్టుకోవాలి. మీరు గుర్తించిన కంపెనీలు ఖరీదైన వ్యాల్యూయేషన్లలోనే ఎక్కువ రోజుల పాటు ట్రేడ్ కావచ్చు. కానీ, మీరు అనుకున్న ధరకు దిగొచ్చే వరకు వేచి చూడాలి.

55 ఏళ్లకే రిటైర్ అవుదామనుకుంటున్నాను. ఆ సమయానికి నిధిని సిద్ధం చేసుకోవడం ఎలా? - సురేష్

55 లేదా 60 ఏళ్లకు రిటైర్ అవుదామని అనుకుంటే పెట్టుబడులకు 20–25 ఏళ్ల వ్యవధి ఉంటుంది. ఈక్విటీలో పెట్టుబడులు మంచి ప్రతిఫలాన్ని ఇవ్వడానికి ఈ సమయం సరిపోతుంది. అంతేకాదు, మీరు అనుకున్న 55 ఏళ్లకు రిటైర్ అయినా.. ఈక్విటీ పెట్టుబడులకు రిటైర్మెంట్ లేదని గుర్తు పెట్టుకోవాలి. ఈక్విటీల్లో పెట్టుబడుల మొత్తం తీసుకెళ్లి డెట్‌లో ఇన్వెస్ట్ చేయడం సరైన విధానం కాదు. ఈక్విటీల్లో పెట్టుబడులు కొంత భాగం అలానే కొనసాగించాలి. అప్పటి వరకు సమకూర్చుకున్న ఈక్విటీ పోర్ట్‌ఫోలియో నుంచి మీకు సగటు రాబడి వచ్చినా విశ్రాంత జీవనాన్ని సాఫీగా సాగించొచ్చు. కనుక వెంటనే ఈక్విటీల్లో పెట్టుబడులు ప్రారంభించండి. ఒకటి రెండు మంచి ఫ్లెక్సీక్యాప్ (ఫోకస్డ్) ఫండ్స్‌ను ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేసుకోవాలి.

ఇది భారత్‌పై దాడే..



హిండెన్‌బర్గ్ ఆరోపణలపై అదానీ గ్రూప్ వ్యాఖ్యలు • 413 పేజీల్లో హిండెన్‌బర్గ్ ప్రశ్నలకు వివరణ

న్యూఢిల్లీ: అమెరికన్ షార్ట్‌సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికలో చేసిన ఆరోపణలన్నీ పూర్తిగా తప్పులతడకలని అదానీ గ్రూప్ వ్యాఖ్యానించింది. ఇది ఏదో ఒక కంపెనీపై ఊరికే చేసిన దాడి కాదని.. లాభనష్టాలు అన్నింటినీ బేరీజు వేసుకుని భారత్ పైనా .. భారతీయ సంస్థల స్వతంత్రత, సమగ్రత, నాణ్యతపైనా .. భారత వృద్ధి గాథ, ఆకాంక్షలపైనా చేసిన దాడి అని అభివర్ణించింది. ఆరోపణలపై 413 పేజీల్లో అంశాలవారీగా వివరణనిచ్చింది. హిండెన్‌బర్గ్ 88 ప్రశ్నల్లో 65కి సంబంధించి అదానీ పోర్ట్‌ఫోలియో కంపెనీలు ఇప్పటికే వివరాలు వెల్లడించాయని పేర్కొంది. మిగతా 23 ప్రశ్నల్లో 18 .. పబ్లిక్ షేర్‌హోల్డర్లు, థర్డ్‌పార్టీలకు సంబంధించినవని .. మిగతా 5 నిరాధార ఆరోపణలని తెలిపింది. అదానీ గ్రూప్ ఖాతాల్లో, షేర్లలో అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలతో గత 2 ట్రేడింగ్ సెషన్లలోనే గ్రూప్ మార్కెట్ విలువ 50 బిలియన్ డాలర్ల మేర క్షీణించింది. గ్రూప్ రూ. 20,000 కోట్ల భారీ ఎఫ్‌పీఓ సమయంలో హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేయడం గమనార్హం.

క్లుప్తంగా...

గాంధీజీ ఆదర్శాలు దేశానికి తక్షణావసరం: సీఎం కేసీఆర్

మహాత్ముడి వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



సాక్షి, హైదరాబాద్: కుల, మత వర్గాలకు అతీతంగా సర్వజనుల హితమే తన మతమని చాటిన మహాత్మాగాంధీ ఆదర్శాలు భారతదేశానికి తక్షణ అవసరమని సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి (అమరవీరుల దినోత్సవం) సందర్భంగా సీఎం కేసీఆర్ ఆయన్ను స్మరించుకున్నారు. జాతి సమగ్రతను, ఐక్యతను నిలబెట్టేందుకు తన జీవితాన్ని అర్పించిన మహాత్మాగాంధీ ఈ దేశ పురోగమనానికి సదా ఓ దిక్సూచిలా నిలుస్తారని పేర్కొన్నారు. నమ్మిన లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎదురయ్యే ఆటంకాలను లెక్క చేయకుండా ఒక్కొక్కటిగా అధిగమిస్తూ విజయతీరాలకు చేరాలనే స్ఫూర్తిని గాంధీ జీవితం నుంచి ప్రతిఒక్కరూ నేర్చుకోవాల్సి ఉందని సీఎం సూచించారు.

'మూడున్నరేళ్లు... ఎనిమిది లేఖలు'

సాక్షి, హైదరాబాద్: మూడున్నరేళ్లుగా ఎనిమిది సార్లు లేఖలు రాసినా తెలంగాణ ప్రభుత్వం స్పందించని కారణంగానే బయ్యారం స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో జాప్యం జరుగుతోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2019, డిసెంబర్ 18న జరిగిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రతిపాదిత స్థలాల సమాచారం కేంద్ర ప్రభుత్వ సంస్థ మెకాన్‌కు అందజేసే విషయంలో తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం రాలేదని తెలిపింది. ఈ మేరకు ఆర్టీఐ కార్యకర్త ఇనగంటి రవికుమార్ సమాచార హక్కు చట్టం కింద కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖను అడిగిన వివరాల మేరకు సమాధానం పంపింది. తెలంగాణలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి డ్రాఫ్ట్ ఫీజిబిలిటీ రిపోర్ట్ (డీఎఫ్‌ఆర్)కు తుది రూపు ఇచ్చేందుకు అవసరమైన సమాచారాన్ని పంపాలని 2021, జూలై 13, సెప్టెంబర్ 27, డిసెంబర్ 23, 2022, జనవరి 28, మే 5, జూన్ 14, ఆగస్టు 4, నవంబర్ 2 తేదీల్లో తెలంగాణ ప్రభుత్వ మైన్స్ డైరెక్టర్‌కు లేఖలు రాశామని, అయినా స్పందన లేదని రవికుమార్‌కు ఇచ్చిన సమాధానంలో వెల్లడించింది.

ఫైర్ ఆడిటింగ్‌పై అగ్నిమాపక శాఖ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: అగ్ని ప్రమాదాల నియంత్రణలో భాగంగా పటిష్ట చర్యలు తీసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అగ్నిమాపకశాఖ కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. సికింద్రాబాద్‌లోని డెక్కన్ మాల్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద ఘటన తర్వాత ఫైర్ సేఫ్టీ అంశంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన ప్రభుత్వం ఇటీవలే పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ అధ్యక్షతన మంత్రులు మహమూద్‌అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించింది. ఇందులో తీసుకున్న కీలక నిర్ణయాల్లో ఫైర్ సేఫ్టీ ఆడిట్ కూడా ముఖ్యమైంది. హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రంలోని ఇతర నగరాల్లోని భవనాలకు ఫైర్ సేఫ్టీ ఆడిట్ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆ దిశగా చర్యలు తీసుకునేందుకు అగ్నిమాపకశాఖ సమాయత్తం అవుతోంది.

టీ, టిఫిన్, భోజనానికి 2 రూపాయలా?

అదుపులోని నిందితుల రోజు ఖర్చుల కింద పోలీసులకు కేటాయించే మొత్తం ఇంతే!

- అది కూడా బిల్లు సమర్పిస్తేనే నిధుల మంజూరు
- దశాబ్దాలుగా ఇదే నిబంధన.. పెంపును పట్టించుకోని ప్రభుత్వాలు
- ఫలితంగా కొన్నిచోట్ల సొంతంగా ఖర్చు భరిస్తున్న పోలీసులు.. మరికొన్ని చోట్ల నిందితులతోనే..
- ఇప్పటికైనా దీన్ని సవరించాలని కోరుతున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లు



ఓ కేఫ్‌లో ఇరానీ చాయ్ తాగాలంటే ఎంతలేదన్నా రూ. 10 నుంచి రూ. 20 మధ్య ఖర్చు పెట్టాల్సిందే. అలాగే ఒక ఉస్మానియా బిస్కెట్ తినాలంటే కనీసం రూ. 5 చెల్లించాల్సిందే. అలాంటిది పోలీసుల అదుపులో ఉండే నిందితులకు రూ. 2కే ఉదయం టీ, అల్పాహారంతో పాటు రెండు పూటలా భోజనం అందించాలట! ఇదేంటని ఆశ్చర్యపోతున్నారా? అధికారికంగా అదుపులో ఉన్న నిందితుల రోజు ఖర్చుల కింద ప్రభుత్వం పోలీసులకు అంతే ఇస్తోంది మరి!!

సాక్షి, హైదరాబాద్: వివిధ నేరాలకు సంబంధించి అనుమానితులు, నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకోవడం అనివార్యం. అదే సమయంలో వారి యోగక్షేమాల్ని చూడాల్సిన బాధ్యత కూడా పోలీసులపైనే ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నట్లు కుటుంబీకులకు కూడా తెలియదు కాబట్టి వారికి ఉదయం టీ నుంచి రాత్రి భోజనం వరకు అన్నీ పోలీసులే సమకూర్చాల్సి ఉంటుంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ తిండి ఖర్చు దగ్గరే తేడా కొడుతోంది. ఎందుకంటే.. ప్రభుత్వం ప్రతి పోలీసు స్టేషన్‌కు ఒక్కో నిందితుడి ఆహార ఖర్చు కింద అక్షరాలా రెండు రూపాయలు మాత్రమే చెల్లిస్తోంది. నిజాం కాలంలో ఇది ఒక రూపాయిగా ఉండగా కొన్ని దశాబ్దాల క్రితం ఉదారతతో రెట్టింపు చేస్తూ రూ. 2కు పెంచారు. ఆ తరువాత ఈ విషయాన్ని అంతా మరచిపోవడంతో ఇప్పటికీ అదే అమలవుతోంది. దీంతో పోలీసులు ఎవరూ ఈ సొమ్ము తీసుకోవట్లేదు. దానికీ ఓ ఆసక్తికర కారణం ఉందని అధికారులు చెబుతున్నారు.

అసలుకు మించి బిల్లులకు ఖర్చు...

వాస్తవ ఖర్చుల మాట ఎలా ఉన్నా ప్రభుత్వం ఇస్తున్న రూ. 2 అయినా తీసుకుందామనుకున్నా దానికి దాదాపు రూ. 10కిపైగా ఖర్చు చేయాల్సి వస్తోందని పోలీసులు పేర్కొంటున్నారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ, రికవరీల కోసం కనిష్టంగా వారం నుంచి 10 రోజుల పాటు కస్టడీలో ఉంచుకుంటారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఇది అనివార్యంగా మారిపోయింది. చట్ట ప్రకారం ఎవరిని అదుపులోకి తీసుకున్నా కచ్చితంగా 24 గంటల్లో అరెస్టు చూపడమో లేదా విడిచి పెట్టడమో చేయాల్సి ఉంటుంది. అంటే ఒక వ్యక్తికి సంబంధించి రోజుకు రూ. 2 కంటే ఎక్కువ బిల్లు పెట్టుకొనే అవకాశం ఉండదు. అంతకంటే ఎక్కువ బిల్లు పెట్టుకోవాలంటే చట్టపరంగా చిక్కులు ఎదురవుతాయి. ఈ లెక్కన నెలలో అదుపులోకి తీసుకున్న ఒక ఐదుగురు నిందితులకు సంబంధించిన రోజువారీ ఆహార ఖర్చు బిల్లు గరిష్టంగా రూ. 10 వరకే పెట్టాల్సి ఉంది. పైగా దీనికోసం ఓ దరఖాస్తును టైప్ చేసి ఆ మొత్తానికి సరిపడా బిల్లు పెట్టి సంబంధిత ఉన్నతాధికారి కార్యాలయానికి తీసుకెళ్లి మంజూరు చేయించుకొని రావాలి. ఇందుకు సొంత ద్విచక్ర వాహనంలో వెళ్లి రావాల్సి ఉంది. వాటన్నింటికీ కనీసం రూ. 70 ఖర్చు అవుతుంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం పోలీసు విభాగంలో ఎవరూ ఈ బిల్లుల్ని తయారు చేయడం, ఉన్నతాధికారులకు పంపడం చేయట్లేదు. వీలైతే ఈ ఖర్చుల్ని పోలీసులు భరించడమో లేదా సదరు వ్యక్తి జేబులో ఉన్న వాటితో సరిపెట్టడమో చేస్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో నేరుగా ఆ వ్యక్తి ఇంటి నుంచే భోజనం తెప్పించి పెడుతున్నారు. అయితే అనుమానితుడు అనారోగ్యంతో ఉంటే ఈ ఖర్చులకు తోడు వైద్యం, మందుల భారమూ పోలీసులకు అంటుకుంటోంది.



నిందితుల కంటే ఖైదీలకే బెటర్...

నిందితుడిని అరెస్టు చూపించి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాక పోలీసులు విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకుంటే అప్పుడు పోలీసుల కస్టడీలో ఉన్నన్ని రోజులకు బిల్లు పెట్టుకొనే అవకాశం ఉంది. కానీ ఈ మొత్తం కూడా గరిష్టంగా రూ. 28 దాటేందుకు వీల్లేదు. పైగా ఆ సొమ్ము కోసం కూడా పోలీసులు దాదాపు రూ. 70 ఖర్చు పెట్టుకోవాల్సిందే. ఏళ్లుగా ఈ మొత్తాన్ని పెంచకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని పోలీసులు చెబుతున్నారు. రాష్ట్ర జైళ్లలోని ఖైదీలకు ఇచ్చే రేషన్ ఆధారంగా సరాసరి లెక్క కడితే ప్రస్తుతం రోజుకు ఒక్కొక్కరికీ రూ. 16పైనే కేటాయిస్తున్నారు. ఈ మొత్తాన్ని ఎప్పటికప్పుడు పెంచుతున్నారు. కనీసం వారికి ఖర్చు చేసేంత మొత్తం అయినా అదుపులోకి తీసుకొనే నిందితుడు/అనుమానితుడి ఖర్చులకు ఇవ్వాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. అవసరాలు ఒకటే అయినప్పుడు ఠాణాలకు ఓ కేటాయింపు, జైళ్లకు మరో కేటాయింపు ఉండటం సరికాదని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ అంశంపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓ) కోరుతున్నారు.

- ముస్తాబవుతున్న సచివాలయం



కొత్త సచివాలయంలో ఓ సమావేశ మందిరం

అంతర్జాతీయ సమావేశాలకు కేటీఆర్

- అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ఆహ్వానం
- ప్రపంచ పర్యావరణ–జలవనరుల సమావేశాల్లో మంత్రి కీలకోపన్యాసం



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ పర్యావరణ– జలవనరుల సమావేశాల్లో కీలకోపన్యాసం చేయడానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావును అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ నేతృత్వంలోని పర్యావరణ–నీటివనరుల సంస్థ(ఏఎస్‌సీఈ– ఈడబ్ల్యూఆర్‌ఐ) ఆహ్వానించింది. అమెరికా హెండర్సన్‌లో మే నెల 21 –25 తేదీల మధ్య ఈ సమావేశాలు జరుగనున్నాయి. ఏఎస్‌సీఈ–ఈడబ్ల్యూఆర్‌ఐ మేనేజింగ్ డైరెక్టర్ బ్రియాన్ పార్సన్స్‌తోపాటు సంస్థ అధ్యక్షుడు షిర్లీ క్లార్క్ నాయకత్వంలోని ఓ ప్రతినిధి బృందం ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించింది. ప్రాజెక్టు పరిధి– సామర్థ్యంతోపాటు నిర్మాణంలో చూపించిన వేగంపట్ల ఆ ప్రతినిధి బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన పలు నీటిపారుదల ప్రాజెక్టులతో తెలంగాణలో చోటుచేసుకున్న సామాజిక, ఆర్థిక ప్రగతిని ప్రశంసించింది. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఆ ప్రతినిధి బృందం అతితక్కువ సమయంలోనే నీటి వనరుల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించిన తీరుపట్ల అభినందనలు తెలిపింది.

మెగా ప్రాజెక్టుల గురించి వివరించండి...

కాళేశ్వరం లాంటి మెగా ప్రాజెక్టులను సత్వరం పూర్తిచేయడానికి రాష్ట్రప్రభుత్వం అవలంబించిన విధానాలతోపాటు తెలంగాణ సస్యశ్యామల మాగాణంగా మారిన క్రమాన్ని సమావేశాల్లో వివరించాలని కేటీఆర్‌కు పంపిన ఆహ్వానలేఖలో అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ పర్యావరణ–నీటి వనరుల సంస్థ కోరింది. కాగా, 177 దేశాలకు చెందిన 1,50,000 కంటే ఎక్కువమంది సివిల్ ఇంజనీర్లు అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్‌లో సభ్యులుగా ఉన్నారు. 1852లో స్థాపించబడిన ఈ సంస్థ అమెరికాలోనే పురాతన ఇంజనీరింగ్ సొసైటీ. భవిష్యత్ తరాల కోసం పర్యావరణ సమస్యల పరిష్కారంతోపాటు నీటివనరుల సంరక్షణపై ఈ సొసైటీ పనిచేస్తోంది. కాగా, ఆరేళ్ల క్రితం 2017 మే 22న అమెరికాలోని శాక్రమెంటోలో జరిగిన ఈ ప్రతిష్టాత్మక వార్షికోత్సవంలో మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పలు సాగునీటి ప్రాజెక్టులు, నీటిసంరక్షణ కార్యక్రమాల గురించి వివరించారు.

విషమంగానే తారకరత్న ఆరోగ్యం

పరామర్శించిన జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్

సాక్షి బెంగళూరు: సినీనటుడు నందమూరి తారకరత్న ఆరోగ్యం విషమంగానే ఉంది. కుప్పంలో లోకేశ్ పాదయాత్ర ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే ఆయన గుండెపోటుతో కుప్పకూలిన సంగతి తెలిసిందే. వెంటనే ఆయన్ను అక్కడే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని నారాయణ హెల్త్ హృదయాలయ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు తారకరత్నకు అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరోవైపు.. తారకరత్నను ఆయన కుటుంబ సభ్యులు వరుసగా పరామర్శిస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, బీజేపీ నేత పురందేశ్వరి, దివంగత హరికృష్ణ తనయ సుహాసిని, ఇంకా పలువురు కుటుంబ సభ్యులు శనివారం పరామర్శించారు. అయితే, ఆదివారం హరికృష్ణ కుమారులు కల్యాణ్‌రామ్, జూనియర్ ఎన్టీఆర్ దంపతులు, కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, కర్ణాటక వైద్యారోగ్య మంత్రి డాక్టర్ కె. సుధాకర్ తారకరత్నను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తారకరత్న త్వరగా కోలుకుంటారని వీరు ఆశాభావం వ్యక్తంచేశారు.



తారకరత్న తండ్రి మోహనకృష్ణతో మాట్లాడుతున్న జూనియర్ ఎన్టీఆర్

వైద్యానికి తారకరత్న స్పందిస్తున్నారు

మా కుటుంబంలో అనుకోని ఘటన జరిగింది. ఎన్‌హెచ్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. తారకరత్న కూడా గట్టిగా పోరాడుతున్నారు. అన్నకు వైద్యం, మనోబలంతో పాటు అభిమానులు, తాతగారి ఆశీస్సులు ఉన్నాయి. ఆయన త్వరగా కోలుకుని ఇదివరకటిలా మనందరితో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఈ కష్ట సమయంలో ఆప్తుడైన కర్ణాటక వైద్యారోగ్య శాఖ మంత్రి సుధాకర్ అండగా ఉంటున్నందుకు కృతజ్ఞతలు. తారకరత్న వైద్యానికి స్పందిస్తున్నారు. – జూనియర్ ఎన్టీఆర్

9 అడుగుల ద్వారపాలకుడి విగ్రహం గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలంలోని మల్యాల గ్రామ శివారు పొలాల్లో తాజాగా పరిశోధకులు తెలంగాణలోనే అతిపెద్దదైన, దాదాపు 9 అడుగుల ఎత్తున్న ద్వారపాలకుడు విజయుడి విగ్రహాన్ని గుర్తించారు. విశ్రాంత పురావస్తు అధికారి, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు కరుణాకర్, మహ్మద్ నసీరుద్దీన్‌లు ఈ విగ్రహాన్ని ఆదివారం పరిశీలించారు. దాదాపు వెయ్యేళ్ల క్రితం చెక్కిన ఈ గ్రానైట్ శిల్పం కుడి చేతిలో గద, ఎడమ చేయిన సూచీ ముద్రగానూ, పైరెండు చేతుల్లో శంఖుచక్రాలను, తలపై కిరీటం, ఆభరణాలు, నడుము దిగువన వస్త్రాన్ని చెక్కి ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతిమ లక్షణాల ఆధారంగా ఈ శిల్పాన్ని రాష్ట్ర కూటుల అనంతరం కల్యాణ చాళుక్య కాలానికి అంటే 10వ శతాబ్దానికి చెందిందిగా గుర్తించినట్లు శివనాగిరెడ్డి తెలిపారు. దీన్ని సంరక్షించి భావి తరానికి అందించాల్సిన అవసరం ఉందని, ఈ విగ్రహ నేపథ్యాన్ని గుర్తించేందుకు పరిశోధన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



విగ్రహాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.